వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160


నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 236 | ఆదివారం | 26-07-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ప్రధాన్ రాజీనామా ఆమోదం

ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్నారు.



## ప్రజాస్వామ్య విజయం

సోనమ్ వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'ప్రజాస్వామ్య విజయం'గా కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు. ఈ ఫలితానికి దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన, పౌరుల భాగస్వామ్యమే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన పోస్టు చేశారు. వాంగ్‌చుక్ ఈ పరిణామాన్ని 'ప్రజాస్వామ్య విజయం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యం... నేరుగా వీధుల నుంచే వచ్చిన విజయం'గా వర్ణించారు. దీనిని 'శాంతి, సహనం, తరువాయి 8లో



## భారత యువశక్తి ఒత్తిడికి తలొంచిన కేంద్ర సర్కార్



# ధర్మేంద్ర రాజీనామా



## ఆందోళన విరమిస్తున్నాం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి ప్రకటన
- మిగతా రెండు డిమాండ్లు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడి
- కేంద్ర ప్రభుత్వంతో ముగిసిన చర్చలు
- జంతర్ మంతర్ వద్ద మిన్నంటిన హర్షధ్వానాలు

భారత్ యువశక్తి ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం తలవంచింది. ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థి ఆందోళనకు ఉక్కిరిబిక్కిరై వారి ప్రధాన డిమాండ్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి జవాబుదారీగా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం రాజీనామా చేయించారు. మిగతా రెండు కోర్కెలు – నీట్ ఆందోళన సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులపై పెట్టిన కేసుల ఎత్తివేత, ప్రశ్నాపత్రం లీకేజి పర్యవసానంగా ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపును ఇంతకుముందు చర్చల్లోనే కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినందున – ప్రధాన్ రాజీనామా కోర్కె కూడా నెరవేరటంతో జంతర్‌మంతర్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు (కాక్రోచ్‌లు – బొద్దింకలు) కేరింతలు కొట్టారు. కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకులు అభిజీత్ దీప్కే తదితరులు తమ తొలివిజయానికి ఉప్పొంగిపోతూ, 'కాక్రోచ్‌లు గెలిచాయి, ప్రజాస్వామ్యం గెలిచింది' అంటూ, ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల విజయానికి రాహుల్ గాంధీ తదితర నేతలు జేజేలు పలికారు. ఆ తదుపరి మధ్యాహ్నం కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేందర్ సింగ్ – సిజెపి అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ మధ్య జరిగిన చర్చల్లో మిగతా రెండు డిమాండ్‌లకు ప్రభుత్వం అంగీకరించింది. ఇదిలా వుండగా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్దిసేపటికే, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే (శివసేన)లకు ఢిల్లీ రావలసిందిగా బిజెపి నాయకత్వం వర్తమానం పంపటంతో కాబోయే విద్యామంత్రి ఫడ్నవీస్ అనే పుకార్లు బయలుదేరాయి. విద్యార్థి ఉద్యమ విరమణతో సెంట్రల్ ఢిల్లీలో వేగంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పోలీసులు ఆటంకాలు తొలగించారు. వారం రోజులుగా మూసివేసిన 15–16 మెట్రో స్టేషన్‌లు తిరిగి తెరిచారు. బస్సులు రోడ్డెక్కాయి. జంతర్‌మంతర్‌లో జూన్ 6 నుంచి నవతరం ఆన్‌లైన్ పార్టీ 'కాక్రోచ్ జనతాపార్టీ' (సిజెపి) పిలుపుపై, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ బాధ్యులపై చర్యలు, పరీక్షల సంస్కరణలు కోరుతూ చేస్తున్న నిరసన – నిరాహార దీక్షలు క్రమంగా బలం పుంజుకుని, ఈనెల 20న పార్లమెంటుకు మార్చ్ పై పోలీసు పైశాచిక దాడులతో తీవ్రతరమైంది. ఉద్యమం అనేక నగరాలకు విస్తరించింది. రెండోవైపున, వారికి సంఘీభావంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి పార్లమెంటులోపల, బయట చేసిన ఆందోళన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టటం తెలిసిందే.



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ వ్యవహారంపై తన రాజీనామాను కోరుతూ నిరసనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాన్ తలొగ్గక తప్పలేదు. ఇది తనకు వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని, జంతర్ మంతర్, దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దేశ వ్యతిరేక శక్తులు తమకు అనుకూలంగా మలచుకోకుండా నివారించడమే తన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో రాజీనామా లేఖను పోస్టు చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మొదటి రోజు నుండే తాను బాధ్యత వహించానని ప్రధాన్ తెలిపారు. గత 10 రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలను చూసి కలత చెందిన ఆయన, తన రాజీనామా లేఖను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. నీట్ పేపర్ లీక్ విషయంలో మొదటి రోజు నుండే తాను తరువాయి 8లో

పరీక్షా విధానంలో అక్రమాలు, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) నాయకత్వంలో వేలాది మంది విద్యార్థులు విజయం సాధించారు. వారు చేట్టిన నిరసనలకు ఫలితం దక్కింది. విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వంటి ఇతర రెండు డిమాండ్లకు కూడా ప్రభుత్వం అంగీకరించింది. దీంతో జంతర్ మంతర్ వద్ద సిజెపి చేపట్టిన 36 రోజుల నిరసనను విరమిస్తున్నట్లు శనివారం ఆ పార్టీ ప్రకటించింది. పరీక్షా విధానంలో అక్రమాలు, నీట్ పేపర్ లీక్ వ్యవహారాలపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద జూన్ 20న ప్రారంభమై వేలాది మంది విద్యార్థులను ఏకం చేసిన ఈ అపూర్వమైన సిజెపి నిరసనల ముగింపును, కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్, సిజెపి ప్రతినిధులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. '36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం మా డిమాండ్లన్నింటినీ తరువాయి 8లో

పేపర్ లీకేజీ కేసులపై

## రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి

'రేపు' లోక్‌సభలో కేంద్రం బిల్లు

**న్యూఢిల్లీ :** రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన పేపర్ లీకేజీ నిరోధక చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.నిందితుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రతీ రాష్ట్రంలోనూ ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026, ప్రకారం పేపర్ లీకులపై దర్యాప్తును రెండు నెలల్లో పూర్తిచేయవచ్చు. బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు, లోక్‌సభ సభ్యులకు పంపిణీ చేయబడిన బిల్లు ప్రకారం, పేపర్ లీక్‌లు లేదా అక్రమ పద్ధతులలో పాల్గొన్న వ్యక్తులకు కనీసం 5 సంవత్సరాల నుంచి గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. సంఘటిత నేరాలకు ఈ బిల్లు కనీసం ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10కోట్ల వరకు జరిమానా తరువాయి 8లో

## తప్పు చేస్తే ప్రజల ముందు తలొంచాల్సిందే



- ప్రధాన్ రాజీనామా పెద్ద ముందడుగు
- ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైంది
- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ఖర్గే


**న్యూఢిల్లీ :** ఏ ప్రభుత్వమైన తప్పు చేస్తే ప్రజల ముందు తలవంచాల్సిందేనని కాంగ్రెస్ పేర్కొంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. కాగా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే విద్యార్థులు, యువతను అభినందించారు. అలాగే, ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. ధైర్యంతో ముందుకు రావాలని ఇతర వర్గాలకు పిలుపునిచ్చారు. 'భయపడకండి. భారతదేశంపై దాడి చేస్తూ, మన రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, మన వ్యవస్థలన్నింటినీ తమ గుప్పిట్లోకి తీసుకుంటున్న ఈ పాలనను మనం అంతం చేద్దాం' అని ప్రధాన్ రాజీనామా తర్వాత ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో తరువాయి 8లో

## బిజెపి అహంకారం ఓడింది



- దేశ విద్యార్థి–యువత ఉద్యమానికి చరిత్రాత్మక విజయం
- ప్రజాస్వామ్య విద్యావ్యవస్థకోసం పోరాటం ముగిసిపోలేదు
- ప్రజాస్వామ్యశక్తులతో కలిసి ఉమ్మడి పోరాటం కొనసాగిస్తాం
- సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశంలో విద్యార్థులు, యువజనులు చేసిన ఉద్యమానికి చరిత్రాత్మక విజయమని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం జేజేలు పలికింది. ఈ మేరకు పార్టీ శనివారం ఒక ప్రకటన చేస్తూ, దేశంలో విద్యార్థి ఉద్యమం బిజెపి అహంకారాన్ని ఓడించిందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రభుత్వ వైఫల్యాలకు తగిన జవాబు చెప్పేలా చేసిందని ప్రశంసించింది. కేంద్రమంత్రి రాజీనామా ఒక ముఖ్యమైన విజయమైనప్పటికీ న్యాయబద్ధమైన,ప్రజాస్వామ్యయుతమైన విద్యావ్యవస్థకోసం చేసే పోరాటం ఇంకా ముగిసిపోలేదని స్పష్టం చేసింది. అత్యున్నతమైన నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యావ్యస్థను సాధించేందుకు దేశంలోని విద్యార్థులు,యువకులు,ఉపాధ్యాయులు సహా సమాజంలో ఉన్న అన్ని ప్రజాస్వామ్యశక్తులతో సర్వులనూ సమ్మిళితం చేసుకుని ఉమ్మడి పోరాటం చేస్తామని పార్టీ తన సంకల్పాన్ని, చిత్తశుద్ధిని తరువాయి 8లో



## విద్యార్థుల ఉద్యమ విజయం

27న తలపెట్టిన కార్యక్రమం మార్పు

- జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు
- లోక్‌భవన్ ముట్టడి, కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు రద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

03




- నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా నెక్లెస్ రోడ్‌లో కాంగ్రెస్, వామపక్షాల నేతలు కొవ్వొత్తుల ర్యాలీ
- ఎమ్మెల్యే, ఎంపి పోటీ వయసును 21 ఏళ్లకు తగ్గించే తీర్మానం చేస్తాం : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



## జెన్ జీ పోరాటానికి తలొగ్గిన కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

"నీట్ పరీక్షల వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమమే కేంద్ర ప్రభుత్వం తలవంచడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది. 56 అంగుళాల ఛాతీ యువత ముందు వంగిపోయింది. ఈ విజయం ఏ రాజకీయ పార్టీది కాదు. జెన్ జీ యువతది' అయితే రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదు. విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగాలి. దేశవ్యాప్తంగా 22 రోజులుగా విద్యార్థులు, యువకులు, ఇండియా కూటమి, కాంగ్రెస్, వామపక్షాలు చేపట్టిన పోరాటం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం. యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా ఎమ్మెల్యే, ఎంపిగా పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. ఇందు కోసం ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తాం'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. నీట్ ప్రశ్నపత్రాల లీక్ ఘటనతో పాటు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అమానుష లాఠీఛార్జిని నిరసిస్తూ, విద్యార్థుల ఉద్యమానికి తరువాయి 12లో

## యువత ఉద్యమ ఫలితం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి ఫలితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లావెంకట్‌రెడ్డి అన్నారు. ఈ రాజీనామా 'ప్రజాస్వామ్య విజయం' అని, విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నిలిచిన అన్ని రాజకీయ పార్టీలకు అభినందనలు తెలిపారు. గత 22 రోజులుగా విద్యార్థులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి, వామపక్షాలు కలిసి నీట్ పరీక్షల నిర్వహణలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టడం గమనార్హమన్నారు. నీట్ పరీక్షల తరువాయి 12లో

## బిహార్‌లో నిరసనాగ్ని

- హింసాత్మకంగా మారిన బంద్
- పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థి సంఘాల నిరసన ప్రదర్శనలు
- పలు జిల్లాల్లో పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ



**పాట్నా:** 'నీట్' పేపర్ లీక్‌పై బిహార్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్ని రగులుతోంది. నిరసనలు కొనసాగిస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు మద్దతుగా బిహార్‌లోని పలు జిల్లాలలో శనివారం వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులు ప్రదర్శనలు నిర్వహించారు. కాగా, పోలీసులతో వారు ఘర్షణ పడ్డారని అధికారులు తెలిపారు. పట్నా, సరన్, సివాన్, ఔరంగాబాద్, భాగల్పూర్‌లలో బంద్ హింసాత్మకంగా మారిందని, సమస్తిపూర్, నవాడా, సలందా జిల్లాల్లో స్వల్ప నిరసనలు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలియజేశారు. బంద్ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా భారీయెత్తున పోలీసులను మోహరింపజేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పట్నాలోని డాక్ బంగ్లా చౌరహ్ వద్ద నిరసనకారులు పోలీస్ సిబ్బందిపై రాళ్లు, ఇటుకలు రువ్వడంతో, అనంతరం పోలీసులు పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. 'నిరసనకారులు మాపై రాళ్లు రువ్వారు. వారు బారికేడ్లను పగుల గొట్టేందుకు కూడా ప్రయత్నించారు. మేం పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నాం. పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. గొడవకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై మేం తగిన చర్యలు తీసుకుంటాం' అని పట్నా ఎస్‌ఎస్‌పి కార్తికేయ కె.శర్మ విలేకరులకు తెలిపారు. గుంపు మరింత పెరగకుండా నివారించేందుకు, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు స్వల్ప బలప్రయోగం చేయాల్సి వచ్చిందని ఒక అధికారి చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు సిబ్బంది సెలవులు అన్నింటినీ రద్దు చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ముందస్తు జాగ్రత్తచర్యగాపాట్నాలోని పాలిగంజ్ ప్రాంతంతో సహా పలు ప్రాంతాలలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ తరువాయి 12లో




## హెచ్1బిపై ట్రంప్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

- లక్షడాలర్ల ఫీజు హామీపై అప్పీల్ తిరస్కరణ

**వాషింగ్టన్ :** ఎలాగైనా హెచ్1బి వీసాల నుండి లక్ష డాలర్లు వసూలు చేయాలని పట్టుదలతో ఉన్న ట్రంప్‌కు అమెరికా న్యాయస్థానంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కొన్ని ప్రత్యేక రంగాలలో అపార నైపుణ్యంగల కార్మికులను విదేశాల నుండి తెచ్చుకోవడానికి కంపెనీలకు ఉన్న అనుమతికి సంబంధించిన వీసాలపై ముక్కుపిండి భారీగా లక్ష డాలర్లు వీసా దరఖాస్తు రుసుము వసూలు చేయాలని ట్రంప్ నిర్దేశిత ఉత్తర్వును దిగువ కోర్టు కొట్టివేసిన తర్వాత కూడా ఆయన పాలనాయంత్రాంగం స్టే మంజురు చేయాలని పునఃసమీక్ష పేరుపై కోర్టును ఆశ్రయించింది. కానీ బోస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఫస్ట్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లోని ముగ్గురు న్యాయమూర్తులు ఈ రివ్యూ పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా శనివారం తిరస్కరించారు. ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వుకు దేశ అత్యున్నత చట్టసభ కాంగ్రెస్ ఉభయ సభల ఆమోదం లేదని పేర్కొంది. ట్రంప్ ఇప్పటికే తరువాయి 12లో





## విచిత్ర సముద్ర జీవి..



అత్యంత విచిత్రమైన సముద్ర జీవిగా 'రెడ్‌లిప్డ్ బ్యాట్‌ఫిష్' ను పేర్కొన వచ్చు. ఇది ప్రధానంగా గాలాపగోస్ దీవులు, అలాగే పెరూ తీర ప్రాంత సముద్ర జలాల్లో కనిపించే అరుదైన చేప. ప్రపంచంలోనే అత్యంత వింతగా కనిపించే సముద్ర జీవుల్లో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ చేపను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని ప్రకాశవంతమైన ఎర్రటి పెదవులు. మనుషులు లిప్‌స్టిక్ వేసుకున్నట్లుగా కనిపించే ఈ పెదవులు పూర్తిగా సహజసిద్ధమైనవి. ఈ ఎర్రటి రంగు ఎందుకు ఏర్పడిందనే విషయంపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. రెడ్ లిప్డ్ బ్యాట్‌ఫిష్ ఇతర చేపల్లా వేగంగా ఈదదు. చిన్న వయస్సులో కొంత ఈదగలిగినా, పెద్దదైన తర్వాత ఎక్కువ సమయం సముద్రపు అడుగునే గడుపుతుంది. తన ఛాతీ, పొత్తికడుపు రెక్కలను కాళ్ల మాదిరిగా ఉపయోగిస్తూ ఇసుక, రాతి నేలపై నెమ్మదిగా నడుస్తుంది. అందుకే దీనిని చూసినవారికి ఇది చేప కంటే సముద్రపు నేలపై నడిచే వింత జీవిలా అనిపిస్తుంది. దీని తలపై 'ఇలిసియం' అనే ప్రత్యేక నిర్మాణం ఉంటుంది. అవసరమైనప్పుడు దానిని బయటకు తీసి చిన్న ఎరలా కదిలిస్తూ పురుగులు, రొయ్యలు, చిన్న చేపలు, పీతలను దగ్గరకు రప్పిస్తుంది. అవి చేరువకు రాగానే ఒక్కసారిగా వాటిని పట్టుకుని ఆహారంగా తీసుకుంటుంది. ఈ తెలివైన వేట పద్ధతి దీనిని ఇతర చేపల నుంచి భిన్నంగా నిలబెడుతుంది. సాధారణంగా 20 నుంచి 40 మీటర్ల లోతులో నివసించే ఈ చేప శరీర రంగు, ఆకారం సముద్రపు అడుగుభాగంలో కలిసిపోయేలా ఉండటంతో శత్రువుల కంటపడకుండా దాక్కోగలదు. అవసరమైతే కొద్దిదూరం ఈదగలిగినప్పటికీ, దీని ప్రధాన జీవన విధానం సముద్రపు అడుగున నడవడమే. ప్రకృతిలోని అద్భుతమైన పరిణామ క్రమానికి రెడ్‌లిప్డ్ బ్యాట్‌ఫిష్ ఒక అరుదైన ఉదాహరణ.

## భూమిపై ఎనిమిదో ఖండం!




భూమి మనకు తెలిసిన ఏడు ఖండాలకే పరిమితం కాకుండా, సముద్ర జలాల అడుగున దాదాపు పూర్తిగా దాగి ఉన్న మరో విశాల భూభాగం కూడా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దానినే 'జీలాండియా' అని పిలుస్తున్నారు. ఆస్ట్రేలియాకు తూర్పున, న్యూజిలాండ్ చుట్టుపక్కల విస్తరించి ఉన్న ఈ భూభాగం సుమారు 49లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. అయితే ఇందులో దాదాపు 94 శాతం భాగం సముద్ర జలాల అడుగునే ఉండటంతో, సముద్ర మట్టానికి పైన కనిపించేది ప్రధానంగా న్యూజిలాండ్, న్యూ కాలెడోనియా, మరికొన్ని చిన్న దీవులు మాత్రమే. 2017లో భూగర్భ శాస్త్రవేత్తలు ప్రచురించిన ఒక ప్రముఖ పరిశోధనలో, జీలాండియాను ప్రత్యేక ఖండంగా పరిగణించేందుకు అవసరమైన అన్ని ప్రధాన భౌగోళిక లక్షణా లు దీనికి ఉన్నాయని వివరించారు. సముద్రపు అడుగుతో పోలిస్తే ఎత్తైన భూభాగం, ప్రత్యేక భౌగోళిక నిర్మాణం, మందమైన ఖండ భూపటలం (కాంటినెంటల్ క్రస్ట్), స్పష్టమైన భౌగోళిక సరిహద్దులు వంటి ప్రమాణాలన్నింటినీ జీలాండియా నెరవేరుస్తుందని వారు పేర్కొన్నారు. అయితే, జీలాండియాను ప్రపంచంలోని అన్ని శాస్త్రీయ సంస్థలు లేదా అంతర్జాతీయ భౌగోళిక సంస్థలు అధికారికంగా భూమిపై ఎనిమిదవ ఖండంగా ప్రకటించలేదు. అయినప్పటికీ, భూగర్భ శాస్త్రవేత్తలలో గణనీయమైన వర్గం దీనిని స్వతంత్ర ఖండంగా పరిగణిస్తోంది. చాలామంది భూగర్భ శాస్త్రవేత్తలు జీలాండియాను ప్రత్యేక ఖండంగా గుర్తిస్తున్నారు అని చెప్పడం మరింత శాస్త్రీయంగా సరైనది. ఏదిఏమైనా, జీలాండియా ఆవిష్కరణ భూమి భౌగోళిక చరిత్రపై మన అవగాహనను మరింత విస్తరించింది.

## వింత జీవి ఉన్నట్టా? లేనట్టా?



ఆర్కిటిక్ ప్రాంతాల్లో, 18వ శతాబ్దానికి చెందిన జర్మన్ ప్రకృతి శాస్త్రవేత్త జార్జ్ విల్‌హెల్మ్ స్టెల్లర్ చేసిన పరిశోధనలతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. రష్యా అన్వేషకుడు విటస్ బేరింగ్ యాత్రలో పాల్గొన్న ఆయన అనేక కొత్త జంతు, వృక్ష జాతులను శాస్త్రీయ ప్రపంచానికి పరిచయం చేశాడు. స్టెల్లర్ పరిశీలనలు అత్యంత విశ్వసనీయమైనవిగా గుర్తింపు పొందాయి. అందుకే స్టెల్లర్ సముద్ర ఆవు, స్టెల్లర్ సముద్ర సింహం, స్టెల్లర్ ఈడర్ వంటి అనేక జీవజాతులకు ఆయన పేరు పెట్టారు. అయితే ఆయన రచనల్లో 'డానిష్ సీ ఏప్' అనే విచిత్రమైన సముద్ర జీవి గురించిన వర్ణన కూడా కనిపిస్తుంది. కోతి లాంటి తల, వింత ప్రవర్తన కలిగిన ఈ జీవిని స్టెల్లర్ ఎంతో వివరంగా వర్ణించడంతో, అది నిజంగానే ఉండి ఉండవచ్చని ఒకప్పుడు కొందరు శాస్త్రవేత్తలు భావించారు. కానీ తరువాతి పరిశోధనల్లో ఈ వర్ణన వెనుక మరో ఆసక్తికరమైన కోణం వెలుగులోకి వచ్చింది. స్టెల్లర్ ప్రయాణించిన నౌక కెప్టెన్ డానిష్ వంశానికి చెందినవారిది. అతనితో స్టెల్లర్‌కు తరచూ విభేదాలు ఉండేవి. అందువల్ల ఆ కెప్టెన్ వ్యక్తిత్వాన్ని నేరుగా విమర్శించకుండా,ఒక కల్పిత సముద్ర జీవి రూపంలో వ్యంగ్యంగా చిత్రించి ఉండవచ్చని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిపై పూర్తి ఏకాభిప్రాయం లేదు. స్టెల్లర్ స్వయంగా అది వ్యంగ్య రచనే అని ఎక్కడా పేర్కొనలేదు. కొందరు పరిశోధకులు ఆయన నిజంగానే ఏదో తెలియని సముద్ర జీవిని చూసి ఉండవచ్చని కూడా భావిస్తున్నారు. అందువల్ల 'డానిష్ సీ ఏప్' కథ ఇప్పటికీ చరిత్ర, శాస్త్రం, సాహిత్యం కలిసిన ఒక ఆసక్తికరమైన మిస్టరీగానే మిగిలిపోయింది.

## అమెరికా నీటి భద్రతకు ముప్పు!



అమెరికా వ్యవసాయానికి, తాగునీటి భద్రతకు కీలక ఆధారంగా నిలిచిన 'ఒగల్లా లా అక్విఫర్' వేగంగా క్షీణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దక్షిణ డకోటా నుంచి టెక్సాస్ వరకు విస్తరించిన ఈ భూగర్భ జలాశయం నెబ్రాస్కా, కాన్సాస్, కొలరాడో, ఒక్లహోమా, న్యూ మెక్సికో, వ్యోమింగ్ రాష్ట్రాల భాగాలను కలుపుకొని సుమారు 1.74 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. దేశ వ్యవసాయ ఉత్పత్తిలో సుమారు 20 శాతం, ముఖ్యంగా మొక్కజొన్న, గోధుమలు, పత్తి, పశువుల మేత పంటల సాగు దీనిపైనే ఆధారపడి ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా భూగర్భ జలాలను అధికంగా పంపింగ్ చేయడం, సాగుభూముల విస్తరణ, వరుస కరువులు, ఆధునిక నీటిపారుదల పద్ధతుల విస్తరణ వంటి కారణాలతో ఈ జలాశయంపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం 150 అడుగులకు పైగా పడిపోయింది. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, వర్షపు నీరు భూమిలోకి చొచ్చుకుపోయి అక్విఫర్‌ను పునరుద్ధరించడానికి వందల నుంచి వేల సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చు. దే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో అమెరికాలోని అనేక వ్యవసాయ ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. దీంతో రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పెరిగే పంటలను ఎంచుకోవాల్సి రావచ్చు. కొన్ని ప్రాంతాల్లో సాగుభూముల విస్తీర్ణం కూడా తగ్గే అవకాశం ఉంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అమెరికాలోని పలు రాష్ట్రాలు డ్రిప్, సెంటర్ పివట్ వంటి నీటి పొదుపు సాంకేతికతలను ప్రోత్సహించడం, భూగర్భ జల వినియోగంపై నియంత్రణలు విధించడం, తక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ సమస్య తీవ్రత దృష్ట్యా ఇవి మాత్రమే సరిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. **– బిఎస్ఎస్ మైత్రేయి**

# ప్రభుత్వం మెడలు వంచిన 'కాక్రోచ్‌ల' ఆందోళన

పట్టువిడవని నవతరం (జన్–జడ్) విద్యార్థుల ప్రజాస్వామ్యయుత ఆందోళన కేంద్ర సర్కార్ మెడలు వంచింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజికి జవాబుదారీగా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను తిరస్కరిస్తూ వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ విధిలేని పరిస్థితిలో శనివారం మధ్యాహ్నం ఆయన చేత రాజీనామా చేయించారు. ఇది యువశక్తికి విజయంగా, ప్రజాస్వామ్య విజయంగా జంతర్‌మంతర్‌లో కేరింతలు కొట్టిన కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకోగా, 'కాక్రోచ్‌లు గెలిచాయి, ప్రజాస్వామ్యం గెలిచింది' అని ప్రకటించిన సిజెపి ఆన్‌లైన్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అంబేద్కర్ చిత్రపటాన్ని, రాజ్యాంగాన్ని చేబూని, ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. తమకు రాజకీయాలు అవసరం లేదన్నారు. ప్రధాన్ రాజీనామాకు ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై రాజీలేదని, ఆయన రాజీనామా చేస్తేనే ఈ రోజు (శనివారం మధ్యాహ్నం) చర్చలకు వస్తామని, లేనిపక్షంలో ప్రధాన్ బదులు ప్రధానమంత్రి రాజీనామా కోరాల్సి ఉంటుందని సిజెపి 'ఎక్స్'లో పోస్టు పెట్టినట్లు ఉదయాన్నే టీవీలు స్క్రోలింగ్ మోసుకొచ్చాయి. విద్యార్థులను సంతృప్తి పరిచేందుకై ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి వేరేశాఖకు మార్చవచ్చన్న ప్రచారానికి జవాబుగా వారు ఆ ట్వీట్ చేశారు. కాక్రోచ్‌ల మహిళాబృందం, కాంగ్రెస్ నేత, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని కలిసి తమ డిమాండ్‌లకు ఆయన మద్దతు కోరారు. విద్యార్థులు ప్రధాన్ రాజీనామా కోరుతున్నారని, వారి కోర్కెలను తాము బలపరుస్తున్నామని రాహుల్ గాంధి ప్రకటించారు. మోదీ ప్రభుత్వం ఒకవైపు సిజెపి ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే, మరోవైపున వారి ఆందోళనపై బురద జల్లేందుకు సంఘ వ్యతిరేకులు, దేశద్రోహులు, విదేశీ శక్తులు ఉద్యమంలో చేరారనే ప్రచారం చేస్తూనే వచ్చింది. పోలీసులు కూడా అదే ప్రచారం చేస్తూ పాత నేరస్థులను గుర్తించేందుకు అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించారు. ఎన్‌ఏటిలో ప్రక్షాళన చర్యలతోపాటు లీకేజీలకు పాల్పడేవారికి కఠిన శిక్షలకోసం చట్టసవరణను కేంద్రమంత్రివర్గం శుక్రవారమే ఆమోదించి ఆ నిర్ణయాలకు ప్రచారం ఇచ్చింది. వాంగ్‌చుక్ చేత 26 రోజుల నిరాహారదీక్షను మంత్రులు శుక్రవారం విరమింపజేశారు. అయితే ఈ ప్రయత్నాలేవీ సిజెపి నాయకత్వాన్ని బుజ్జగించలేకపోయాయి. ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను వారు సడలించలేదు. రోజులు గడిచేకొలది విద్యార్థి ఉద్యమం వివిధ రాష్ట్రాల్లోని పట్టణాలకు విస్తరిస్తున్నది. సోమవారం పార్లమెంటు సమావేశాలు పునఃప్రారంభం కానున్నాయి. కాబట్టి, ఇంకా రచ్చ నష్టదాయకమని భావించిన ప్రభుత్వ ముఖ్యులు బహుశా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశంపై ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు. పోలీసులు జంతర్‌మంతర్ దగ్గర అవరోధాలు తొలగించారు. సెంట్రల్ ఢిల్లీలో కొన్ని రోజులుగా మూసివేసిన 16 మెట్రోస్టేషన్‌లు తిరిగి తెరిచారు. మధ్యాహ్నం 3గంటల తర్వాత కేంద్రమంత్రులు జె.పి.నడ్డా, జితేంద్రసింగ్ – సిజెపి అధికార ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోష్ మధ్య చర్చలు పునఃప్రారంభమైనాయి. కాక్రోచ్‌ల మిగతా రెండు కోర్కెలకు – విద్యార్థులపై పెట్టిన కేసుల ఎత్తివేత, నీట్ లీకేజి తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా – ప్రభుత్వం అంగీకరించింది.

ఇది తిరుగులేదనుకునే నరేంద్రమోదీకి మూడో ఎదురుదెబ్బ. తొలిటరంలో భూసేకరణ పరిహారాలు తగ్గించటానికి ఆయన తెచ్చిన ఆర్డినెన్స్‌లను రైతాంగం వ్యతిరేకించటంతో ఉపసంహరించుకున్నారు. రెండవటరంలో కార్పొరేట్ వ్యవసాయానికి అనుకూలంగా మోదీ తెచ్చిన మూడు నల్లచట్టాలను – ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సంవత్సరంపాటు బైఠాయింపు ఆందోళన జరిపి, ఎముకలు కొరికే చలిలో 100 మందికిపైగా చనిపోయాక ప్రధాని మోదీ (యుపి అసెంబ్లీ ఎన్నికలకు ముందు) దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. మూడవ టరంలో విద్యార్థుల ఆగ్రహానికి గురైనారు.

ఏ దేశ యువత భవిష్యత్‌కైనా సమాజ అవసరాలకు తగిన విద్యావ్యవస్థ అత్యంతావశ్యకం. అయితే శాస్త్రం కన్నా సనాతన ధర్మంలో విశ్వాసం కలిగి ఉన్న బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సనాతన ధర్మ ఛాయల్లో విద్యార్థుల ఆలోచనను ప్రభావితం చేయటం పనిగా పెట్టుకుంది. పాఠ్యపుస్తకాల్లో అది చేస్తున్న మార్పులు చేర్పులు ఇందుకు నిదర్శనం. ఉన్నతవిద్యను కేంద్రీకరణ చేస్తున్నది. రెండోవైపున నిరుద్యోగం తాండవిస్తున్నది. ఏటా 2కోట్ల ఉద్యోగాల వాగ్దానంతో 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ఆ మాట మరిచిపోయారు. విద్య ప్రైవేటీకరణ పెరుగుతుండటంతో అది సామాన్యులకు ప్రతిభ ఉన్నా ఆర్థికంగా మోయలేని భారమైంది. అన్ని పైచదువులకూ పోటీ పరీక్షలు ప్రవేశపెట్టటంతో కోచింగ్ సెంటర్‌లు విద్యార్థుల కుటుంబాలను పిండుకుంటున్నాయి. మాఫియాలుగా ఏర్పడి ప్రశ్నాపత్రాలతో చీకటి వ్యాపారం చేస్తున్నాయి. ఆ దొంగ వ్యాపారం కొనసాగింపే నీట్–యుజి, 2026 ప్రశ్నాపత్రం లీకేజి. 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వ బాధ్యుల్లో చలనం లేదు. ఎక్కడో అమెరికాలో చదువుకుంటున్న అభిజీత్ దీప్కే అనే విద్యార్థి చలించాడు. అప్పుడే నిరుద్యోగులగూర్చి ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన 'కాక్రోచ్‌లు' అన్నట్లు చెప్పబడుతున్న వ్యాఖ్యను వ్యంగ్యంగా తీసుకుని ఆన్‌లైన్‌లో ఆ పేరుతో పార్టీ ప్రకటించాడు. మూడు–నాలుగు రోజుల్లోనే ఐదారు లక్షలమంది ఫాలోవర్లు చేరటంతో బెదిరిపోయిన మన ఘనత వహించిన మోదీ ప్రభుత్వం సామాజిక మాధ్యమం నుంచి ఆ సైట్‌ను నిషేధింపజేసింది. దీప్కే ఆ తర్వాత స్వదేశం వచ్చాడు. హిందూత్వ దురహంకారులు అతని పర్యటనలను అడ్డుకున్నారు. వారి భయపెట్టే ప్రయత్నాలు ఫలించలేదు. అతడు నెల రోజుల్లోనే జంతర్‌మంతర్ చేరాడు. సోషల్ మీడియా ద్వారా ఉద్యమం నిర్మించాడు. ఇది మన దేశంలో కొత్త. దాని పరిణామాలు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో చూశాం. ఇంతటి సువిశాల దేశంలో, పాలకపార్టీ బలంగా వేళ్లూని ఉండగా ఆ తరహాలో ప్రభుత్వ మార్పు సాధ్యం కాదని కాక్రోచ్‌లకూ తెలుసు. అందుకే నీట్ ప్రశ్నాపత్రం లీక్‌తో అసంతృప్తితో ఉడికిపోతున్న విద్యార్థులను తమ ఉద్యమానికి లక్ష్యంగా ఎంచుకున్నారు. విజయం సాధించారు.

అయితే ఇది అంతం కాదు – ఆరంభం మాత్రమే. దేశ భవిష్యత్‌లో యువత నిజంగా పాత్ర వహించాలంటే ప్రతిపక్షాలతోపాటు సామాజిక ఉద్యమాలు దేగ కన్నుతో పనిచేయాలి. అటువంటి ఐక్యత ఫలితాలు సాధిస్తుందని కాక్రోచ్‌ల అయత్నకృత ఆందోళన నిరూపించింది. ●

# కృత్రిమ మేధ యుగం, మానవీయ శాస్త్రాల భవిష్యత్తు


కృత్రిమ మేధ కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణగా మిగలకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా వ్యవస్థల నిర్మాణాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది. ఏ దేశం చూసినా ఒకే సందేహం, రేపటి ఉద్యోగ మార్కెట్‌కు ఈనాటి డిగ్రీలు సరిపోతాయా అని. అయితే ఈ సందేహానికి జవాబు వెతికే పద్ధతి దేశాన్ని బట్టి పూర్తిగా భిన్నంగా ఉంది. కొన్ని దేశాలు కోర్సులను తొలగించే కఠిన మార్గం ఎంచుకుంటే, మరికొన్ని ఉన్న కోర్సులకే ఏఐను జోడించే సున్నిత మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ఈ రెండు మార్గాల మధ్య మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల భవిష్యత్తు ఏమిటన్నది అసలైన చర్చనీయాంశం.

2021 నుంచి 2025 మధ్య చైనా తన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో పన్నెండు వేల రెండు వందలకు పైగా కోర్సులను రద్దు చేసి, పది వేల రెండు వందలకు పైగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఇది దేశవ్యాప్తంగా మొత్తం డిగ్రీ కోర్సుల్లో ముప్పై శాతానికి పైగా ప్రభావితం చేసింది. కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటమ్ అనువర్తనాలు, ఎంబాడీడ్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో కొత్త కోర్సులు వచ్చాయి. రద్దుల్లో ఎక్కువ భాగం భాషలు, కళలు, మానవీయ శాస్త్రాలకే పరిమితం కావ డం గమనార్హం. చైనా విద్యా మంత్రిత్వ శాఖ 2023లోనే ఇరవై శాతం విశ్వవిద్యాలయ మేజర్లను 2025 నాటికి పునర్వ్యవస్థీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది, ఇది సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధలో అమెరికా తో పోటీని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన వ్యూహాత్మక నిర్ణయం. చైనాలో మానవీయ శాస్త్రాల గ్రాడ్యుయేట్ల ప్రారంభ వేతనాలు సాంకేతిక గ్రాడ్యుయేట్ల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయని మైకోస్ సంస్థ నివేదిక చెబుతోంది, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల నెలవారీ వేతనం విజువల్ డిజైన్ గ్రాడ్యుయేట్ల కంటే దాదాపు ముప్పై శాతం ఎక్కువగా ఉంది.

అమెరికాలో కృత్రిమ మేధ ప్రభావం వేరే రూపంలో కనిపిస్తోంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మానవీయ, కళా విభాగాల విద్యార్థుల నిష్పత్తి గత దశాబ్దంలో పదిహేనున్నర శాతం నుంచి పన్నెండున్నర శాతానికి పడిపోయింది. ఒఇసిడి గణాంకాల ప్రకారం, సభ్య దేశాల్లో ఎనభై శాతం దేశాల్లో గత దశాబ్దంలో మానవీయ శాస్త్రాల నమోదు గణనీయంగా తగ్గింది. బ్రిటన్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది, రస్సెల్ గ్రూప్‌కు చెందిన నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నలభైకి పైగా కోర్సు ల్లో కొత్త ప్రవేశాలను నిలిపివేసింది, లీసెస్టర్ విశ్వవిద్యాలయం ఫిల్మ్ స్టడీస్, మోడర్న్ లాంగ్వేజెస్ విభాగాలనే పూర్తిగా మూసివేసింది. గత ఏడాది కాలంలో బ్రిటన్‌వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా కోర్సులు రద్దయ్యాయి, వీటిలో ఎక్కువ భాగం సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలకు చెందినవే. అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, డెలాయిట్ సంస్థ 2026 నివేదిక ప్రకారం, కృత్రిమ మేధ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతుండటంతో, ముఖ్యంగా అమెరికాలో మానవీయ శాస్త్రాలపై ఆసక్తి మళ్లీ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు, ఎందుకంటే యంత్రాలు చేయలేని విమర్శనాత్మక ఆలోచన, నైతిక తర్కం వంటి నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.

సింగపూర్ డిగ్రీ నిర్మాణాన్ని పూర్తిగా మార్చకుండా, స్కిల్స్‌ఫ్యూచర్ పథకం ద్వారా జీవితకాల నైపుణ్యాభివృద్ధిపై పెట్టుబడి పెడుతోంది. 2026 మేలో ప్రకటించిన కొత్త విధానం ప్రకారం, 2027 నాటికి అన్ని విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌లలో చేరే ప్రతి విద్యార్థికి ప్రాథమిక ఏఐ నైపుణ్యాలు నేర్పించే మాడ్యూళ్లు తప్పనిసరి అవుతాయి, అయితే ఇవి ఆయా విద్యార్థుల ప్రధాన సబ్జెక్టుతో పాటుగానే బోధించబడతాయి తప్ప దానికి బదులుగా కాదు. దక్షిణ కొరియా కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధిని జాతీయ మనుగడ వ్యూహంగా ప్రకటించి, 2027 నాటికి తమ కోర్సుల్లో ముప్పై శాతాన్ని ఏఐతో అనుసంధానించే విశ్వవిద్యాలయాలకు అదనపు పరిశోధన నిధులు ఇస్తూ, చేయని సంస్థలకు నిధులు తగ్గించే ప్రోత్సాహక విధానాన్ని అనుసరిస్తోంది, బలవంతపు కోర్సు రద్దులు కాదు. జపాన్ వైఖరి మరింత ఆసక్తికరం, సొసైటీ 5.0 విధానం కింద ఆర్థిక శాస్త్రం చదివేవారు కోడింగ్ నేర్చుకోవడం, సాహిత్యం చదివేవారు డేటాను అర్థం చేసుకోవడం అనే హైబ్రిడ్ గ్రాడ్యుయేట్ నమూనాను ప్రోత్సహిస్తున్నారు తప్ప, మానవీయ శాస్త్రాలను తొలగించడం లేదు. జపాన్ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా డిజిటల్ హ్యూమానిటీస్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టి, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాల విద్యార్థులకే ఏఐ పరికరాలను తమ పరిశోధనలో ఉపయోగించే నైపుణ్యాన్ని అందిస్తున్నారు. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు చైనా నమూనాను నిశితంగా పరిశీలిస్తూ కోర్సు సమీక్షల తొలిదశలో ఉన్నాయి, కానీ చైనా తరహా కఠిన తొలగింపులు మాత్రం ఎక్కడా అమలు చేయలేదు.

ఈ ప్రపంచ నేపథ్యంలో భారత్ ఎంచుకున్న మార్గం, ఇప్పటికే ఉన్న కోర్సుల చుట్టూ ఏఐ నైపుణ్యాన్ని జోడించడం. కేంద్ర బడ్జెట్ 2026–27లో విద్యా రంగానికి లక్షా ముప్పై తొమ్మిది వేల కోట్ల రూపాయలు కేటాయించి, అందులో యాభై ఐదు వేల ఏడు వందల కోట్లకు పైగా




ఉన్నత విద్యకు కేటాయించడం, మూడో తరగతి నుంచే ఏఐ, కంప్యూటేషనల్ థింకింగ్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చేర్చాలన్న నిర్ణయం ఈ దిశలో ముందడుగే. అయితే మెర్సర్ మెటల్ సంస్థ ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్ ప్రకారం దేశవ్యాప్తంగా నలభై రెండున్నర శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారు. ఇందు లో తెలంగాణ మొత్తం ఉపాధి యోగ్యత దాదాపు నలభై ఏడున్నర శాతంగా నమోదైంది, నాన్ టెక్నికల్ విభాగంలో ఇది యాభై ఒక్క శాతం దాటినా, సాంకేతిక ఉద్యోగాల ఉపాధి యోగ్యతలో దక్షిణాది రాష్ట్రాలేవీ మొదటి పది స్థానాల్లో లేకపోవడం గమనార్హం. టీజీ ఈఏపీసెట్ 2025లో కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సులకు తొంభై ఒక్క శాతం సీట్ల భర్తీ నమోదు కావడం, పన్నెండు వేలకు పైగా ఏఐ అండ్ ఎంఎల్ సీట్లు, ఇరవై ఆరువేలకు పైగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండటం విద్యార్థుల మొగ్గు ఎటువైపో చూపిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీ కోసం ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని, దేశంలోనే తొలి అంకిత ఏఐ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పే దిశగా అడుగులు వేస్తోంది. ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం కోడ్‌మిత్ర వేదిక ద్వారా ఏఐ అక్షరాస్యత కార్యక్రమాన్ని ఇరవై లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విస్తరించడం, పది జిల్లా కేంద్రాల్లో ఏఐ, నైపుణ్యాధారిత మైనారిటీ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం పునాది స్థాయి నుంచే సంస్కరణ మొదలుపెట్టాలన్న అవగాహనను చూపిస్తున్నాయి. అయితే ఇవి ఇంకా ప్రయోగాత్మక ప్రాజెక్టులుగానే ఉన్నాయి తప్ప, రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏకీకృత ప్రమాణంగా మారలేదు.

కృత్రిమ మేధ యుగంలో సాంకేతిక నైపుణ్యమే సర్వస్వం అనుకోవడం పొరపాటు అని అంతర్జాతీయ గణాంకాలే చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2025లో విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం, పది మంది యజమానుల్లో ఏడుగురు అనలిటికల్ థింకింగ్‌ను అత్యంత అవసరమైన నైపుణ్యంగా పేర్కొన్నారు, ఇది వరుసగా మూడో నివేదికలోనూ మొదటి స్థానంలో నిలిచింది. క్రియేటివ్ థింకింగ్ నాలుగో స్థానంలో, రెసిలియన్స్, లీడర్‌షిప్, సోషల్ ఇన్ఫ్లుయెన్స్ వంటి మానవ కేంద్రిత నైపుణ్యాలు తొలి ఐదింటిలో చోటు దక్కించుకున్నాయి. అంటే ఏఐ, డేటా నైపుణ్యాలతో పాటు, మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు నేర్పించే విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సామాజిక అవగాహన కూడా భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు అంతే అవసరమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆదాయ గణాంకాలు కూడా ఈ వాదనకు మద్దతుగా నిలుస్తున్నా యి. జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయ సెంటర్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ద వర్క్‌ఫోర్స్ అధ్యయనం ప్రకారం, పంతొమ్మిది మానవీయ, కళా విభాగాల్లో పద్నాలుగు విభాగాలు, స్టెమ్ గ్రాడ్యుయేట్ల ఆదాయంలో దిగువ పాతిక శాతం కంటే ఎక్కువ సంపాదిస్తున్నాయి. ప్రారంభ వేతనాల్లో స్టెమ్ గ్రాడ్యుయేట్లు ముందుండగా, కెరీర్ మధ్యలో ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి సామాజిక శాస్త్ర విభాగాలు జీవశాస్త్రం వంటి కొన్ని స్టెమ్ విభాగాలతో సమానంగా లేదా అంతకుమించి ఆదాయాన్ని అందిస్తున్నాయని ఈ అధ్యయనం చూపిస్తుంది. బ్రిటన్‌లోని రస్సెల్ గ్రూప్ గణాంకాల ప్రకారం కూడా అత్యధిక ప్రమాణాలున్న సంస్థల్లో మానవీయ శాస్త్రాల గ్రాడ్యుయేట్లలో తొంభై ఒక్క శాతం మంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంటే మానవీయ శాస్త్రాలను తక్షణ ప్రయోజనం లేని కోర్సులుగా తీసిపారేయడం కంటే, వాటిని ఏఐ నైపుణ్యాల తో జోడించి బలోపేతం చేయడమే దీర్ఘకాలిక ప్రయోజనకరం.

ఈ ప్రపంచ అనుభవాల నుంచి భారత్, తెలంగాణ నేర్చుకోవాల్సింది స్పష్టంగా కనిపిస్తోంది. చైనా వేగం, అమెరికా, బ్రిటన్‌లలో ఆర్థిక ఒత్తిడితో వస్తున్న బలవంతపు కోతలు రెండూ ఆదర్శప్రాయం కావు. కృత్రిమ మేధ నైపుణ్యాన్ని ప్రతి డిగ్రీలో భాగం చేయడం అవసరమే తప్ప, దాని పేరుతో మానవీయ శాస్త్రాలను, సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదు. జాతీయ విద్యా విధానం 2020కి ఇప్పుడు అవసరమైంది కేంద్రీకృత ఏఐ అనుబంధమే తప్ప, కోర్సుల ఏకపక్ష తొలగింపు కాదు. ఇంజినీరింగ్ సిలబస్‌లు సిస్టమ్స్ థింకింగ్ చుట్టూ పునర్నిర్మించుకోవాల్సినంతే, హ్యూమానిటీస్ కోర్సులు డిజిటల్ హ్యూమానిటీస్‌గా, కల్చరల్ అనలిటిక్స్‌గా పరిణామం చెందాల్సిన అవసరం ఉంది. సింగపూర్, జపాన్ చూపిన సమతుల్య మార్గం, దక్షిణ కొరియా చూపిన ప్రోత్సాహక విధానం, తెలంగాణ ప్రారంభించిన పునాది స్థాయి కార్యక్రమాలను ఒక జాతీయ ప్రమాణంగా విస్తరించడం ఇప్పుడు కావాల్సింది. ప్రతి డిగ్రీ పట్టభద్రుడు ఏఐ నైపుణ్యంతో పాటు, విమర్శనాత్మక ఆలోచన, మానవీయ దృక్పథంతో బయటకు వచ్చే విద్యా వ్యవస్థను నిర్మించుకోవడమే వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి నిజమైన బాట.

**మంచాల కిరణ్ కుమార్**

# ప్రజలు మేల్కొంటేనే ప్రజాస్వామ్యం మేల్కొంటుంది

'యథా రాజా తథా ప్రజా' అని పురాణాలు చెబుతాయి. కానీ ప్రజాస్వామ్యంలో 'యథా ప్రజా తథా రాజా'అనేదే నిజమైన సత్యం.

నీట్ (NEET) పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనలు కేవలం ఒక పరీక్షకు సంబంధించిన అసంతృప్తి కాదు. అది భారత యువతలో పెరుగుతున్న ఆవేదనకు, విద్యా వ్యవస్థపై తగ్గుతున్న నమ్మకానికి, పాలనలో పారదర్శకత కోరుతున్న ప్రజాస్వామ్య స్వరానికి ప్రతిబింబం.

లక్షలాదిమంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతారు. వారి భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు, ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. కానీ విద్యార్థులు, తల్లిదండ్రులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేసి, అనేక వారాలు గడిచిన తర్వాత మాత్రమే బాధ్యత వహించిన వ్యక్తుల రాజీనామాలు జరిగితే, ప్రజల్లో సహజంగానే కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి.

రాజీనామా అనేది వ్యక్తిగత చర్య మాత్రమే కాదు; అది పాలనా బాధ్యతకు సంకేతం కూడా కావాలి. అయితే ప్రజల ఒత్తిడి అత్యున్నత స్థాయికి చేరుకున్న తర్వాత మాత్రమే అలాంటి చర్యలు కనిపిస్తే, 'ప్రజల స్వరం వినిపించాలంటే ఇంతకాలం వేచి చూడాలా?' అనే సందేహం కలగడం సహజం.

**ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఎందుకు అత్యవసరం?**

ప్రజాస్వామ్యానికి మూలాధారం విశ్వాసం. ఎన్నికల్లో ఓటువేసిన ప్రజలు తమ తరఫున నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని నాయకులకు అప్పగిస్తారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన స్పందన. రామాయణంలో శ్రీరాముడు ప్రజల అభిప్రాయాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావిం చాడు. వ్యక్తిగతంగా కఠినమైన నిర్ణయాలైనా, రాజధర్మం కోసం తీసుకున్నాడనే భావన భారతీయ ఆలోచనలో తరచూ ప్రస్తావించబడుతుంది. పాలకునికి ప్రజాభిప్రాయం ఎంత ముఖ్యమో ఈ కథనం గుర్తు చేస్తుంది.

**యువత ఎందుకు రోడ్డెక్కుతోంది?**

ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. పోటీ పరీక్షలు పెరుగుతున్నాయి. ఒక సీటు కోసం వేల మంది పోటీ పడుతున్నారు. అలాంటి పరిస్థితిలో పరీక్షలపై నమ్మకం దెబ్బతింటే, అది కేవలం ఒక పరీక్ష సమస్య కాదు; దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం. ఈ రోజు యువత సమాచార యుగంలో జీవిస్తోంది. నిజాన్ని తెలుసుకునే సాధనాలు వారి చేతుల్లో ఉన్నాయి. అందువల్ల ప్రశ్నించడం, జవాబులు కోరడం ప్రజాస్వామ్య విరోధం కాదు; ప్రజాస్వామ్య బలం.

**ప్రజలలో చైతన్యం ఎందుకు అవసరం?**

ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి ప్రారంభం మాత్రమే; ముగింపు కాదు. ఎన్నికల తర్వాత కూడా ప్రజలు ప్రశ్నించాలి, ప్రభుత్వ పనితీరును గమనించాలి, విధానాలను విశ్లేషించాలి, చట్టబద్ధమైన మార్గాల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచాలి. మంచి పాలన కూడా ప్రజల చైతన్యం, నాయకుల బాధ్యత కలిసి పనిచేసినప్పుడే సాధ్యమవుతుంది.

**రాజకీయ నాయకులు మారాల్సిన సమయం**

ఈ కాలంలో నాయకత్వం అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం కాదు. తప్పు జరిగితే వెంటనే అంగీకరించడం, విచారణను పారదర్శకంగా నిర్వహించడం, ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం నిజమైన నాయకత్వ లక్షణాలు. కృత్రిమ మేధస్సు (Artificial Intelligence), డిజిటల్ యుగం, సోషల్ మీడియా కాలంలో ఏ సమాచారమూ ఎక్కువ కాలం దాచిపెట్టడం సాధ్యంకాదు. అందువల్ల ఆలస్యంగా స్పందించడం కంటే, వెంటనే పారదర్శకంగా వ్యవహరించ డం ప్రభుత్వాల విశ్వసనీయతను పెంచుతుంది.

**ప్రజల బాధ్యత కూడా అంతే గొప్పది**

ప్రజలు నాయకులను వ్యక్తులుగా కాక, విధానాల ఆధారంగా అంచనా వేయాలి. కులం, మతం, ప్రాంతం, భావోద్వేగాల కంటే నిజాయితీ, సామర్థ్య ం, జవాబుదారీతనం, ప్రజాహితం వంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. యువత భవిష్యత్తు విద్యా వ్యవస్థ చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వానికీ అత్యున్నత బాధ్యత.

'ప్రజలు నిద్రిస్తే అధికారం అహంకారమవుతుంది; ప్రజలు మేల్కొంటే అధికారం బాధ్యతగా మారుతుంది.'

కమల హాసన్ తుమ్మ, 9505618252

# జలమే జీవం.. నీటిని ఆదా చేద్దాం

- వర్షపు నీటి సంరక్షణ సామాజిక బాధ్యత
- హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : జలమే జీవమని, నీటిని ఆదా చేద్దామని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భూగర్భజలాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఏర్పాటు చేసిన వర్షపు నీటి రీఛార్జి ఫౌంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యాబోధనకే పరిమితం కాకుండా సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడాలని చెప్పారు. కాకతీయులు, నిజాం పాలనలో నిర్మించిన చెరువులు, కుంటలు వర్షపు నీటి సంరక్షణకు, భూగర్భజలాల పునరుద్ధరణకు వారు ఇచ్చిన ప్రాధాన్యమేమిటో చాటి చెబుతున్నాయన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, విస్తృత కాంక్రీటీకరణ కారణంగా హైదరాబాద్‌లో సహజ భూగర్భజలాల రీఛార్జి తగ్గిపోయిందన్నారు. అందుకే శాస్త్రీయ విధానంలో వర్షపు నీటి సంరక్షణ అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, హిమాయత్‌సాగర్ తదితర నీటి వనరుల నుంచి నగరానికి త్రాగునీరు సరఫరా అవుతున్నప్పటికీ స్థానికంగా వర్షపు నీటిని భూగర్భంలోకి చేర్చే చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విద్యా, వాణిజ్య సంస్థలు సమర్థవంతమైన వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాటిని సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే నీటి ఎద్దడి తగ్గుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, వేగవంతమైన పట్టణీకరణ నేపథ్యంలో నీటి సంరక్షణ అత్యవసరమైందన్నారు. సహజవనరులు, భూగర్భజలాల రీఛార్జి తక్కువగా ఉండే నగరాల్లో వర్షపు నీటి సంరక్షణకు మరింత ప్రాధాన్యం ఉందని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సింగూరు, మంజీరా, కృష్ణా, గోదావరి జలాశయాల నుంచి వందల కిలోమీటర్ల దూరం నుంచి నీటిని ఎత్తి పోస్తూ హైదరాబాద్‌కు త్రాగునీరు అందిస్తున్నామన్నారు. ఈపరిస్థితుల్లో భూగర్భజలాలను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా కొంత తక్కువ వర్షపాతం, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు తదితర ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతిలో వర్షపు నీటి సంరక్షణ చేపట్టాలన్నారు. దీనికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి, జెఎన్‌టియు కన్వీనర్ ఆర్‌వి శర్మ, కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణాకర్, ఇతర అధికారులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగానికి ఢోకా లేదు

- గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు!
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని, అలాంటి అసత్యాలను నమ్మాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నగరంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందగా, ఫ్లాట్ల విక్రయాల్లో ఏకంగా 40 శాతం వరకు వృద్ధి నమోదైందన్నారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ అద్భుతంగా వృద్ధి చెందిందని, రిజిస్ట్రేషన్ శాఖలో నానాటికీ పెరుగుతున్న డాక్యుమెంట్ల సంఖ్యే దీనికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై కావాలని బురద జల్లేందుకు చేస్తున్న ప్రచారాలను పక్కనబెట్టాలని ప్రజలను ఆయన కోరారు.

**అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్ర బిందువు 'హైదరాబాద్'**

'2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి కారణంగానే ఐటి, ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాలు జరిగి హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించారని, నగరం పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా మారిందన్నారు.

**రూ. 7 వేల కోట్లతో 'మూసీ' ప్రాజెక్ట్ టెండర్లు**

హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోందని మంత్రి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. మూసీ సుందరికరణకు రూ.7 వేల కోట్ల అంచనాతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ తొలివిడత (28 కిలోమీటర్లు) పనులకు వారం పది రోజుల్లో టెండర్లు ఆహ్వానిస్తామని చెప్పారు. మెట్రో విస్తరణ పాతబస్తీని కలుపుతూ రూ.24 వేల కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల మేర రెండవ విడత మెట్రో విస్తరణ చేపట్టనున్నామన్నారు. ఆర్ఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్‌ను అనుసంధానించేలా రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు కూడా సిద్ధమవుతున్నాయన్నారు.

**భూభారతి చట్టం, పేదల ఇళ్లకు ప్రాధాన్యం**

భూములకు భద్రత కల్పించేందుకు 'భూభారతి' చట్టాన్ని తీసుకొచ్చామని, అందులోని చిన్నపాటి సాఫ్ట్‌వేర్ సమస్యలను 15–20 రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఒకవైపు రియల్ రంగానికి ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబోతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ స్థల సేకరణతో పాటు రియల్ ఎస్టేట్ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ అనుమతుల సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపి రఘురామ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమ విజయం


- 27న తలపెట్టిన కార్యక్రమం మార్పు
- జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు
- లోక్‌భవన్ ముట్టడి, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు రద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్/ హనుమకొండ : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఉద్యమ విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యార్థుల పోరాటం ద్వారా ప్రజాస్వామ్యం విజయం సాధించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నీట్ పరీక్షను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించాలని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్న నేపథ్యంలో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన లోక్ భవన్ ముట్టడి, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. అదేరోజు సాయంత్రం నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నీట్ పేపర్ లీకేజ్ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజుల నుండి దేశంలో విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటాల ఉధృతం చేయడం వల్ల నేడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమాలకు తలొగ్గి రాజీనామా చేశారని, ఇది విద్యార్థుల పోరాట ఫలితమేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో ఇప్పటికి మూడుసార్లు పేపర్ లీకేజ్ కావడం వల్ల లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం లీకేజీలు జరిగితే నామమాత్రం చర్యలు తీసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే లీకేజీలు, అవకతవకలు అరికట్టవచ్చని అన్నారు.

# ధర్మేంద్ర రాజీనామా ప్రజాస్వామ్యానికి గెలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థుల ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం మంత్రిని రాజీనామా చేయించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఉద్యమం నడిపిన యువతకు, విద్యార్థులకు పల్లా వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. ఇదే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులు, యువతకు ఆయన పిలుపునిచ్చారు.

**నీట్ ఉద్యమం విద్యార్థుల విజయమే: జాన్‌వెస్లీ**

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమం చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమం తీవ్రతతోనే కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించాల్సి వచ్చిందని, ఇది విద్యార్థి ఉద్యమ విజయమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం యువత ఇదే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగించాలని కోరారు.

**రాజీనామా విద్యార్థుల విజయమే: మహేష్ కుమార్ గౌడ్**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి లోకం సాధించిన నైతిక విజయమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపియేతర రాజకీయ పక్షాలు చేపట్టిన పోరాటం ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పోరాటానికి ఎవరైనా తలొగ్గాల్సిందేనని, నియంతృత్వ పోకడలకు స్థానం లేదని ఈ రాజీనామా స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని ప్రపంచం గమనించిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగకుండా సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

**గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సంబరాలు**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో శనివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకుని, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ అంశంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటం ఫలించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకుని విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామితో పాటు విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమాల ఫలితమే రాజీనామా

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంత రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఎఐఎస్ఎఫ్‌తోపాటు వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో పలుమార్లు ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, విద్య కేంద్రీకరణను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో కూడా విద్యార్థులను ఐక్యం చేసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు కొనసాగిస్తామని మణికంత రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు.

# ధర్మేంద్రపై క్రిమినల్ కేసు నమోదు

- ఎఐవైఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శవయాత్ర ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రచార రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఒక దేశానికి ప్రధాని అంటే దేశ ప్రజల సమస్యలకు బాధ్యత వహించాల్సిన వ్యక్తి. విద్యార్థుల భవిష్యత్తు, నీట్ పేపర్ లీకులు, నిరుద్యోగుల ఆవేదన వంటి అత్యంత తీవ్రమైన అంశాలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో ఆయన రాజకీయ ప్రచార వీడియోల మాదిరిగా వ్యవహరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మధు, వెంకటేశ్, మధుకర్, అలీ, రాహుల్, కిరణ్, ప్రదీప్, రమేశ్, సాయి, భరత్, ధీరజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీనామా.. విద్యార్థుల విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమని పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులందరికీ అభినందనలు తెలియజేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి మరింత బలంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భం అని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును హరిస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని కోరారు. ఈ రాజీనామా దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్ర బిజెపి ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టు అని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్, ప్రభుత్వ విప్‌లు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బల్మూర్ వెంకట్, డిసిసి అధ్యక్షులు శివసేనా రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానం అని హెచ్చరించారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పూర్తిగా మార్చుకోవాలని సూచించారు.

**అబద్ధాలకు, అహంభావానికి చెంపదెబ్బ... సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ**

కాక్రోచ్ రూపంలో యువత ఉద్యమం విజృంభించిందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అన్నారు. ఈ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ప్రధానమంత్రి ప్రయత్నిస్తే, ప్రధాన న్యాయమూర్తి బొద్దింకల పేరుతో వెటకారం చేసిన ఫలితంగా ఉద్యమం వికసించిందన్నారు. చివరికి విద్యాశాఖమంత్రి రాజీనామా చేయడంతో వాతావరణం తాత్కాలికంగా చల్లబడ్డా బిజెపి ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠంలాంటిదన్నారు. అబద్ధాలకు, అహంభావానికి ఈ ఉద్యమం సరైన గుణపాఠం చెప్పిందన్నారు. అటు సిజెఐ ఇటు ప్రధాని మోదీ సమాజం ముందు ముద్దాయిలేనన్నారు.

# 'ఇవి ఉద్యమ చెప్పులు'

- జంతర్‌మంతర్‌లో విద్యార్థుల పోరాటానికి దేశవ్యాప్తంగా మానవత్వం అండ



ప్రజాపక్షం/హైదరాబాద్: 'ఇవి సాధారణ చెప్పులు కావు. ప్రతి చెప్పు వెనుక ఒక విద్యార్థి కన్నీరు, ఒక గాయం, ఒక కల ఉంది' అని చెప్పులను 'ఉద్యమ జ్ఞాపకాల ప్రదర్శన'గా ఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈ చెప్పులను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని నీట్ పేపర్ లీక్‌పై బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత నెల రోజుల నుంచి పోరాటం చేస్తున్న ఆందోళనకారులు ప్రకటించారు.

**లాఠీఛార్జిలో విడిచిపెట్టిన చెప్పులతో వినూత్న నిరసన**

స్విగ్గీ, జొమాటో ద్వారా దేశం నలుమూలల నుంచి ఆహార సహాయం, ఉద్యమానికి మద్దతుగా సాధారణ ప్రజలు స్పందించడం ఉద్యమ తీవ్రతను చాటిచెబుతుంది. ఉద్యమాలు నినాదాలతో మాత్రమే కాదు. మనుషుల మనసుల్లో మిగిలిపోయే జ్ఞాపకాలతో చరిత్రలో నిలిచిపోతాయి. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల ఉద్యమంలో అలాంటి హృదయాన్ని కదిలించే దృశ్యాలే కనిపించాయి. పోలీసుల లాఠీచార్జిలో విద్యార్థులు విడిచిపెట్టిన చెప్పులు ఉద్యమానికి గుర్తుగా మారగా, వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న సాధారణ ప్రజలు స్విగ్గీ, జొమాటో వంటి సేవల ద్వారా పంపించిన ఆహార పొట్లాలు దేశవ్యాప్తంగా మానవత్వానికి ప్రతీకగా నిలిచాయి. పోలీసుల దాడిలో చెల్లాచెదురైన వందలాది మంది చెప్పులను ఉద్యమకారులు సేకరించి జంతర్‌మంతర్ వద్ద ప్రత్యేకంగా ప్రదర్శించారు. విద్యార్థులు బీహార్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చారని, లాఠిచార్జిలో పరుగులు తీస్తూ చెప్పులు అక్కడే వదిలివెళ్లాల్సి వచ్చిందని ఉద్యమకారులు తెలిపారు. అనేక మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొందరికి తీవ్ర గాయాలయ్యాయని వివరించారు.

**ఆకలితో ఉండకూడదంటూ దేశం స్పందించింది**

జంతర్‌మంతర్ వద్ద నిరసన కొనసాగుతున్న విషయం తెలిసిన తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు విద్యార్థులకు ఆహారాన్ని పంపించడం ప్రారంభించారు. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌తో పాటు విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు కూడా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా భోజనాన్ని పంపించారు. డెలివరీ సిబ్బంది వరుసగా ఆహార పొట్లాలు తీసుకువస్తుండగా, ఒక దశలో 'ఇప్పటికే సరిపోయింది' అని చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యమానికి ప్రజల నుంచి వచ్చిన మద్దతు కేవలం మాటల్లో కాదని, చేతల్లోనూ కనిపించిందని నేతలు వ్యాఖ్యానించారు.

## ఎల్‌నినోతో సూక్ష్మ, సాగునీటి వ్యవస్థలు ఏర్పాటు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలుస్తూ డ్రిప్, స్ప్రింక్లర్ లాంటి సూక్ష్మ, సాగునీటి వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు సూచించారు. శనివారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు మైక్రో ఇరిగేషన్ కీలకమన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని, నాణ్యమైన పరికరాలు అందించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కంపెనీలను ఆదేశించారు.పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో కంపెనీలకు రూ.400 కోట్లు చెల్లించామని మంత్రి తెలిపారు. బిల్లుల కారణంగా పనులు ఆలస్యం చేయకుండా రైతుల ప్రయోజనాల దృష్ట్యా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే ఇతర జాతీయ, అంతర్జాతీయ మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తెలంగాణలో పనిచేయడానికి ఆసక్తి చూపితే, వాటిని కూడా ఎంప్యానెల్ చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**సమయపాలనపై ఉద్యోగులపై టిజిఓయిల్‌ఫెడ్ కఠిన చర్యలు**

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ తెలంగాణ సహకార నూనె గింజల ఉత్పత్తిదారుల సమాఖ్య (టిజిఓయిల్‌ఫెడ్)ఆలస్యంగా విధులకు హాజరైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంది. వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నెల 24న టిజిఓయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఉదయం 10:30 గంటల వరకు పలువురు అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సేవా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఎండి వెంటనే చర్యలు చేపట్టి ఆలస్యంగా హాజరైన ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఇద్దరి సేవలను రద్దు చేయగా, మరో ఇద్దరిని బదిలీ చేశారు. అదనంగా ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా టిజిఓయిల్‌ఫెడ్ ఎండి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, ప్రజలకు నాణ్యమైన సేవలందించడం ముఖ్యమని అన్నారు. నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ, ఉద్యోగులంతా నిర్ణీత సమయానికి విధులకు హాజరై సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు.


**యల్లంపేట్ మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా**
mcyellampet2025@gmail.com

క్ర.సం.1, NIT No. E1/07/2026-27, వివరణ: MCY (3)లో కొంత పనిని చేపట్టడమైనది, అంచనా విలువ: రూ.87.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25.07.2026 మ.3.00గం.లకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 03.08.2026 మ.3.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in లో చూడవచ్చు లేదా యల్లంపేట్ మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సం/- కమిషనర్, యల్లంపేట్ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 6755-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 09/DB/EE-II/ Alwal Circle/ MMC/2026-27, Dt: 24.07.2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, అల్వాల్ సర్కిల్ (02) పరిధిలోని ఆలయంలో బోనాల పండుగ కోసం స్టోన్ చిప్స్ మరియు క్రషర్ స్టోన్ డస్ట్‌ని సరఫరా చేయడం. | రూ. 13.50 లక్షలు | 27.07.2026 02:00 PM | 30.07.2026 02:00 PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి.
DIPR R.O. No. : 6712-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మాదాపూర్ సర్కిల్-50**
Lr.No: 12/EE/CIR-50/KPZ/CMC/2026-27 Date: 25.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది /ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 12/EE/CIR-50/KPZ/ CMC/2026-27, Date: 25.07.2026 | సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50లో పండుగ పనులు | రూ. 3.20 లక్షలు | 27.07.2026 01:00 PM 03.08.2026 11:30 AM | శ్రీమతి సిహెచ్.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50, సెల్: 9701414306 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి.
DIPR R.O. No. : 6750-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ (రూ.లక్షలలో) | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 43/ EE-I/MKJZ/ MMC/2026-27 | డిస్క్‌టాప్ మరియు ప్రింటర్ల సేకరణ | 1408920.00 | 25.07.2026 ఉ.11:30గం.లకు, 01.08.2026 & ఉ.11:30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 6773-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

దేవాదాయ - ధర్మాదాయ శాఖ
**శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము**
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073. ఫోన్ నెం. 9494252843, 040-23748247.
ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన
టెండర్ నోటీసు నెం.1/TEN/SVST/SNC/2026 తేది: 26.07.2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఒక సంవత్సరం కాలపరిమితికి క్రమ.సం.1 కి తేది: 01.11.2026 నుండి 31.10.2027 మరియు క్రమ.సం. 2 నుండి 10 వరకు అనగా తేది: 11.09.2026 నుండి 10.09.2027 వరకు దేవాలయములో ఈ దిగువ తెలియపరచినవాటి నిమిత్తం లైసెన్స్ హక్కుల కొరకై టెండర్ దారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము ద్వార టెండర్లు కోరనైనది.

| క్ర. సం. | ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము వివరములు | ధరావత్తు (E.M.D.) | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|
| 1 | దేవస్థానమునకు ప్రొవిజన్స్ (కిరణా సామాగ్రి) సరఫరా చేయు హక్కు | రూ.25,000/- | రూ.5,000/- |
| 2 | కొబ్బరి కాయలు మరియు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కు | రూ.50,000/- | రూ. 1000/- |
| 3 | పూలు మరియు పూల మాలలు అమ్ముకొనే హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 4 | ఆర్జిత సేవ టిక్కెట్ల పుస్తకములు, కరపత్రాలు మొ॥లగునవి ముద్రించి సప్లయి చేయు లైసెన్సు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 5 | కళ్యాణమండపము నందు హౌస్ కీపింగ్ చేసుకొనే హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 6 | దేవస్థానమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 7 | దేవస్థానమునకు పర్వదినముల యందు పూల అలంకరణ | రూ.10,000/- | రూ.2000/- |
| 8 | దేవస్థానము రోజు వారి పూల దండలు సప్లయి చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 9 | సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్సు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 10 | క్యూ లైన్ మరియు తడికెల పందిర్లు ఏర్పాటు చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |

గమనిక:
1. క్ర.సం. 1 (కిరణా సామాగ్రి సరఫరా) కేవలం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మాత్రమే అంగీకరించ బడును.
2. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
3. తేదీ: 28.07.2026 నుండి 04.08.2026 సా.4:00 గంటల వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును.
4. తేదీ: 07.08.2026 రోజు ఉ.11.00 గం.ల వరకు కొటేషన్స్ (సీల్డ్ టెండర్స్) స్వీకరించబడును.
5. తేది: 07.08.2026 రోజున టెక్నికల్ బిడ్ ఉ.11.30 ని.లకు ప్రైస్ బిడ్ 12.30 ని.లకు తెరువబడును.
6. ప్రైస్ బిడ్ విప్పిన తరువాత టెండరు దారుల సమక్షములో క్ర.సం. 2 నుండి 10 వరకు సీల్డ్ కొటేషన్స్ తెరువబడును, తదుపరి క్ర.సం. 2 నుండి 10 వరకు బహిరంగ వేలము నిర్వహించబడును.
7. సీల్డ్ టెండర్‌లో పాల్గొన్న వారిని మాత్రమే బహిరంగ వేలములో అనుమతించబడును.

నోట్: ఏ కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని ఫోన్: 9494252843, 040-23748247 ద్వారా కాని సంప్రదించగలరు.

శ్రీ స్వామివారి సేవలో
యం.శ్రీనివాస శర్మ
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 6780-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

## నేడు జిపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మూడవ రాష్ట్ర మహాసభ ఆదివారం ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల గణేష్ గార్డెన్స్‌లో జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమెల్యే కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసఫ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ మహాసభలలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు.ఈ మహాసభలకు గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మల్లయ్య కోరారు.

## దంతెలబోర సర్పంచ్ వెంకట రమణ మృతి

### కూనంనేని, సాబీర్ పాషా సంతాపం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని దంతెలబోర ఎస్‌సి కాలనీ సిపిఐ పక్ష సర్పంచ్ వెంకట రమణ (34) శుక్రవారం రాత్రి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలు గాయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆమెను కుటుంబ సభులు మొదట భద్రాచలంలోని మిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. ఖమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వెంటర రమణకు భర్త, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన దంతెలబోరకు తరలించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించిన వెంకట రమణ మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అలాగే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వరరావు కార్యవర్గ సభ్యులు వి పూర్ణ చందరరావు అడుసుమిల్లి సాయిబాబా ఉప్పుశెట్టి రాహూల్ తదితరులు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానూభూతిని తెలియజేశారు. ప్రజాసేవలో ముందంజలో ఉన్న యున నాయకురాలిని కోల్పోవడం తీరని లోటని వెంకటరమణ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల పోరాటం, సాధించిన విజయం చెంపపెట్టువంటిదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ పోరాటం కేవలం ఒక సమస్య పరిష్కారానికి మాత్రమే కాకుండా దేశంలో మార్పును కోరుకునే యువత సంకల్పానికి ప్రతీకగా నిలిచిందన్నారు. విద్యార్థులు,యువత ఆశయాలను విస్మరిస్తూ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఉద్యమం గుణపాఠంతో పాటు హెచ్చరికగా నిలిచిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలను ప్రజలు సహించరని వారికి గుణపాఠం చెబుతారనే విషయాన్ని ఈ విజయం మరో సారి స్పష్టం చేసిందన్నారు. ఇకపై విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో స్పందించి ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ నీటి పారుదల అటవీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాలువలు డిస్ట్రిబ్యూటరీ నిర్మాణానికి భూసేకరణ పురోగతి, పరిహారం పంపిణీ, అంతర్ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. రెవెన్యూ ఇరిగేషన్ ఫారెస్ట్ అధికారులతో సమన్వయంగా పనిచేసే పెండింగ్‌లో ఉన్న భూ పరిశీలన నివేదికలను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతో నష్టాల నివారణ



**ప్రజాపక్షం/చింతకాని :** ఎల్‌నినో ప్రభావంతో రైతులు తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మధిర డివిజన్ ఉద్యానవన అధికారి ఎ. విష్ణు రైతులకు సూచించారు. చింతకాని మండలం జగన్నాధపురం, మత్కేపల్లి గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్నాధపురం, మత్కేపల్లి సర్పంచ్‌లు తాళ్లూరి స్వప్న, కంచం ద్రౌపది మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.ఉద్యానవన అధికారి విష్ణు మాట్లాడుతూ రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు బదులుగా నీటి పొదుపు సాంకేతికలను అనుసరిస్తూ ప్రత్యామ్నాయ ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.కూరగాయలు పండ్ల తోటలను సాగుచేయాలని వీటితో నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ఉద్యానవన పంటలపై ఉన్న సబ్సిడీ వివరాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు, అధికారులు పాల్గొన్నా రు.

# సమన్వయంతో పనుల్లో వేగం

### విద్య, వైద్యం పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
### ప్రతీ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి
### ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి పనుల్లో వేగం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ నీటి పారుదల విద్య,వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, రోడ్లు భవనాలు, పంచాయితీరాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విద్య వైద్యం పారిశుద్ధ్యం తదితరప్రజా సమస్యలను అధికారులతో ఆయన క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వం శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోతే పనుల్లో జాప్యం జరిగి సాధారణ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రధానంగా పారిశుధ్య లోపం లేకుండా చూడాలని తాగునీరు విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అత్యంత కీలకమైన విద్యావైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ బడులు ఆస్పత్రుల్లో సౌకర్యాలను మెరుగు పరచాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి శాశ్వత పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు జి. రంగస్వామి, నందయ్య, మధుకర్, శ్రీకాంత్, రాజశేఖర్, నాగేంద్ర, శివలాల్, శ్రీనివాస్, విద్యానగర్ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి పట్టివేత

### నలుగురు అరెస్ట్



**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా తరలిస్తున్న 101కిలోల ఎండు గంజాయిని శనివారం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి కారుతో పాటు నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని కూనవరం రోడ్‌లో గల వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కెఎ 03 ఎన్‌ఆర్ 5892 నెంబరు గల వాహనం వేగంగా వస్తున్న క్రమంలో అనుమానంతో ఆపిన ఎక్సైజ్ పోలీసులు కారులో సోదాలు నిర్వహించంగా గంజాయి కంటపడింది. దీంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులను ఆరా తీయడంతో కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలించుకుపోతున్నట్లు తెలిపారన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నిందితులైన సలీం పాషా, రాజేంద్ర ప్రసాద్, ఎండి అర్బాజ్ హుస్సేన్, ఎస్ గుల్జార్‌లను అదుపులోకి తీసుకుని కారుతో పాటు నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సిఐ రహీమున్నీసా, ఎస్. సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీమ్, పోలీస్ సిబ్బంది భద్రం, సీతారాం రాకేష్ రవి పాల్గొన్నారు.

## నిరంకుశ ప్రభుత్వంపై యువత సాధించిన విజయం

### ఢిల్లీ హింసపై విచారణ జరిపించాలి
### సిపిఐ నేత బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిరంకుశ ప్రభుత్వంపై యువత, విద్యార్థులు పోరాడి విజయం సాధించారని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బిజెపి ప్రభుత్వానికి ఒక గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో శనివారం హేమంతరావు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడటమే కాకుండా 21 మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు బిజెపి అనుబంధ సంస్థలు అనేక ప్రయత్నాలు చేశాయని మత భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారని హింస ద్వారా విద్యార్థి యువజన ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో గుండె నిబ్బరంతో శాంతియుతంగా యువజన విద్యార్థులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచారని హేమంతరావు తెలిపారు. ఇది యువత, విద్యార్థులు సాగించిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇప్పటికైనా మోదీ, అమిత్‌షా ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ఆయన సూచించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ఆందోళన వద్ద పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారని ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు కూడా పాల్గొన్నాయన్న దానిపై పూర్తి విచారణ జరిపించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. న్యాయ విచారణ జరగాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు.

## మల్టిజోన్–1 వారినే తీసుకోవాలి

### ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ, డిగ్రీ, పిజి కళాశాలలో అతిథి అధ్యాపకులను మల్టిజోన్ –1లో ఉన్న స్థానికులకే అవకాశం కల్పించి పోస్టులు భర్తీ చేయాలని ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఆర్అండ్‌బి జివిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లాకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో నూతనంగా అతిథి అధ్యాపక పోస్టులను మల్టీజోన్1లో కాకుండా ఓపెన్‌గా భర్తీ చేయడం వల్ల నాన్ లోకల్ వారికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులు నష్టపోతున్నారన్నారు. మల్టీజోన్ 1లో ఉన్న వారికే నిబంధనల ప్రకారం ఇవ్వడం వల్ల స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందించారని మల్టిజోన్1లో స్థానికులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, మద్దోజు శ్రవణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుర్రా మనోజ్, ఏఐవైఎఫ్ నాయకులు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారులకు విమాన విహారం

### సంకల్ప సంస్థ ప్రోత్సాహం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అనారోగ్యాన్ని జయించి చదువులో రాణించిన తలసేమియా చిన్నారుల నింగిలో ఎగరాలనే కల నెరవేరింది. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 10 మంది విద్యార్థులు శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా విమానం ఎక్కి కొత్త అనుభూతిని ఆస్వాదించారు. పదవ తరగతి పాసైన తలసేమియా బాధితులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఈ ప్రయాణాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు వీరు విమానంలో ప్రయాణించారు. అనారోగ్య బాధలను మరిచి ఆకాశంలో విహరిస్తూ చిన్నారులు సంతోషంగా ప్రయాణించారు. వైజాగ్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన కైలాసగిరి, రుషికొండ బీచ్, ఆర్‌కె బీచ్‌లను సందర్శించి అక్కడ ఉత్సాహంగా గడిపారు. ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం, సబ్ మెరీన్ మ్యూజియంలను సందర్శించారు. తలసేమియా చిన్నారుల ఆరోగ్యాన్ని రక్షించడంతో పాటు వారి ఆశయాలను, కలలను నెరవేర్చేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిరంతరం కృషి చేస్తుందని సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత తెలిపారు. ప్రతి యేటా పది పాసైన బాధిత చిన్నారులను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి రవిచందర్, ఉదయ్ భాస్కర్, పావని పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆర్థిక సాయంతో సొంతింటి కల సాకారం

### ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి
### కలెక్టర్ దివాకర టిఎస్





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి సొంతింటి కల సాకారం చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈర్లపుడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొదటి విడతలో 160 ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే 98 ఇండ్లు పూర్తయ్యాయని 62 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్తయిన దశల ప్రకారం ప్రతి సోమవారం బిల్లులను బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నామన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా రెవెన్యూ, గ్రామ పంచాయతీ, హౌజింగ్ తదితర శాఖల సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, సర్పంచ్ గీత దేవ్‌సింగ్, హౌజింగ్ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

### పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

**ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'నా పట్టు నా అభిమానం 2.0' జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పట్టుపరిశ్రమ రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, నీటి వినియోగం, రాబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టు పరిశ్రమ ఉందని ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పని చేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి రైతులకు పట్టు పరిశ్రమపై అవగాహన కల్పించి జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి చైతన్యం తేవాలన్నారు. ఒక్కో రైతు విడివిడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేస్తే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు.

కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా॥ పి.సుబ్రహ్మణ్యం కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి ఉత్పాదకత నాణ్యతను మెరుగుపర్చడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్ర శాస్త్రవేత్తలు డా॥ తిరుపమ్ రెడ్డి, డా॥ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

### విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే తీవ్ర పరిణామాలు
### రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు, బిఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం ఎన్‌కె నగర్‌లోని కమ్మ సత్రంలో శనివారం వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల నాయకులు, కళాశాలల యాజమాన్యాలు, లెక్చరర్ యూనియన్లు, ఎస్టీ, ఎస్సీ సంఘాల ప్రతినిధులు, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), మాస్‌లైన్, టిఆర్‌ఎస్ తదితర రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరమన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలు, సిద్ధాంతాలు వేరైనా లక్ష్యం మాత్రం ఒక్కటేనని, తెలంగాణలోని పేద, బడుగు, బలహీన వర్గాలు, ఆదివాసీ, గిరిజన విద్యార్థులను ఉన్నత విద్య వైపు తీసుకెళ్లడమే అందరి ఉమ్మడి లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. విద్యార్థులు ఏం తప్పు చేశారని, వారికి రావాల్సిన నిధులను ఎందుకు సకాలంలో విడుదల చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్‌పై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ఏ ఒక్క ప్రభుత్వానికి సంబంధించిన పథకం కాదని, ఇది రాష్ట్ర ప్రభుత్వ నిరంతర బాధ్యత అని స్పష్టం చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేసి వారి భవిష్యత్‌ను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర నేత సలిగంటి శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) గోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సీతామహాలక్ష్మి , మాజీ ఎంపీపీ శాంతి, బిఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రమాకాంత్, ఎన్‌కె నగర్ సర్పంచ్ శ్రీకాంత్, బిఆర్‌ఎస్ యువజన నాయకుడు శ్రీకాంత్, విద్యారి, ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు, కళాశాల యాజమాన్యాలు, మేధావులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణను పరిశీలించిన ఐబి అధికారులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని మంగళగూడెం పాండవులకుంట చెరువు ఆక్రమణపై 'ప్రజాపక్షం' దినపత్రికలో 'కాల్వను మింగి...కట్టను కూల్చి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఈ నేపథ్యంలో ఐబి (నీటిపారుదలశాఖ) అధికారులు శనివారం ఘటనా స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఐబి డిఇ రాజేష్, స్థానిక ఎఇతో కలిసి చెరువు పరిసరాలు పరిశీలించి, చెరువు భూమిలో ఆక్రమణ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి వివరాలు నిర్ధారించేందుకు రెవెన్యూ శాఖకు అధికారికంగా లేక పంపనున్నట్లు వెల్లడించారు. చెరువు ఆక్రమణకు సంబంధించిన ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కథనాన్ని ప్రచురించి 'ప్రజాపక్షం' దినపత్రికకు గ్రామ రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువును పూర్తి స్థాయిలో ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని వారు అధికారులను కోరారు.

## డ్వాక్రా భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని మల్లన్నపాలెం గ్రామంలో నూతనంగా వివో బిల్డింగ్(డ్వాక్రా మహిళా సమైక్య భవనం) నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కోలేటి వెంకటేశ్వర్లు, పరిటాల లింగయ్య మాట్లాడారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క ఆదేశాల మేరకు శంకుస్థాపన నిర్వహించామని, గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి నూతన డ్వాక్రా మహిళా సమైక్య భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చిరామయ్య, నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్, మల్లెల అజయ్, మాజీ సర్పంచి చిలకల రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ నాగహుస్సేన్‌ఖాన్, ఉపాధ్యక్షుడు ఏనబోయిన ముత్తయ్య, పంచాయతీరాజ్ ఏఈ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ, మాజీ నీటి సంఘాల అధ్యక్షుడు నంజాల నర్సింహారావు, దేవాదాయ శాఖ ఛైర్మన్ కోలేటి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచి షేక్ రహింతుల్లా, నాయకులు జానకిరామ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉపేందర్, నాగయ్యబాబు, షేక్ నాగులమీరా, షేక్‌ఖాజా, పరిటాల రమేశ్, గ్రామదీపిక షేక్ హుస్సేన్‌బీ, వివో అధ్యక్షురాలు నెల్లూరి శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ భద్రయ్య పాల్గొన్నారు.

## డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై ఎస్‌బిఐ అవగాహన శిబిరం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం ఎస్‌బిఐ శాఖలో ఇటీవల నూతన శాఖ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన గాజుల దిలీప్ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ భద్రతపై అవగాహన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గాజుల దిలీప్ మాట్లాడుతూ స్థానిక శాఖను సేవలపరంగా మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కస్టమర్లకు వేగవంతమైన, సులభమైన, సురక్షితమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంక్ వాట్సాప్ బ్యాకింగ్, యోనో యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోసాలకు గురికాకుండా పాటించాల్సిన సూచనలను వివరించారు. భవిష్యత్తులో డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగం మరింత పెరుగుతుందని, ప్రతి ఖాతాదారుడు డిజిటల్ సేవలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేవలం రూ.3వేలు ప్రీమియంతో ప్రమాద భీమా పాలసీ తీసుకుంటే రూ.60లక్షల వరకు బీమా రక్షణ పొందే అవకాశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్ బాలకృష్ణ, భరత్, రమేష్, వెంకట్, స్నేహతో పాటు ఖాతాదారులు పాల్గొన్నారు.

# తాడిచర్ల ఓసి బ్లాక్-2 సింగరేణికి లైఫ్ లైన్

440 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు* మొత్తం విస్తీర్ణం 1875 చదరపు కిలోమీటర్లు* సింగరేణిలోనే బాహుబలి గనిగా ఆవిర్భావం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి కాలరీస్ మరో మైలురాయి దాటింది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న తాడిచర్ల2 బ్లాక్ ఎట్టకేలకు సింగరేణి సొంత మైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఈ చారిత్రాత్మకయుగం ప్రారంభం కానుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ మండలం తాడిచర్ల సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో తాడిచర్ల ఓసి బ్లాక్ 2 మైనింగ్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. దీంతో తెలగాణకు బొగ్గు కొరత తీరనుంది. రాష్ట్ర విద్యుత్ రంగానికి సుదీర్ఘకాలం పాటు అత్యంత నాణ్య మైన బొగ్గు సరఫరా ఉత్పత్తి కానుంది.

**తాడిచర్ల ఓసి 2 గని.. ప్రత్యేక**

ప్రస్తుతం సింగరేణిలో అతిపెద్ద ఓపెన్ కాస్ట్ గనిగా అవతరించ బోతుంది. ఒసి(227 మిలియన్ టన్నుల సామర్థ్య) రికార్డును తిరగరాస్తూ 300 మిలియన్ టన్నుల వెలికితీత సామర్థ్యంతో తాడిచర్ల 2 సింగరేణిలోనే అతిపెద్ద బాహుబలి బొగ్గు గనిగా అవతరించబోతోంది. కేవలం మరో బొగ్గు గనిగా కాకుండా, సింగరేణి మనుగడకు ఇది ఒక బలమైన లైఫ్ లైన్ గా నిలవ నుంది. ఈ ప్రాజెక్టు మొత్తం విస్తీర్ణం 1875 చదరపు కిలోమీటర్లు భూగర్భ బొగ్గు నిల్వలు 440 మిలియన్ టన్నులు, వెలికితీతకు అనుకూలమైన నిల్వలు 300 మిలియన్ టన్ను లు, బొగ్గు నాణ్యత జీ గ్రేడ్, అత్యంత నాణ్యమై నదిగా పే రుంది. ఈప్రాజెక్టుజీవితకాలం4550సంవత్సరాలు ఉంటుంది.

**రెండు దశల్లో ప్రగతి**

తాడిచర్ల 2 ప్రాజెక్టును అత్యంత ప్రణాళికాబద్ధంగా రెం డు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశలో 76 6 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల సుమారు 200 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీయనున్నారు. రెండో దశలో 1108 చదరపు కిలోమీటర్ల పరిధిలో సుమారు 200 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీసేం దుకు పనిచేయాల్సి ఉంది. మొత్తం వెలికితీసేందు కు అనువుగా ఉన్న నిల్వలు 500 మిలియన్ టన్నులు.

**భూపాలపల్లి జిల్లాకు పారిశ్రామిక కళ**

ఈ భారీ ప్రాజెక్టుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ప్రాంతీయ అభివృద్ధిలో ఈ మైనింగ్ ప్రాజెక్టు సరికొత్త విప్లవాన్ని తీసుకురానుంది. పైగా ఇది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడం విశేషం. దీంతో స్థానిక యువతకు 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించడమే కాకుండా పరోక్షంగా మరో 3వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. రహదారులు, రైల్వేకనెక్టివిటీ, మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం అవుతుంది. దీంతో ప్రాంతీయ ప్రగతి మరింత మెరుగుపడుతుంది.

**విద్యుత్ రంగానికి దీర్ఘకాలిక భరోసా**

ఈ మైనింగ్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు రూ.2500 కోట్ల భారీ టర్నోవర్ జరిగే అవకాశం ఉంది. ఇది సింగరేణి ఆర్థిక బలాన్ని మరింత పెంచుతుంది. అలాగే రాష్ట్రంలో విద్యుత్ రంగానికి నాణ్యమైన బొగ్గు నిరంతరాయంగా అందడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి తిరుగులేని భరోసా లభిస్తుంది. ప్రజా ప్రభుత్వ పాలనలో సాధించిన ఈ తాడిచెర్ల ఓసి 2 బ్లాక్ సాధన సింగరేణి పయనాన్ని విజయపథం వైపు నడి పిస్తూ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు గట్టి పునాది వేసింది. ఈవిజయం సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టు సింగరేణికి వేలం లేకుండా డైరెక్ట్ గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి.

## ‘నీట్’ లీకేజీలో ప్రధాన్ రాజీనామా సరిపోదు: సిపిఐ

**ప్రజాపక్షం/మరిపెడ:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సరిపోదనీ సిపిఐ పార్టీ వర్గాలు డిమాండ్ చేశాయి.శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని రాజీవ్ సెంటర్ వద్ద సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఒక్కటే పరిష్కారం కాదని,ఈ కుంభకోణంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని,నీట్ నిర్వహణలో జరిగిన ఫెయిల్యూర్ కు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు .ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని,నష్ట పరిహారం చెల్లించి,ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరుగకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని,భద్రత కట్టుదిట్టం చేయాలని,సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ కేంద్ర ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత విజయం : ఎమ్మెల్యే దొంతి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమని, ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్ర బిజెపి ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టని, విద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందన్నారు. ఈ రాజీనామా దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని, విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పూర్తిగా మార్చుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు.

## తాడ్వాయిలో ములుగు ఎస్‌పి తనిఖీలు



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపిఎస్ శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు.తొలుత పోలీస్‌ల గౌరవ వందనం స్వీకరించిన ఆయన స్టేషన్ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన స్వాధీనం చేసిన వాహనాల స్థితిగతులపై అధిరులను అడిగి తెలుసుకున్నారు.రిసెప్షన్‌లో ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించిన ఎస్‌పి కేసు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, రౌడీ షీటర్లపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందేలా పనిచేయాలని అన్నారు. తనిఖీల్లో ములుగు డిఎస్‌పి రవీందర్, పస్రా సిఐ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కెటిపిపి ఆర్టిజన్ కార్మికుడికి ఎఐటియుసి నేతల నివాళి



**ప్రజాపక్షం/ములుగు:** కెటిపిపి ఆర్టిజన్ కార్మికుడు దుగ్యాల శ్రీకాంత్‌రావు మృతికి ఎఐటియుసి హెచ్ 64 నాయకులు సంతాపం తెలిపారు. శనివారం మల్లంపల్లి(ఏసు నగర్)లోని ఆయన స్వగృహంలో భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలోఎఐటియుసి హెచ్ 64 రాష్ట్ర వర్కింగ్ ప ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంట మహేందర్, రీజినల్ ప్రెసిడెంట్ కోల శ్యామ్, ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/జనగామ:** వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుతూ శనివారం జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్ పట్టణంలోని గుండ్లగడ్డ ఉమామహేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర ఘటాభిషేకంలో పాల్గొని శివలింగం వద్ద బిందెలతో నీరు పోశారు. సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలాలని, రైతులు బాగుండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు సాంబమూర్తి శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వయించారు.

## గిఫ్ట్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ పట్టణంలోని సూర్యపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జయ జయ వారాహి గిఫ్ట్ షాప్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. గిఫ్ట్ షాపును ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం రంగంలో అడుగు పెడుతున్న వారికి విజయాలు చేకూరాలని ఆకాక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

## పంట మార్పిడితోనే రైతులు, సమాజానికి మేలు

కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** పంట మార్పిడితోనే రైతులకు, సమాజానికి మేలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్న–బుజ్జి దంపతుల పొలంలో శనివారం కలెక్టర్ పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు అవసరమైన సలహాలు అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, అకాల వర్షాలు ,సూపర్ ఎల్‌నినో వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి రైతులందరూ పంట మార్పిడి పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.కేవలం వరి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పప్పు దినుసులు, నూనెగింజలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలి. ప్రతి రైతు తమ భూమిని భాగాలుగా చేసి వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. జిల్లాలో నూతన ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామంలో అన్ని రకాల పోషకాహార పంటలు పండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులు సామాజిక బాధ్యతతో ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ/ ఆరోగ్యకరమైన పంటలను పండించాలి. తక్కువ రసాయనాలు వాడే రైతుల ఉత్పత్తులకు నగరాల్లో మంచి మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు.రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచించి, ప్రభుత్వానికి సహకరిస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు.పంట మార్పిడి అవగాహన కార్యక్రమంలో భాగంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి భారతీయ ఉద్యాన పరిశోధన స్థాన ం, బెంగళూరు వారిచే రూపొందించబడిన నల్ల తామర పురుగులు తట్టుకునే అర్క తేజస్వి రకం విత్తనాలను రైతులకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతి మీద పంపిణీ కార్యక్రమం ప్రారంభి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరిపె డ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జి ల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు p.మురళి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రశాంత్ , కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్, ఉద్యాన శాస్త్రవేత్త ఎల్ సుహాసిని, వ్యవసాయ అధికారులు వీరా సింగ్, శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సర్పంచ్ లచ్చుపతి, మరిపెడ మున్సిపల్ చైర్మన్, మండల అభివృద్ధి అధికారి, తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ అధికారులు,ఉద్యాన అధికారులు శాంతిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## పరకాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి: ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు చిరు వ్యాపారులు సహకరించాలి అని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు.శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ ను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాలను పర్యటించి,చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మిగిలిపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు, లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తామని అన్నారు.చేపల మార్కెట్ బయట ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,వీరికి నిర్దిష్టమైన ప్రదేశంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు.నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై చెత్త వేస్తే పెనాల్టీ విధిస్తామని అన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి వారి యొక్క జీవనదారం కోల్పోకుండా ప్రత్యామ్నాయంగా నిర్దిష్టమైన ప్రదేశం కేటాయిస్తామని అన్నారు. అలాగే పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్క రూ సహకరించాలి,ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం, గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అన్నారు. ఎమ్మెల్యే రేవూరి వెం ట పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునిల్ తదితరులు ఉన్నారు..

## విత్తనాలు,ఎరువులు,పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండలంలోని కంఠాత్మకూర్,చర్లపల్లి, నడికూడ,వెంకటేశ్వర్లపల్లి, రాయపర్తి,నర్సక్కపల్లి,ముస్త్యాలపల్లి గ్రామాలలోని ఎరువులు,విత్తనాలు,పురుగుమందుల డీలర్ల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి జై సింగ్ ముమ్మరంగా తనిఖీ చేశారు.అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులను, విత్తనాలను,పురుగుమందులను విక్రయించాలని ఏ డీలర్ అయినా ఎమ్మార్పీ దాటి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించినచో డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులు,స్టాక్ బోర్డులు,ధరల పట్టికలు,నిల్వలు సక్రమంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను పరిశీలించామని గతంలో స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేసిన పారాక్వాట్ గడ్డి మందు నిల్వలు డీలర్ల వద్ద ఉన్నాయా లేవా అనే విషయంలో తనిఖీలు చేశామని డీలర్లు,రైతులకు పారాక్వాట్ గడ్డి మందును విక్రయించరాదని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై పురుగుమందుల చట్టం1968 ప్రకారం లైసెన్స్ సస్పెన్షన్, లైసెన్స్ రద్దు,స్టాక్ స్వాధీనం,ఇతర చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు కూడా అట్టి గడ్డి మందు ప్రభుత్వ అనుమతి లేదు కాబట్టి రైతు సోదరులు ఎవరు కూడా వాడకూడదని, రైతులందరూ నాణ్యమైన ఎరువులు,విత్తనాలు పురుగుమందులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గోపీనాథ్, ప్రశాంత్,డీలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల పోరాటానికి ఘన విజయం

బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** నీట్ ప్రవేశ పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లీకేజీ చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని మొదలైన డిమాండ్స్ తో సిజెపి నిర్వహిస్తున్న పోరాటంతో ఎట్టకేలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి ఘనవిజయమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా 23 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడిన మనోవేదన వెలకట్టలేనిదన్నారు. 23 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ గత నెల రోజులుగా శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన పోరాటాలను వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతు ఇచ్చాయని అన్నారు. సోనమ్ వాంగ్ చుంగ్ 26 రోజులపాటు నిరవధిక నిరాహార దీక్ష చేయడం, ప్రభుత్వం నిర్బంధంగా అరెస్ట్ చేయడం, చలో పార్లమెంటు ముట్టడి సందర్భంగా పాల్గొన్న వేలాది మంది యువతి యువకులను క్రూరంగా లాఠీలతో రక్తాలు కారే విధంగా కొట్టడం, ఒక విద్యార్థిని మరణించడం, అనేకమంది ఆసుపత్రి పాలు కావడం, ఉద్యమాన్ని అణచేందుకు చేసిన నిర్బంధ కాండ ఇంతా అంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిర్బంధ విధానాలను, విద్యార్థి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని , లేనిచో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

## ‘డబుల్ ఓటు’ను అరికట్టడానికే ‘సర్’

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో డబుల్ ఓటు లేకుండా ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండేలా చేపట్టిన సర్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. శనివారం ఐడిఒసి.కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అండ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపులను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లు నియమించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా జరుగుతుందని సూచించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ 84.12 శాతం పూర్తి అయిందని అయితే పురపాలక పరిధిలో 70 శాతం జరిగిందని వేగవంతానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సర్ ప్రక్రియ ఆగస్టు3 న ముగియనున్నందున అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ‘సర్’ సర్వేలో కాంగ్రెస్ శ్రేణులు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/టేకుమట్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేసి విజయవంతమయ్యేలా కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు.శనివారం మండలంలోని పిఆర్‌ఎంఆర్ గార్డెన్ లో జిల్లా ప్రధానకార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సర్వేపై విస్తృతస్థాయిసమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్,టిపిసిసి కోఆర్డినేటర్ సి రాజ్ మహ్మద్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంతభాధ్యతాయుతంగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ప్రజలకు ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన దరఖాస్తులు సకాలంలో సమర్పించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు .సర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు జిల్లా,మండల,గ్రామ స్థాయిలో నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియను 100 శాతం పూర్తి చే యాలని పిలుపునిచ్చారు.మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, రవిందర్,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతుల శ్రీనివాస్ ,మార్కెట్ డైరెక్టర్ లింగంపల్లి కిరణ్ రావు,మండల నాయకులు,వివిధ గ్రామల సర్పంచ్‌లు,గ్రామశాఖఅధ్యక్షులు,బిఎల్ఎలు,కార్యకర్తలుపాల్గొన్నారు.

## ఆరుతడి పంటలతోనే అధిక ఆదాయం

పెసర, ఆయిల్‌పామ్, మామిడి తోటలను పరిశీలించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/ఐనవోలు:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.శనివారం ఐనవోలు మండలం సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్ పంటలతో పాటు మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సింగారం గ్రామానికి చెందిన రైతు ఆకారపు పురుషోత్తం రెడ్డి మూడు ఎకరాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగంతో పెసర పంటను సాగు చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా ఏయే పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెసర, మినుములు, కందులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, 60–70 రోజుల్లో దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తోందని తెలిపారు. ఈ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.అనంతరం పున్నేలు గ్రామంలో రైతు వేల్పుల రమేష్ ఆరున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. పంట సాగు కాలం, దిగుబడి, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతు రాజారపు బాలరాజు కూడా ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు కలెక్టర్‌కు తెలిపారు.అలాగే రైతు రవికిరణ్ రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి తోటను సందర్శించి తోట నిర్వహణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే పెసర, మినుములు, కందులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పచ్చజొన్న వంటి ఆరుతడి పంటలు రైతులకు మరింత ప్రయోజనకరమని పేర్కొన్నారు.అలాగే ఆయిల్ పామ్ దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని, అనుకూల ప్రాంతాల్లో రైతులు ఈ పంట సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇప్పటికే పెసర, ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందిస్తూ, ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కూడా పెసర, మినుములు, కందుల విత్తనాలను సబ్సిడీపై అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తతల మధ్య నారాయణపూర్ భూసేకరణ సర్వే


అడ్డుకున్న స్థానికులు... వెనుదిరిగిన అధికారులు



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం భూసేకరణ అధికారుల సర్వే ప్రక్రియ తీవ్ర కలకలం రేపింది. గ్రామంలో నిర్వచతలపెట్టిన చెరువు కట్ట అలైన్మెంట్, భూసేకరణ ప్రక్రియలో భాగంగా అధికారులు మరోక్కసారి సర్వే నిర్వహించేందుకు రాగా గ్రామస్తులు వారిని అడ్డుకోవడంతో పరిణామాలు ఉద్రిక్తంగా మారాయి. సర్వేను నిలిపివేయాలని పట్టుబట్టిన గ్రామస్తులు, సర్వే బృందాన్ని ముందుకు సాగనివ్వకుండా నిలదీశారు. ఈ క్రమంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. నారాయణపూర్ చెరువు కట్ట నిర్మాణంలో భాగంగా ఇప్పటికే పలువురు తమ ఇళ్లు, వ్యవసాయ భూములను కోల్పోయారు. అయితే అధికారులు కేవలం ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురవుతున్న కొందరి ఇళ్లను మాత్రమే సర్వేను తిరిగి చేస్తున్నారని తెలియడంతో మిగతా గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ఉన్న తమ ఇళ్లకు కూడా చెరువు వల్ల భవిష్యత్తులో ముప్పు పొంచి ఉందంటూ తమ ఇళ్లను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పరిహారం ఇవ్వాలని ఆ దిశగా సర్వే నిర్వహించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇళ్లు కోల్పోతున్న వర్గానికి మిగిలిన గ్రామస్తులకు మధ్య భూసేకరణ అంశంపై తీవ్ర విభేదాలు తలెత్తాయని నిబంధనల ప్రకారంలో సర్వే జరగాలని ఒక వర్గం వాదించగా అందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని మరోక వర్గం పట్టుబట్టింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరినొకరు తిట్టుకుంటూ భౌతిక దాడులకు దిగేంతస్థాయిలో గొడవ పడ్డారు. ఈ పరిస్థితుల్లో చేసేదేమి లేక సర్వే నిర్వహించకుండానే అధికారులు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు తక్షణమే స్పందించి గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణపై గంగాధర పోలీస్ స్టేషన్లో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదులను స్వీకరించిన ఎస్సై వంశీ కృష్ణ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు చర్యగా గ్రామంలో పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు.

## వేములవాడలో ఘనంగా ముగిసిన అఖిల భారత వేద విద్వత్ సదస్సు

నూతన వేద పాఠశాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన అఖిల భారత వేద–శాస్త్ర–స్మార్త–ఆగమ విద్వత్ సదస్సు మరియు పరీక్షా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. పలు రాష్ట్రాల నుంచి హాజరైన 130 మంది విద్యార్థుల్లో 124 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడలో ఐదు ఎకరాల్లో నూతన వేద, సంస్కృత పాఠశాల భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆలయ అర్చక నియామకాలలో స్థానిక అనువంశిక అర్చకులకే తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సమర్థవంతంగా నిర్వహించిన అధికారులు, పండితులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**అఖండ భజనలో పాల్గొన్న 'ఆది'**

**చందుర్తి :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం లో సాధు సజ్జన భజన మండలి ఆధ్వర్యం లో శనివారం నిర్వహిస్తున్న 24 గంటల అఖండ భజనలో కార్యక్రమం లో ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్యెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమం లో పలువురు ప్రజాప్రతినిధులు,భక్తులు , గ్రామ ప్రముఖులు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న పేపర్ లీక్‌లను పూర్తిగా అరికట్టాలని,పరీక్షా వ్యవస్థలో పూర్తి పారదర్శకత,జవాబుదారీతనం, నిష్పక్షపాతాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం జిల్లా కేంద్రంలో ఏఐపీసీ జిల్లా అధ్యక్షులు కమ్మగోని చౌదరి గౌడ్ నాయకత్వంలో నీట్ పేపర్ లీక్ ఘటనను తీవ్రంగా నిరసిస్తూ,రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐపీసీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తున్న ప్రజాస్వామ్య స్వరాలను అణచివేయకుండా, శాంతియుత నిరసన తెలిపే హక్కును గౌరవించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని, వారికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా నాయకురాలు భారతి దేవి,గ్రామ అధ్యక్షుడు కీర్తి హరీష్, సిరిసిల్ల శంకర్, రవి, అశోక్, రామస్వామి,గడ్డం సాయి, రాజు, సదానందం, రాజు, పోగుల తిరుపతి తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొని తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో గ్రామాలకు భద్రత: సిఐ

**ప్రజాపక్షం/ధర్మపురి :** గ్రామాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణతోపాటు ప్రజల భద్రత మరింత మెరుగుపడుతుందని ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి అన్నారు.మండలంలోని నేరెల్ల గ్రామంలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఐ రాం నర్సింహారెడ్డి,ఎస్సై గురుక మహేష్ లు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.రోడ్డు భద్రతా నియమాలు,డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు,సైబర్ నేరాల నివారణ చర్యలు,సీసీ టివి కెమెరాల ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రజలకు సమగ్రంగా వివరించారు.అదేవిధంగా ఆన్లైన్ మోసాలు,ఫేక్ కాల్స్,అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.నేరెల్ల గ్రామంలో ప్రజల సహకారంతో పోలీసు శాఖ అధికారులు సూచనల మేరకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్ కాసారపు బాలాగౌడ్ పేర్కొన్నారు.

# రైల్వే లైన్ల విస్తరణకు భూసేకరణ వేగవంతం

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో చేపడుతున్న రైల్వే లైన్ల విస్తరణ, ఆధునీకరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు తో కలిసి దక్షిణ మధ్య రైల్వే, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జులు , రోడ్డు అండర్ బ్రిడ్జులు , ఫుట్ ఓవర్ బ్రిడ్జులు నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్షించారు.రైల్వే లెవల్ క్రాసింగ్‌ల ప్రస్తుత పరిస్థితి, భూసేకరణలో ఎదురవుతున్న అంశాలు,నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను రైల్వే, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణను రెవెన్యూ అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు కనీస ఇబ్బందులు కలగకుండా రైల్వే అధికారులు అలైన్‌మెంట్‌ను ఖరారు చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో తలెత్తే సమస్యలను పరస్పర సహకారంతో వెంటనే పరిష్కరించి ప్రాజెక్టుల అమలుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని ఓదెల, పెద్దపల్లి, రామగుండం, అంతర్గాం మండలాల్లో ప్రతిపాదిత రైల్వే వంతెనలు, అండర్ బ్రిడ్జులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జుల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ లు ఓదెల వనజ , పెద్దపల్లి రాజయ్య, అంతర్గాం, రామగుండం తహసీల్దార్లు, ఏడీ సర్వేయర్,సంబంధిత రెవెన్యూ దక్షిణ మధ్య రైల్వే భూసేకరణ నిపుణులు పి. దేవరాజు (సికింద్రాబాద్),సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు హరిహరాచారి (కాజీపేట్),ఓంప్రకాశ్ (రామగుండం), రైల్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఏఐటియుసిది రక్త చరిత్ర

కార్మికులకు హెచ్ఎంఎస్ క్షమాపణ చెప్పాలని ఏఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో ఏఐటియుసి ది కొత్త చరిత్ర కాదని రక్త చరిత్ర అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి లు పేర్కొన్నారు. సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ సి.హెచ్.పి లో శనివారం జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ, సోషల్ మీడియాలో హెచ్ ఎం ఎస్ యూనియన్ ఏఐటియుసిపై నాయకులపై అభ్యంతరకరమైన పోస్టులు పెట్టడం కార్మిక వ్యతిరేక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో ఏఐటియుసి యూనియన్ కార్మిక హక్కుల కోసం, సంస్థ పరిరక్షణ కోసం గత ఎనభై ఏండ్లకు పైగా అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి,సంఘ విద్రోహుల చేతిలో నాయకులు బలిదానం అయ్యారని, తమ రక్తాన్ని ధారపోసి, తమ జీవితాలను త్యాగం చేశారని వారు గుర్తు చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడుతూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న హెచ్ ఎం ఎస్ యూనియన్ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే కార్మికులే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఏఐటియుసి సి హెచ్ పి డిపార్ట్మెంట్ కార్యదర్శి బండి మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడగా, నాయకులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్,పెర్క మహేందర్,మానాల శ్రీనివాస్,కారంపూరి వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## తప్పించుకున్న రిమాండ్ ఖైదీ

ఖైది కోసం పోలీసుల గాలింపు ముమ్మరం



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేటలో రిమాండ్ ఖైది పరారి శనివారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశంగా మారింది. ఈసంఘటన వివరాలు ఇలావున్నాయి. సిద్దిపేట జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న 7గురు ఖైదీలను సాధరణ పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి శనివారం పోలీసులకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో పోలీసు వ్యాన్ ఎమర్జన్సి డోర్ నుండి పోలీసులు కండ్లుగప్పి బైక్‌ల దొంద సాయికుమార్ అనే ఖైది పరారైనారు. ఖైది సాయికుమార్ బైక్ దొంగతనం. ఆటో దొంగతనం కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నారు. తప్పించుకున్న ఖైది సాయి కుమార్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో పోలీసు అధికారులు గస్తి చేపట్టి తనిఖీలు చేస్తున్నారు.

## 'నీట్' నిర్వహణను రాష్ట్రాలకు అప్పజెప్పాలి

సిపిఐ, ఏఐటియుసి నేతల డిమాండ్




**ప్రజాపక్షం/గజ్వేల్:** నీట్ పరీక్ష పత్రాల లీకుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఐ పార్టీ గజ్వేల్ పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన అనంతంర మీడియాతో వారు మాట్లాడారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన ధర్నాకు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాగా ఎన్టీఏ రద్దుచేసి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ కోటి పరిహారం ఇవ్వాలని, ధర్నాలో పాల్గొన్న విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, విద్యావ్యవస్థలో మాఫియాను అరికట్టాలని, మరియు ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుత ధర్నాలో పాల్గొన్న విద్యార్థులపై అమానుషంగా చేస్తున్న లాఠీఛార్జీలు దుర్మార్గమని, దేశ ప్రధాని అర్ధరాత్రి సెల్ఫీ వీడియోలు విడుదల చేయడం సిగ్గుచేటని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు శీను, సత్తయ్య, ఎండి సాదక్, దొమ్మాట యాదయ్య, దాతర్ పల్లి నర్సింహులు, కొమురయ్య, ఐలయ్య, పోతుల నర్సింలు, నజీర్, కుంట నర్సింలు, ఎండి రహమాన్, తిరుపతి, పోచయ్య, గుర్రాల యాదయ్య, పాషా, అజ్మీర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్ రింగ్ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చుట్టూ అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆటో కార్మికులతో కలిసి కార్మికుల సొంత డబ్బుతో గుంతలమయమైన రోడ్డును టిప్పర్లతోమట్టి తెప్పించి గుంతలు పూడ్చారు. నాయకులతో కలిసి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియా మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన గజ్వేల్ రింగ్ రోడ్డు 23 కిలోమీటర్ల పొడుగు తో రూ 230 కోట్లతో ఏర్పాటు చేసిందని, అయితే ఈ రింగ్ రోడ్డు 10 ఏండ్ల గడిచినా పూర్తి కాలేదని ఎద్దేవా చేస్తూ అసంపూర్తి పనులతో నిలిచిపోయినట్లు విమర్శించారు. గజ్వేల్ లోకి నాగపూర్ రహదారి, మెదక్ తూప్రాన్ సంగారెడ్డి మీదుగా వచ్చే హెవీ వెహికల్స్ గజ్వేల్ పట్టణంలోకి రావడంతో ట్రాఫిక్ జామ్ అవుతూ ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, శ్రీను, సత్తయ్య, సాధక్, యాదయ్య, నర్సింలు, కొమురయ్య, ఐలయ్య, నర్సింలు, ఎల్లం, పాల్గొన్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగుల పోరాటానికి దక్కిన విజయం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎన్టీఏ నిర్వహించిన నీట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ పరీక్షల పేపర్ లీకేజీలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశంలోని కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన చారిత్రాత్మక విజయమని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా సాగిన ఉధృత ఆందోళనలు,విద్యార్థి సంఘాల అలుపెరగని పోరాటం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చిందని ఆయన తెలిపారు.సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లీకేజీ సూత్రధారులను కఠినంగా శిక్షించాలనీ,కేవలం కేంద్ర మంత్రి రాజీనామాతో సరిపెట్టకుండా, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన పేపర్ లీకేజీ మాఫియా వెనుక ఉన్న అసలు సూత్రధారులను, పెద్ద తలకాయలను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీల వల్ల పరీక్షలు రద్దు కావడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకున్న 21 మంది అమాయక విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ. 1 కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలనీ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై జూలై 20న ఢిల్లీ పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, క్రూరమైన అణిచివేత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇందుకు కారణమైన పోలీస్ అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పరీక్షల వ్యవస్థ ప్రక్షాళన చేసి భవిష్యత్తులో దేశంలో ఎలాంటి ప్రభుత్వ లేదా అర్హత పరీక్షల లీకేజీలు జరగకుండా పార్లమెంట్‌లో పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆడుకునే ఏ ప్రభుత్వానికైనా యువశక్తి తలవంచక తప్పదని ఈ పరిణామం నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నిర్ణీత గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి

మేయర్ కొలగాని శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర ప్రజలకు అత్యాధునిక మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్–వెజ్ మార్కెట్లు, ఐసీడీఎస్ భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ వెజ్ & నాన్–వెజ్ మార్కెట్ ను సందర్శించిన మేయర్, ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ మార్కెట్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, వినియోగదారుల సౌకర్యాలు, వ్యాపారుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం కాశ్మీర్‌గడ్డ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్, మిగిలిన పనులను వేగవంతం చేసి రాబోయే 30 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను సమీక్షించిన మేయర్, నిర్మాణాన్ని అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేసి మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఐసీడీఎస్ భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ పనులను మేయర్, కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యత, పార్కింగ్ సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్ రూపకల్పన, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆధునిక మార్కెట్లు, సమగ్ర పార్కింగ్ సదుపాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నగరాభివృద్ధికి కొత్త దిశను చూపుతాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్‌ప్రఫుల్ దేశాయ్, సునీల్ రావు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: డిఎస్‌పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి అన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఉదయం సిరిసిల్ల డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కొక్కుల ఆంజనేయులుపై కేసు నమోదు చేసి, 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను (సస్పెక్ట్స్) తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రస్తుతం వారు ఎలాంటి ఉపాధి చేస్తున్నారు, ఎక్కడ నివాసం ఉంటున్నారు,అనే వివరాలను సేకరించి, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనిలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు నాగరాజు, గణేష్, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి సాధించిన మహా విజయం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి సాధించిన మహా విజయం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ పేర్కొన్నారు. ఈ విజయం దేశవ్యాప్తంగా మహిళలు, యువత పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. అవినీతి బురదలో కూరుకుపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని స్పష్టం చేశారు. అధికార అహంకారంతో దేశ విద్యావ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించి, దేశ యువత ఆశయాలను అణచివేయాలని ప్రయత్నించిన ప్రధాని నరేంద్ర మోదీ నియంతృత్వ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో దేశ యువత పోరాటం ఆగదని, రాబోయే రోజుల్లో ప్రధాని మోదీతో సహా కేంద్ర మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. ఈ పోరాటంలో యువతకు అండగా నిలిచి, లాఠీ దెబ్బలను ఎదుర్కొని, అక్రమ అరెస్టులకు వెనుకాడని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని ఆమె పేర్కొన్నారు.

## ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు యూరియ విక్రయించిన దుకాణదారునికి నోటీసు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** ఆసలే వర్షాలు లేక ఆరకొర పంటలు వేసుకున్న రైతులపై ఎరువుల దుకాణం దారులు ఎం ఆర్ పి కంటే ఆదనంగా యూరియ బస్తాల పై ఎక్కువ డబ్బులు తీసుకు ఒటున్న ఎరువుల దుకాణం యజమానిపై రైతుల ఫిర్యాదు మేరకు మండల వ్యవసాయ ఆధికారి వేల్పుల పూజ నోటీసులు జారీ చేశారు. వ్యవసాయ ఆధికారి తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ మండల కేంద్రంలో పట్టణంలోని ఆక్కన్నపేట రోడ్డులో గల వేంకటేశ్వర ఫర్టిలైజర్ డీలరు యూరియపై ఎం ఆర్ పి కంటే ఆదనంగా వసూల్ చేస్తున్న షాపు తనిఖీ చేసి షోకాసు నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ ఎరువుల నియంత్రణ 1985 చట్టం ప్రకారం ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం మాత్రమే ఎరువులు రైతులకు ఆమ్మాలని షాపు యజమానులను కొరారు. నిర్ణయించిన ధరకు ఎక్కువ ఆమ్మితే లైసన్సు రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. రైతుల ఎక్కడైన ఎరువుల దుకాణదారులు ఎక్కువ ధరలకు ఆమ్మినట్లు తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.





# ‘ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా’తో సంబరాలతో హోరెత్తిన జంతర్ మంతర్

**న్యూఢిల్లీ :** ‘నీట్’ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారన్న వార్త అందడంతో శనివారం దేశరాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ అంబరాన్ని అంటే సంబరాలతో హోరెత్తింది. నిరసనల వేదిక ప్రాంగణంలో వేలాదిమంది నిరసనకారులు పట్టలేని సంతోష, సంబరాల్లో మునిగిపోయారు. దేశభక్తిగీతాలు, డప్పుల మోతలు, వందేమాతరం నినాదాలు ఆకాశాన్ని అంటాయి. వారాలుగా కొనసాగుతోన్న తమ ఆందోళనలో ఇదే ‘తొలి ప్రధాన విజయం’అని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త విన్న వెంటనే అభిజీత్ దీప్కే ‘సాధించాం’,‘సాధించాం’అంటూ బిగ్గరగా నినదించారు.కేంద్రమంత్రులతో సమావేశంజరిగిన వెంటనే, తమ సంస్థ చేసిన అన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో ఆందోళన విరమించుకుంటున్నట్లు సిజెపి ప్రతినిధులు చెప్పినప్పటికీ సంబరాలు కొనసాగాయి. కొద్ది రోజుల క్రితమే ఘర్షణలు, టియర్‌గ్యాస్ ప్రయోగాలు, నెత్తురోడుతున్న తీవ్ర గాయాలు, లాఠీ దెబ్బలకు సాక్ష్యంగా నిలిచిన నిరసన ప్రదేశం ప్రజాస్వామ్యాన్ని, విద్యార్థి ఐక్యతను కీర్తిస్తూ నినాదాలు హోరెత్తించడం, నిరసనకారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, త్రివర్ణపతాకాన్ని ఊపుతూ


## ‘ఛక్ దే ఇండియా’ పాటకు నిరసనకారులు నృత్యాలు



‘ఛక్ దే ఇండియా’గీతానికి వలయాకారంగానృత్యాలు చేస్తూ, డప్పులు వాయింపు దృశ్యాల వేదికగా జంతర్‌మంతర్ ప్రాంగణం రూపాంతరం చెందింది.నిరసనకారులు అనేకమంది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని పైకెత్తి పట్టుకోగా, మరికొందరు నిరసనకారులు తమ మొబైల్ ఫోన్ స్క్రీన్లపై ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లేఖను జంతర్‌మంతర్ వద్ద గుమిగూడిన హర్షధ్వానాల జనసమూహం వైపునకు చూపించారు. ఒక ప్రసిద్ధ సోషల్ మీడియా సృష్టించిన మీమ్స్‌ను పున: సృష్టించి వీడియోలు రికార్డ్ చేశారు. వేదికమీద ఉన్న సభ్యులు, వాలంటీర్లు మొదలుకుని కిక్కిరిసిన జనసమూహంలో చివరి అంచున నిలబడిన వారి వరకూ నిరసనకారులు స్వచ్ఛందంగా జాతీయగీతాన్ని ఆలపించారు. అనంతరం మళ్లీ బిగ్గరగా నినాదాలు చేశారు. ‘ఈ రాజీనామా చాలా ముందే జరగాల్సి ఉండేది’ అని నిరసన స్థలం నుంచి ఇంటికి వెళుతున్న నిరసనకారుడు నితిన్ అన్నారు.సోనమ్ వాంగ్‌చుక్ 11కిలోల బరువు తగ్గి ఉండాల్సింది కాదు.ప్రజలు కూడా ఇంత రక్తం కోల్పోవాల్సిన అవసరం లేదు. ఘర్షణలు, క్రూరత్వం, హింసను నివారించి ఉండవచ్చు కానీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు రాజీనామా చేసినందుకు మేం సంతోషంగా ఉన్నాం’ అని ఆయన వ్యాఖ్యానించారు. ‘ఇది కేవలం మొదటి అడుగు మాత్రమేనని, మన పోరాటం మన వ్యవస్థతోనేనని, విద్యాశాఖ మంత్రి మొదలు జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ) వరకూ ప్రతీ ఒక్కరినీ జవాబుదారీగా చేయాలి’ అని మరొక నిరసనకారిణి నమ్రత అన్నారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య నిరసన శక్తికి నిదర్శనంగా అభివర్ణించారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వ్యాఖ్యలను అభిజీత్ దీప్కే ప్రస్తావిస్తూ ‘మీరు మమ్మల్ని ‘బొద్దింకలు’ అని పిలువకపోయి ఉంటే, నేను భారతదేశానికి తిరిగివచ్చేవాడిని కాదు అని, మీరు మమ్మల్ని బొద్దింకలు అని పిలువకపోయి ఉంటే యువత దేశం వీధుల్లోకి వచ్చి ఉండేవారు కాదని, మీరు మమ్మల్ని పిలువకపోయి ఉంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ఉండేవారు కాదు’ అని వ్యాఖ్యానించారు.

## నా సలహా మేరకే సిజెపితో కేంద్రం చర్యలు?

### ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్



**పుణె :** యువ నిరసనకారులపై బలప్రయోగం చేయకుండా సిజెపి నాయకులతో చర్చలు జరపాలని తాను ప్రధాని నరేంద్ర మోదీని కోరానని, బహుశా ఆయన తన సలహాను పరిగణనలోకి తీసుకుని ఉండవచ్చని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం యువశక్తికి, భారతీయ ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని పవార్ శనివారం పుణెలో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. ప్రధాన్ రాజీనామా కోసం సిజెపి చేపట్టిన ఆందోళన సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పవార్ కలిశారు, ఆ తర్వాత ప్రధాని మోదీని కూడా కలిశారు. ‘నేను స్వయంగా ప్రధానిని కలిసి, ప్రజాస్వామ్యంలో చర్చలు జరపడం చాలా అవసరమని చెప్పాను. ప్రభుత్వం చర్చలకు సుముఖత చూపిస్తే, తాము కూడా చర్చలకు సిద్ధంగా ఉండాలని అభిజీత్ దీప్కేకు, ఇతర యువ నిరసనకారులకు కూడా చెప్పాను’ అని ఆయన అన్నారు. ప్రధాన్ రాజీనామా నిర్ణయంలో కనిపించినట్లుగా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం ప్రధానితో జరిపిన చర్చల ఫలితమేనా అని విలేకరి అడిగినప్పుడు, ‘చర్చలు ప్రారంభించాలని, విద్యార్థులపై పోలీసు చర్య తీసుకోకూడదని నేను ప్రధానిని గట్టిగా కోరాను. నేను చెప్పిన విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకుని ఉండవచ్చు’ అని బదులిచ్చారు. యువత ఉద్యమానికి పార్లమెంటరీ, నైతిక మద్దతు అందించినందుకు ప్రతిపక్ష పార్టీలకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పవార్ అన్నారు, అలాగే దేశంలో ప్రజాస్వామ్యం పునరుజ్జీవం పొందుతోందని పేర్కొన్నారు. యువ నిరసనకారులను అభినందిస్తూనే, వారిపై లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రభుత్వం నివారించి ఉండాల్సిందని ఆయన అన్నారు. ఢిల్లీ మెట్రోను నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలకు అసౌకర్యం కలిగిందని, అలాగే చాలా మంది యువ మహిళా నిరసనకారులపై తీసుకున్న చర్యలను కూడా నివారించి ఉండవచ్చు అని మాజీ కేంద్ర మంత్రి అన్నారు.

## నల్ల సముద్రంలో దాడి మరో భారత నావికుడు మృతి

### విదేశీమంత్రిత్వశాఖ ఖండన



**న్యూఢిల్లీ:** ఉక్రేన్ యుద్ధంలో పరస్పర దాడులవల్ల నల్ల సముద్రంలో ఒక భారతీయ నావికుడు మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జులై 19వ తేదీన ఒక నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడానికి ముందురోజునే 18వ తేదీన జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించినట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ ఘటనను భారత విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఎం.వి.ఓమోర్ఫ్ అనే నౌక రష్యా ప్రాదేశిక జలాల్లో ప్రవేశిస్తున్న సమయంలో దాడి జరగడంతో ఈనెల 18న భారతీయ నావికుడు మరణించాడన్న విషయం బయటపడింది. నౌకలో ఉన్న ముగ్గురు భారతీయులలో ఇద్దరు భారత నావికులు మాత్రం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. హోర్ముజ్ జలసంధిలో యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ 14 మంది భారతీయులు మరణించగా, ఇప్పుడు కొత్తగా యూరప్ దేశాల ఆయుధబలం సహాయంతో ఉక్రేన్ నల్ల సముద్రంలో రష్యా నౌకలపై తన దాడులను ఉద్ధృతం చేసిన తర్వాత మరో ముగ్గురు భారత నావికులు మరణించారు. సముద్ర రవాణా స్వేచ్ఛగా సాగాలని, యుద్ధంలో వైరివర్గాలు వాణిజ్య నౌకలపై దాడులు చేయకూడదని, అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని భారత విదేశీమంత్రిత్వశాఖ తన తాజా హెచ్చరికలో డిమాండ్ చేసింది.

## జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఘర్షణ

పోలీసులపై రాళ్లు రువ్విన కొందరు నిరసనకారులు
ఒక ప్రత్యేక పోలీలు, ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలు
నిరసనకారులపై లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, యువత సంబరాలు చేసుకున్నప్పటికీ కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద నిరసనకారులలో ఒక వర్గం భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఒక ప్రత్యేక పోలీస్ కమిషనర్‌తో పాటు మరో ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించి, స్వల్ప లాఠీచార్జికి పాల్పడ్డాయని వర్గాలు తెలిపాయి. నిరసన ప్రదేశంలో సీనియర్ పోలీసు అధికారులు జన సమూహ నియంత్రణను పర్యవేక్షిస్తుండగా, గుంపులోని ఒక వర్గం దూకుడుగా ప్రవర్తించడంతో ఈ హింస చెలరేగిందని వర్గాలు తెలిపాయి. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ప్రత్యేక పోలీస్ కమిషనర్, ఇతర సీనియర్, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి, జన సమూహాన్ని నియంత్రించి, భద్రతా ఏర్పాట్లకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించే ప్రయత్నాలలో ముందుండి నడిపించారు. శాంతిభద్రతలను కాపాడటానికి అధికారులు నిరసనకారులకు దగ్గరగా వెళ్లగా, కొందరు నిరసనకారులు నినాదాలు చేశారు. మరో వర్గం ఎటువంటి రెచ్చగొట్టడం లేకుండా రాళ్లు రువ్వడం ప్రారంభించిందని ఆ వర్గాలు తెలిపాయి. రాళ్ల దాడిలో ప్రత్యేక కమిషనర్ గాయపడగా, చికిత్స కోసం పోలీసు బృందాలు వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో మరో ఇద్దరు పోలీసు అధికారులు కూడా గాయపడ్డారని, వారిని ఆసుపత్రికి తరలించారని ఆయన తెలిపారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని ఆయన అన్నారు. నిరసన ప్రదేశంలో రాళ్ల దాడితో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. దీంతో, గుంపులోని హింసాత్మక వర్గాన్ని చెదరగొట్టి, పరిస్థితి మరింత ముదరకుండా నిరోధించడానికి భద్రతా సిబ్బంది బాష్పవాయువు ప్రయోగించి, స్వల్ప లాఠీచార్జి చేశారు. పోలీసు సిబ్బంది వెంటనే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిరసనకారులను వెనక్కి నెట్టివేసి, కొద్ది సమయంలోనే శాంతిభద్రతలను పునరుద్ధరించారని ఆ వర్గాలు తెలిపాయి. ‘పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది. శాంతిభద్రతలను కాపాడటానికి జంతర్ మంతర్ పరిసరాల్లో తగినంత పోలీసు బలగాలను మోహరించారు’ పేర్కొన్నారు. ఘర్షణలు ముగిసిన తర్వాత కూడా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉన్నారని, ముందుజాగ్రత్త చర్యగా కీలక ప్రదేశాల్లో అదనపు బలగాలను మోహరించారని ఆ వర్గాలు తెలిపాయి. రాళ్ల దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు, ఘటనా స్థలంలోని వీడియో ఫుటేజ్‌తో సహా అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు, న్యూఢిల్లీ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఢిల్లీ పోలీసులు 15 ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేశారు. శాంతిభద్రతలను కాపాడటానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఘర్షణల్లో ఇప్పటివరకు 200 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారు. కొనసాగుతున్న నిరసనలో 65 మందికి పైగా నిరసనకారులు గాయపడ్డారని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

## ‘జెన్‌జీ’ని చూస్తుంటే గర్వంగా ఉంది

### సినీనటి జ్యోతిక

**చెన్నై :** ప్రముఖ హీరో సూర్యా సతీమణి, సినీనటి జ్యోతిక నీట్ పరీక్షా పేపర్ లీక్ వ్యవహారంపై కొనసాగిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనలకు తన గట్టి మద్దతు పలికారు.‘జెన్ జీ’ ని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారిన పరిణామాలపై జ్యోతిక శనివారం ‘ఇన్‌స్టా’లో పోస్ట్ పెట్టారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలనే విద్యార్థుల డిమాండ్‌ను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. ‘నేను విద్యార్థులు, మన దేశ భవిష్యత్ కోసం ఆలోచిస్తాను. జవాబుదారీతనానికి మద్దతు ఇస్తాను. ప్రజాస్వామ్య భారతదేశం కోసం, మంచి విద్యా వ్యవస్థ కోసం నిలబడతాను’ అని పేర్కొన్నారు. పర్యావరణ ఉద్యమకారుడు, హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సౌరవ్‌దాస్ ఉద్యమంలో వారి పాత్రను జ్యోతిక ప్రశంసించారు. ‘ఒక తల్లిగా మా పిల్లలను మీలాగే పెంచాలని కోరుకుంటున్నాను. ఎలాంటి ముసుగులు లేకుండా పోరాడుతున్న జెన్ జీ యువతను చూసి గర్విస్తున్నాను. అందరూ కలిస్తేనే దేశం ముందుకు వెళుతుందని మీరు నిరూపించారు. ఒత్తిడిని అధిగమించినందుకు, మాలో భయాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు’ అని జ్యోతిక తన పోస్ట్‌లో పదునైన పదాలతో రాసుకొచ్చారు. ఇటీవల ఆమె భర్త సూర్యా జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఫ్యాన్స్ క్లబ్ ఒక ప్రకటన చేసింది. సూర్యా తన బర్త్ డే వేడుకలను జరుపుకోవద్దని, అందుకు బదులుగా గత కొద్ది రోజులుగా విద్యార్థులు కొనసాగిస్తున్న నిరసనలు, ఆందోళనలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారని తెలియజేసిన అనంతరం, జ్యోతిక ఇన్‌స్టా పోస్ట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

## పాలకుల జవాబుదారీకి జనరేషన్-జెడ్ పునఃప్రతిష్ట


ప్రజాస్వామ్య మౌలిక హక్కులు తిరిగి సాధించిన ఉద్యమం
విదేశీకుట్రగా చిత్రీకరించే ప్రయత్నం బెడిసికొట్టింది
విద్యావ్యవస్థపై దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నం
ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్



**న్యూఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తొలి విజయం సాధించిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), ఆయన మద్దతుదారులు, దేశ విద్యార్థులు, యువకుల ఉద్యమానికి ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అభినందనలు తెలియజేశారు. అధికారం చలాయిస్తున్న పాలకులకు ఇన్నాళ్ళుగా మరచిపోయిన జవాబుదారీతనం చాలా ముఖ్యమైనదన్న అంశాన్ని జనరేషన్ –జెడ్ ఉద్యమం దేశంలో పునఃప్రతిష్ఠంపజేసిందని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజ్, విద్యావ్యవస్థలో అవినీతికిగాను మంత్రి రాజీనామా చేయడం ద్వారా విద్యార్థి ఉద్యమం దేశంలో పాలకుల జవాబుదారీతనాన్ని పునఃప్రతిష్ఠింపజేసిందన్నారు. కుళ్ళిపోయిన దేశ విద్యావ్యవస్థను, కొత్త ప్రభుత్వం చేపట్టిన తిరోగమన విద్యావిధానాన్ని, వివిధ ప్రవేశపరీక్షల కోర్సుల పరీక్షల వ్యవస్థను, ఆ పరీక్షల ద్వారా జరుగుతున్న ఎంపికల వ్యవస్థ, దేశంలో అసాధారణంగా పెరిగిపోయిన నిరుద్యోగం వంటి అనేక అంశాలపై సమూలంగా దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నమైందని అమర్‌జీత్ కౌర్ పిలుపు ఇచ్చారు. అదేవిధంగా భారతదేశ ప్రజాస్వామ్యానికి ఉన్న రాజ్యాంగ మౌలిక హక్కులను కూడా ఈ ఉద్యమం పునఃప్రతిష్ఠింపజేసిందని, విద్యార్థులు ఉద్యమం ద్వారా వాటిని తిరిగి సాధించారని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో ఉన్న భావప్రకటనాస్వేచ్ఛ, అసమ్మతిని తెలియజేసే హక్కు, మాట్లాడే హక్కు, శాంతియుతంగా నిరసన తెలియజేసేహక్కు, న్యాయబద్ధమైన డిమాండ్లకు పాలకులు జవాబుదారీ వహించాల్సిన హక్కు వంటవాటిని జనరేషన్– జెడ్ పునఃప్రతిష్ఠించిందని పేర్కొన్నారు. జనరేషన్–జెడ్ చేసిన ఉద్యమాన్ని జాతివ్యతిరేకమైనదని, అరాచకమైనదని, విదేశీశక్తులు చేసిన కుట్ర అనీ చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ పాలకులకే తిరిగి బెడిసికొట్టాయని విమర్శించారు. ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసు బలాన్ని ఆశ్రయించిందని, లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం, పెల్లెట్స్ బటన్స్, షాక్ బటన్స్ వంటివాటిని ఉపయోగించి క్రూరమైన అణచివేత చర్యలు అమలు చేసిందని, వారిపై క్రిమినల్ కేసులు బనాయించిందని ఇవన్నీ బెడిసికొట్టాయన్నారు. విద్యార్థులు, యువకులపై విచక్షణారహితంగా క్రిమినల్ కేసులు బనాయించారని, ప్రదర్శనలో పాల్గొంటున్న విద్యార్థులకు విశవిద్యాలయ అధికారులతో నోటీసులు జారీ చేయించారని, భయపెట్టే ప్రయత్నాలు చేశారని, ఐనప్పటికీ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు బెదిరిపోకుండా ధైర్యంగా నిలబడ్డారని, ప్రజాస్వామ్యంలో భయానికి తావులేదని రుజువు చేశారని అమర్‌జీత్ కౌర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు,యువకులపై బనాయించిన కేసులన్నింటిని ఉపసంహరించాలని కోరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల డిమాండ్లన్నింటికీ ఎఐటియుసి పూర్తి మద్దతు ఇస్తోందని, అదేవిధంగా నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వమే భారతదేశానికి వెన్నుముక అని ఉద్ఘాటిస్తూ, విద్యార్థులు చేసిన ఈ ఆందోళన దేశంలోని కోట్లాదిమంది ప్రజలకు మరోసారి గొప్ప ఆశలు రేకెత్తించిందని పేర్కొన్నారు.

## అమెరికా ‘సెక్షన్ 301’ చర్యల కింద భారత్‌కు 10శాతం తక్కువ సుంకం

### ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ :** బలవంతపు కార్మిక విధానాల ఆరోపణల నేపథ్యంలో సెక్షన్ 301 చర్యల కింద భారత్‌ను 10శాతం తక్కువ సుంకం వర్గంలోనే ఉంచినట్లు ప్రభుత్వం శనివారం తెలిపింది. అమెరికా వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 301 కింద తీసుకునే తుదిచర్యలను యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) జులై 23న ప్రకటించారు. బలవంతపు కార్మికులతో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతులపై నిషేధాలను విధించడం, అమలుచేయడానికి సంబంధించి, భారతదేశం సహా 60 ఆర్థిక వ్యవస్థల విధానాలు, పద్ధతులపై యుఎస్‌టిఆర్ జరిపిన దర్యాప్తు తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. యుఎస్‌టిఆర్ భారతదేశంపై అదనంగా 10శాతం సుంకాలను విధించింది. అమెరికా తొలుత 12.5 సుంకాలను ప్రతిపాదించింది. విచారణ కాలమంతా సమగ్రమైన, లిఖితపూర్వకమైన సమర్పణలు, ప్రత్యక్ష సంప్రదింపుల (పబ్లిక్ హియరింగ్‌లలో పాల్గొనడం సహా) ద్వారా భారతదేశం యుఎస్‌టిఆర్‌తో సన్నిహితంగా వ్యవహరించింది.‘ఈ నిరంతర ప్రయత్నాల ఫలితంగా, తుది చర్యల కింద భారతదేశంపై అదనపు సుంకాలు తక్కువ శ్రేణిలో విధించబడ్డాయి. ఇది కీలక రంగాలలో భారతీయ ఎగుమతులకు సాపేక్ష ప్రయోజనాన్ని అందిస్తుంది’ అని వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అమెరికాకు భారతదేశం చేసే ఎగుమతులలో గణనీయమైన భాగంపై ఎలాంటి అదనపు సుంకాలు విధించబడవు. ఉదాహరణకు జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, స్మార్ట్‌ఫోన్‌లు, కొన్ని ఇతర నిర్దిష్ట ఉత్పత్తులు అదనపు 10శాతం సుంకం పరిధిలోకి వారు అని ఆ ప్రకటన పేర్కొంది. అంతేకాకుండా, స్టీల్,అల్యూమినియం, ఆటో విడిభాగాలు వంటి సెక్షన్ 232 కింద ఇప్పటికే చేర్చబడిన ఉత్పత్తులకు 10శాతం సుంకం వర్తించదు. సెక్షన్ 232 డ్యూటీలు అన్ని దేశాలకు విస్తృతంగా వర్తిస్తాయి. అయితే కొన్ని పరిమిత మినహాయింపులు ఉంటాయి. ‘ఈ మినహాయింపుల కారణంగా, అమెరికాకు భారతదేశం చేసే ఎగుమతులలో సుమారు 45శాతం అదనపు 10శాతపు సెక్షన్ 301 డ్యూటీ పరిధిలోకి రావు’ అని మంత్రిత్వ శాఖ తెలిపింది. మిగిలిన 55శాతం ఎగుమతులపై అదనంగా 10శాతం సుంకం విధించబడుతుందని తెలియజేసింది.ఈ విషయంలో దర్యాప్తు పరిధిలోకి వచ్చే చాలా ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారతదేశం సుంకం భారం తక్కువగా ఉంది.‘2026 ఫిబ్రవరి 2న ప్రకటించిన భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని 2026 ఫిబ్రవరి 7న జారీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా త్వరగా ముగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది’ అని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఒడిశాలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

**మల్కన్‌గిరి:** ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో భద్రతా బలగాలు పెద్ద ఎత్తున మావోయిస్టు డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం పోలీసులు తెలిపారు. 24న బిఎస్‌ఎఫ్ దళాలు, పోలీసులు జోడంబో పోలీస్ స్టేషన్ పరిధిలో సంయుక్తగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అరపదర్ మరియు ఘుసుంపదర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో మావోయిస్టు ఆయుధ నిల్వలను గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. మొత్తం 32 జిలెటిన్‌స్టిక్స్, 11 డిటోనేటర్లు, 500 గ్రాముల గన్ పౌడర్, మూడు మీటర్ల కొడెక్స్ వైరు, ఒక సోలార్ బ్యాటరీ, రెడియో, ఎలక్ట్రిక్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మల్కన్‌గిరి జిల్లాలో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు భద్రతా బలగాలు నిరంతరం సోదాలు నిర్వహిస్తాయని పోలీస్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఈ ప్రాంతంలో విధ్వంసక చర్యలకు పాల్పడేందుకే ఈ ఆయుధాలు దాచి ఉంచినట్లుగా అనుమానిస్తున్నామన్నారు.

Balaji Institute of Elementary Teacher Education
BIETE NARSAMPET
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Dist: Warangal - 506 331 (TG)
CONTACT:9866078590, 7702076967
D.El.Ed.(E/M)-SPOT ADMISSIONS
PHASE-II NOTIFICATION-2026-27
The Students TG DEECET-2026 qualified and not taken admission anywhere are informed to attend spot admission Phase-II on 30-07-2026 before 2:00pm with all Original Certificates 1 set of Xerox copies, 4 photos and necessary fees. The vacancy Position On https://deecet.cdse.telangana.gov.in/TSDEECET-2026_HomePage.aspx. The vacant Seats will be filled as per guidelines prescribed by Convenor TG DEECET-2026 Eligibility and Qualification 50% in inter/Equivalent Exam & TG DEECET-2026 Qualified Candidates.
CHAIRMAN

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, SANGA REDDY DISTRICT AT SANGA REDDY**
**O.S.No. 448 OF 2026**
BETWEEN:
**Baby Nakka Netra Reddy,**
(Rep. by mother)
**Smt. Vemuri Anuradha,**
**.....Plaintiff**
AND
1. Smt. Nakka Rajitha Reddy,
2. The Tahasildar, Ameenpur mandal,
3. All Concerned.
**...Defendants**
**NOTICE**
To,
1. To whomsoever it may concern.
The plaintiff herein filed above **O.S. No. 448 of 2026** against above **Defendant No.1 to 3** to declare plaintiff and Defendant No.1 as Legal Heir of Deceased Late Nakka Mukesh Reddy. Hence, you are required to appear before Hon'ble Court through Legal counsel on **18.08.2026** at **10:30am.** Failing which the matter will be heard & decided in your absence.
Sd/-
**K. RAM MURTHY & K. UMA**
**Advocates,**
FCI Colony, Miyapur, Hyderabad-49,
**Mobile: 9440412810.**

# యెమెన్ ప్రజలతో జూదమాడుతున్న హౌతీలు

**సనా:**యెమెన్ ప్రజలతో హౌతీ తిరుగుబాటు సైన్యాలు జూదం ఆడుతున్నాయని యెమెన్ లీడర్‌షిప్ కౌన్సిల్ అధ్యక్షుడు రషద్ అల్‌—అలిమి విమర్శించారు. యెమెన్ భూభాగంలో ఉంటూ సౌదీ అరేబియాపై యుద్ధం ప్రకటించిన హౌతీలు ఇరాన్‌కు ప్రయోజనం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇరాన్‌కు మద్ద తుగా హౌతీలు సౌదీ అరేబియాపై గతవారం యుద్ధ ప్రకటన చేశారు. ఆ తర్వాత గడచిన గురువారం ఎర్ర సముద్రంలో రెండు సౌదీ అరేబియా చమురు ట్యాంకర్లను కూడా ధ్వంసం చేశారు. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం మరో కొత్త ప్రాంతానికి విస్తరించింది. ఈ ప్రాంతంలో యుద్ధ ఉద్రిక్తతలు పెంచిన హౌతీలు ఇరాన్‌కు ప్రయోజనం చేస్తున్నారని అలిమి విమర్శించారు. ఎర్ర సము ద్రంలో నౌకలను నిలిపివేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇరాన్ పాలకులు ఆదే శించిన తర్వాత హౌతీలు యుద్ధ ప్రకటన చేశారు. యెమెన్‌లో చట్టబద్ధమైన నౌకా రవాణా వాణిజ్య మార్గాలను పునరుద్ధరించడానికి, జలమార్గాలను రక్షిం చడానికి సౌదీ అరేబియా కూటమితో కలిసి పనిచేస్తామని కూడా రషద్ అల్‌—అ లిమి ప్రకటించారు.

## ఒప్పందం కుదిరింది ట్వీట్లు చెల్లవు

అబ్రహం ఎకార్డ్‌పై సౌదీ వర్గం వెల్లడి

**రియాద్:**ఒప్పందం కుదిరిపోయిన తర్వాత ట్రం ప్ చేసే ట్వీట్లు చెల్లుబాటు కాబోవని సౌదీ అరేబియాకు చెందిన ఒకవర్గం పేర్కొంది. అమెరికా—సౌదీరే బియా మధ్య శాంతియుత అవసరాల ని మిత్తం అణుఒప్పందం గడచిన బుధ—గురువారా ల్లో జరిగింది. మొదటిరోజు ఒప్పందంపై సంతకా లు చేసిన తర్వాత మరునాడు ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, సౌదీ అరేబియా తప్పనిసరిగా అబ్రహాం ఒ ప్పందాలలో చేరితేనే సౌదీ అరేబియాతో చేసుకు న్న ఒప్పందం చెల్లుబాటు అవుతుందని ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో సౌదీ అరేబియా సాధారణ సంబం ధాలను పునరుద్ధరించుకోవాలని, లేకపో తే ఆ దేశంలో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని ని ర్మించబోమని అన్నారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్ మీడియా' ద్వారా ఎన్ని ట్వీట్లు చేసినా వాటికి విలువ ఉండదని పేర్కొంది.

# వైట్‌హౌస్ డిన్నర్‌లో పాత్రికేయులపై విరుచుకుపడిన ట్రంప్

- నిష్పక్షపాతాన్ని కోల్పోయారు
- నేను లేకపోతే వార్తా పరిశ్రమ దివాళా తీస్తుంది
- విమర్శలు చేసినవారికి అవార్డులిచ్చి సత్కారం



**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గడచిన ఏప్రిల్‌లో వైట్‌హౌస్ పాత్రికేయులకు ఏ ర్పాటు చేసిన డిన్నర్ కార్యక్రమం ఆయనపై హ త్యయత్నం ఘటనతో రసాభాసగా మారిన త ర్వాత మరోసారి శుక్రవారం రాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ డిన్నర్ కార్యక్రమం హాస్యోక్తులు,పాత్రికేయు లపై ప్రశంసలతో సాగినప్పటికీ కొంతమంది జ ర్నలిస్టులను ఉద్దేశించి అవమానకరమైన విమర ్శలు చేశారు. చాలా కఠిన పదజాలం ఉపయో గించారు. రెండోసారి కలుసుకోవడం ఉత్తమ ంగా ఉంటుందన్నారు. చాలామంది జర్నలిస్టుల ను తాను గౌరవిస్తానన్నారు. తనకు వ్యతిరేకం గా నకిలీ వార్తలు రాస్తున్నారని విమర్శించారు. మీలో కొందరికి నేను నచ్చనన్నారు. తాను లేక పోతే వార్తలు ఉండవని, వార్తా పరిశ్రమ దివాళా తీస్తుందని చమత్కార బాణాలు విసిరారు. 2028లో రూపం మార్చి టోపీ పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. పాత్రికేయులు నిష్పక్షపా తాన్ని కోల్పోయారని విమర్శించారు. కొందరు పాత్రికేయులను ఉద్దేశించి పరోక్షంగా ఆయన సూటి దూషణలు చేశారు. మనం తూటాలతో కాకుండా చర్చలతో పరిష్కరించుకుందామన్నా రు. కొందరు పాత్రికేయులు తనకు వ్యతిరేకం గా నకిలీ వార్తలు రాస్తున్నారని, చాలామంది జర్నలిస్టులు "ట్రంప్ డీరేంజ్‌మెంట్ సిండ్రోమ్" తో (ట్రంప్ వ్యతిరేక ఉన్మాదం) బాధపడుతున్నా రని విమర్శించారు. అంటే ఎలాంటి మనోవైక ల్యం లేకపోయినా ఒక నాయకుణ్ణి లక్ష్యంగా చే కుని ఉద్దేశపూర్వకంగా విమర్శలు దాడులు చే స్తున్నారని విమర్శించారు. దీంతో అక్కడి వాతా వరణం పూర్తిగా మారిపోయింది.జార్జి డబ్ల్యు. బుష్ అధికారంలో ఉన్నప్పుడు కన్జర్వేటివ్ కాల మిస్టు ఛార్లెస్ క్రౌతామర్ మొదటిసారి ఈ పద బంధాన్ని సృష్టించారు. తనను లక్ష్యంగా చేసు కుని ద్వేషంతో విమర్శల దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా తనకు వ్యతిరేక ంగా వార్తలు రాసిన పాత్రికేయులకు కూడా ఆ యన చిరునవ్వుతో అవార్డులు అందజేశారు. జె ఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వార్తలు రాసిన వాల్‌స్ట్రీట్ జర్నల్ జర్నలి స్టుబృందం కూడా ట్రంప్ నుండి అవార్డు లు తీసుకున్నవారిలో ఉంది. భావప్రకటనా స్వేచ్ఛ ను గౌరవించాలని కూడా ఆయన అమెరికన్లకు పిలుపు ఇచ్చారు.ఈ వేది కపై డబ్ల్యుహెచ్‌సిఎ అధ్యక్షురాలు వీజియా జియాంగ్ పాల్గొన్నారు. గత ఏప్రిల్‌లో వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ (డబ్ల్యుహె చ్‌సిఎ)కు డిన్నర్ ఏర్పాటు చేసినప్పుడు కోల్ టోమస్ అలె న్ (31) ట్రంప్‌పై హత్యాయత్నం చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఆనాడు డిన్న ర్‌కు 2000 మంది జర్నలిస్టులు హాజరుకాగా, ఈసారి బాగా ఆంక్షలు విధించి కేవలం 700 మంది జర్నలిస్టులను మాత్రమే డిన్నర్‌కు ఆహ్వా నించారు. ఈ కార్యక్రమం జరిగిన హోటల్ చుట్టూ భారీబందోబస్తు ఏర్పాట్లు చేశారు. వైట్ హౌస్—మీడియా మధ్య వాతావరణం ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితులమధ్య ఈ డిన్నర్ జరిగింది.

# సరోగసీపై వివాదం జర్మనీ మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ



**బాన్:**జర్మనీ మంత్రివర్గాన్ని ఆ దేశ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ పునర్వ్యవస్థీకరిం చారు. సరోగసీ సమస్యపై దేశంలో తలెత్తిన వివాదం కారణంగా ఒక మంత్రి రాజీనామా చేసిన తర్వాత ఈ పరిస్థితులు తలెత్తాయి.రాబోయేరోజుల్లో మరోవి డత కూడా మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయని అందరూ భావిస్తు న్నారు.మెర్జ్‌కు చెందిన సంప్రదాయవాద క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కార్‌స్టెన్ లిన్నెమన్ ఆరోగ్యశాఖామంత్రి పదవి లోకి వచ్చారు. ఇప్పటివరకూ నీనా వార్కెన్ ఆరోగ్యమంత్రిగా బాధ్యతలు నిర్వ హించారు.ఇప్పుడు వార్కెన్ ఛాన్సలర్ మెర్జ్ మొత్తం సిబ్బందికి ప్రధాన అధిపతి బాధ్యతల్లో నియమితులయ్యారు.జర్మన్ ఛాన్సలర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ బాధ్యతలు తీసుకున్న మహిళానేతగా ఆమె రికార్డుల్లో నమోదయ్యారు.తమ ప్రభుత్వం సంస్కరణల ప్రభుత్వమనీ, ఎంతో ఉత్సాహంగా, వ్యక్తిగత వైవిధ్యంతో తమ ప్రభుత్వం బాధ్యతలు నిర్వహిస్తుందని మెర్జ్ చెప్పారు.జర్మనీలో 16 రాష్ట్రాలతో ఫెడరల్ ప్రభుత్వం సంబంధాలను కొనసాగించేందుకు నియమితులైన ఫిలిప్ ఆమ్థోర్ కూడా ఈ ప్రకటన చేయడానికి మెర్జ్ ఏర్పాటు చేసిన పత్రికాగోష్ఠిలో పాల్గొన్నారు.

## దర్యాప్తు పూర్తి (మొదటి పేజీ తరువాయి)

విధిస్తారు. ఛార్జిషీట్ దాఖలు చేసిన కొన్ని నెలల్లోనే విచారణను వేగంగా నిర్వ హించి, పూర్తి చేసే ఫాస్ట్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపా లిత ప్రాంతాలను ఆదేశించనున్నట్లు ఆ బిల్లులో పేర్కొన్నారు. విద్యారంగంలో జవాబుదారీతనాన్ని కోరుతూ జంతర్ మంతర్ వద్ద, దేశంలోని వివిధ రాష్ట్రా లలో కొనసాగుతోన్న విద్యార్థుల నిరసనల నేపథ్యంలో నీట్—యుజి పేపర్ లీక్ కేసులను పరిష్కరించడానికి ఒక చట్టాన్ని తీసుకువస్తామని ప్రధానమంత్రి నరేం ద్రమోదీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇలాంటి కేసుల్లో నిందితుల కేసు లను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు తరలిస్తామని కూడా ప్రధానమంత్రి చెప్పారు. శుక్ర వారం నాడు, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రివర్గం ఆ బిల్లుకు ఆమోదం తెలిపింది. శుక్రవారం నాడు కేంద్ర మంత్రివర్గం పార్లమెంట్‌లో ప్రవే శపెట్టేందుకు ఆ బిల్లుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పరీక్షలలో అక్రమాలను నివారించడానికి, ఈ బిల్లు సవరించాలని ప్రతిపాదిస్తున్న ప్రభుత్వ పరీక్షల (అ క్రమ పద్ధతుల నివారణ) చట్టం 2024ను అమలుచేశారు.ఇటీవలి సంవత్సరా లలో ప్రభుత్వ పరీక్షా సంస్థలు నిర్వహించే పరీక్షలలో ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు సంబంధించిన అనేక సంఘటనలు జరిగాయని, ప్రభుత్వ పరీ క్షల వ్యవస్థలో పారదర్శకత,నిష్పాక్షికతను ఇవి ప్రభావితం చేస్తాయిన ఈ బిల్లు పేర్కొంది. ప్రతిపాదిత చట్టం కింద నేరాలను విచారించడానికి, ఏదైనా సెషన్స్ కోర్టును ఒక ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుగా నియమించే అధికారాన్ని అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనా యంత్రాంగాలకు కల్పించాలని ఈ సవ రణ బిల్లు కోరుతోంది. అటువంటి కోర్టులలో విచారణలు రోజువారీ ప్రాతిపది కన కొనసాగుతాయని, ఛార్జిషీట్ దాఖలు చేసిన తేదీ నుంచి 3 నెలల్లోపు విచా రణ పూర్తి చేయాలని కూడా ఈ బిల్లు నిర్దేశిస్తుంది.అవసరమైతే, ఏ నేరంపైనైనా దర్యాప్తు చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కూడా ఇది కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తుంది.

# ఫ్రాన్స్—స్పెయిన్‌లో కార్చిచ్చు: 2.80 లక్షలమంది నిరాశ్రయులు

- మాడ్రిడ్‌లో విషమించిన పరిస్థితి
- రంగంలోకి సైన్యాలు,యూరోపియన్ బృందాలు



**మాడ్రిడ్:**ఫ్రాన్స్—స్పెయిన్ దేశాల్లో దావాన ల అగ్నికీలలు అడ్డూఅదుపులేకుండా విస్తరిస్తున్నాయి. మాడ్రిడ్ నగరంలో దావానల జ్వాలలు అదుపుచేయడానికి సాధ్యంకాని విషమస్థితికి చేరకున్నాయి. దీంతో స్పె యిన్ దేశంలో జాతీయ ఎమర్జెన్సీ పరిస్థితి ప్రకటించారు. ఒక్క నైరుతీ ఫ్రాన్స్‌లోనే 2. 80 లక్షలమంది ప్రజలు దావానల భయ ంలో ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. మరి కొ ందరు బోట్లు వేసుకుని సముద్రమార్గంలో వెళ్ళిపో యారు. చివరకు ప్రభుత్వాలు వా రికి సురక్షిత ప్రాంతంలో తలదాచుకునేందుకు అవకాశాలు కల్పిం చింది. దీంతో రెం డు దేశాల్లోనూ సైన్యం రంగంలోకి దిగి ంది. యూరోపియన్ యూనియన్ దేశాల కు చెందిన అగ్నిమాపక సహాయ బృం దాలు కూడా ఈ రెండు దేశాలలో దావాన లం జ్వాలలను అదుపు చేసేం దుక స హాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ స హాయ బృందాలు మంటలు ఆర్పే కంట్రోల్ కేంద్రాన్ని సంద ర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా ఫ్రాన్స్‌లో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వాతావ రణ అధికారులు ఆశతో ఉన్నారు. పిడుగుపాటువల్ల, పారేసిన సిగరెట్ల వల్ల, బార్బె క్యూ నుండి వచ్చే నిప్పుర వ్వలు,తెగిపడిన విద్యుత్ తీగలవల్ల ఆకస్మిక కార్చిచ్చు ప్రా రంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రజ లు చెబుతున్నారు. కానీ ఐరోపాలో ఈసా రి అసాధారణమైన వేడి,వడగాలులవల్ల దావానం ఇంకా తీవ్రగా వ్యాపిస్తోంది. స్పెయిన్‌లో మూడు వారాలుగా దావానల జ్వాలలు అదుపులోకి రావడంలేదు. దీం తో 70,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. కొందరు అ గ్నిమాపకదళ సిబ్బంది తీవ్ర అస్వస్థతకు గురవుతు న్నారు. ఒక్క మాడ్రి డ్ నగరంలోనే పరిస్థితి పరాకాష్ఠకు చేరుకుంది. నగరంలో ప్రజలు పరారయ్యా రు. ఇక్కడ కార్చిచ్చు జ్వాలలు అదుపు చేయడానికి సాధ్యంకాని దశకు చేరుకున్నాయి. కార్చిచ్చును అదుపు చేయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.దిశ మా ర్చుకుని బోర్డోవైపు ప్రయాణిస్తున్న దావానలాన్ని అదుపు చేయడా నికి ఫ్రాన్స్ సైన్యం రంగంలోకి దిగింది. ఒక్క మాడ్రిడ్ లోనే 8000 మందికి పైగా ప్రజలు ఇళ్ళు వదలి సురక్షిత ప్రాంతాలు వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. "తమ ప్రాంత చరిత్రలోనే ఇది అత్యంత ఘోరమైన దావానల దహన జ్వాలలు" అని స్పెయిన్ ప్రాంతీయ అధ్యక్షురాలు ఇసా బెల్ డియాజ్ అయూసో అన్నారు. స్పెయిన్‌లోని అండ లూసియా అల్మెరియా రాష్ట్రంలో జులై 9వ తేదీన దావా నలం రగులుకుని 16 రోజులుగా ఆగకుండా విస్తరి స్తోంది. పచ్చికబయళ్ళు,పొట్టిపొదలు,ఇళ్ళు,వాహనాలు ,అడవులను ఈ దావానలం దహించివేస్తోంది. స్పెయిన్ లో13మంది మరణించగా, 10 మంది గల్లంతయ్యారు.

# కష్టపడే ఉద్యోగికి ఎక్కడైనా గుర్తింపు

స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిబద్ధతతో, కష్టపడి పనిచేసే ఉద్యోగికి ఎక్కడైనా గు ర్తింపు లభిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు.తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో గత ఏడు సంవత్సరాలుగా డిప్యుటేషన్‌పై డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన సుజాత తన మాతృశాఖ అయిన సహకార శాఖకు బదిలీ అయిన సందర్భంగా శనివారం స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన డాక్టర్ సోనీ బా లాదేవి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే ఉద్యోగులు ఎక్కడ పని చేసినా తమ పనితీరుతో అధికారుల, సహోద్యోగుల ప్ర శంసలు అందుకుం టారని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో కోచ్‌లు, అధికా రులు, సిబ్బంది అంద రూ సమష్టిగా కృషి చేయడం వల్లనే అనేక క్రీడా టోర్న మెంట్లు, కార్యక్రమాలను విజయవం తంగా నిర్వహించగలిగామని ఆమె తెలి పారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిత, ఇంజనీర్ శ్రీనివాస్, స్టేట్ డైరెక్టర్లు కె.ఆర్. బట్లర్, శాలిని, అశ్విని దడ్వే, పిఆర్‌ఒ కాలేరు సురేష్‌తో పాటు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఉద్యోగులు, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి రాజీనామాతో సరిపోదు.. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తేవాలి : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ ప్రశ్నా పత్రం లీకేజీ వ్యవహారంలో విద్యార్థుల ఆందోళనల ఫలితంగానే బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేశారని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్య క్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కేవలం రాజీనామాతో సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని అన్నారు. భవి ష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరా వృతం కాకుండా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన కవిత కేంద్ర ప్రభుత్వం రాజకీయ నష్టం నుంచి బయ టపడేందుకే మంత్రి రాజీనామా చేయిం చిందని విమర్శించారు. విద్యార్థులకు నిజమైన న్యాయం జరగాలంటే మొత్తం పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యా ర్థుల కుటుంబాలకు ఒక్కో కుటుంబా నికి రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని కవిత డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 20న విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ, లాఠీచార్జ్కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం మంత్రి రాజీనామాతో కంటితుడుపు చర్యలకు పరిమితమైతే ప్రజలు, విద్యార్థులు అంగీకరించరని కవిత హెచ్చరించారు.

## అహంకారం ఓడింది (మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించింది. ప్రజాస్వామ్యబద్ధమైన విద్యావ్యవస్థ ఇంకా చాలా దూరంలో ఉందని పేర్కొంది. ఈ ఉద్యమాన్ని నిర్వహించిన దేశంలోని విద్యార్థులు,యువ కులను సాహసోపేతమైన పోరాటంకోసం సమీకరించిన నిర్వాహకులకు, వారి ఐక్యతకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. ఈ విజయం విద్యా ర్థులు,యువకులకే దక్కుతుందని, వారిపక్షాన నిలబడి పోరాటానికి సంఘీ భావం ప్రకటించిన అన్ని ప్రజాస్వామ్యశక్తులకు ఈ విజయం దక్కుతుందని పేర్కొంది. "కేంద్ర విద్యాశాఖామంత్రిని ప్రజలకు జవాబుదారీ వహించకుండా దూరంగా కేంద్ర ప్రభుత్వం ఆయనను దాచిపెట్టే ప్రయత్నం చేసింది,శాంతియు తంగా నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రదర్శకుల అణచివేతకు పాల్పడింది, విద్యార్థు లపై తీవ్ర లాఠీఛార్జి జరిగింది, వారిపై బాష్పబాయుగోళాలు ప్రయోగించారు, వీలైనన్ని ఇతర అన్ని అణచివేత చర్యలకు పాల్పడ్డారు.వీటన్నింటినీ ఎంత మాత్రం లక్ష్యపెట్టకుండా విద్యార్థులు,యువకులు అసాధారణమైన ధైర్యసా హాలు ప్రదర్శించారు,పోలీసులు, ప్రభుత్వ బెదిరింపులకు లొంగకుండా దృఢసం కల్పంతో పోరాటం కొనసాగించారు. ఇక ఇప్పుడు విద్యార్థులపై బనాయించిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలి, అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దుచేయాలి, ఇతర కేసులను కూడా తొలగించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రదర్శన చేస్తున్నవా రిపై దారుణ హింసను ఎత్తిపోసిన ప్రభుత్వం ప్రదర్శకులకు బేషరతుగా క్షమాప ణలు తెలియజేయాలి. అనేక సంవత్సరాలుగా ప్రశ్నాపత్రాల లీకేజీలు,నిర్లక్ష్య పూరితమైన ప్రైవేటీకరణ,మితిమీరిన కేంద్రీకరణ,ప్రభుత్వ విద్యావ్యవస్థను ఒక పథకం ప్రకారం బలహీనపరచడం వంటి అనేక చరయల ద్వారా మనదేశ విద్యారంగం చాలా లోతైన అగాథంలో కూరుకుపోయింది.విద్యావ్యవస్థలో పదే పదే ప్రభుత్వ వైఫల్యాల కారణంగా దేశంలోని విద్యార్థులు,వారి కుటుంబాల ఆత్మవిశ్వాసం అడుగంటిపోయింది. వారు వ్యవస్థపై విశ్వాసం కోల్పోయారు. విద్యావ్యస్థలో వైఫల్యాల కారణంగా యువకుల ప్రాణాలు కోల్పోయి సంబం ధిత కుటుంబాలు చాలా విషాదకరమైన పరిస్థితుల్లోకి జారుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి కనీస బాధ్యతాయుతమైన ప్రతిస్పందన రాలేదు. ఈ పరిస్థితు లన్నీ చిట్టచివరకు ఒక జవాబుదారీతనాన్ని సాధించడంకోసం జాతీయస్థాయీ నిరసన ఉద్యమానికి దారితీసింది. అందువల్ల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల,విద్యావ్యవస్థ వైఫల్యాల కారణంగా తమ బిడ్డలను కోల్పోయిన కుటుంబా లకు తగిన నష్టపరిహారం చెల్లించాలని భారత కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేస్తోంది'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## ప్రజాస్వామ్య విజయం (మొదటి పేజీ తరువాయి)

పట్టుదలల విజయం'గా పేర్కొంటూ, నీట్ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళ నలో పాల్గొన్నందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సిజె పి), జెన్ జెడ, దేశవ్యాప్తంగా ఉన్న పౌరులను ఈ పర్యావరణవేత్త అభినందించారు. 'సిజెపికి, దేశం లోని జెన్ జెడ్‌కు అభినందనలు. భయాన్ని, భ యం పట్ల భయాన్ని వీడి, దేశంలోని నలుమూల ల నుండి ముందుకు వచ్చిన పౌరులందరికీ ధన్య వాదాలు' అని ఆయన అన్నారు. ఆసుపత్రిలో చేర డానికి ముందు నిరసనలో పాల్గొని, 26 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్, ఈ ఉద్యమం ఇప్పుడు జవాబుదారీతనం కోరడం వరకే పరిమితం కాకూడదని అన్నారు. ఇప్పుడు సంస్కరణల వైపు అని ఆయన అన్నారు.

## తలవంచాల్సిందే (మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. విద్యా వ్యవస్థను పునర్నిర్మించే దిశగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక పెద్ద అడుగు అని పేర్కొన్నారు. 'అదొక సంకేతాత్మక అడుగు, ఎందుకంటే ఆయన ఒక ప్రతీకగా నిలిచారు, కానీ అది నిజంగానే ఒక పెద్ద అడుగు' అని ఆయన అన్నారు. ప్రజాస్వా మ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ ప రిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి వి ద్యార్థికి, ప్రతి యువకుడికి అభినందనలు తెలియ జేస్తున్నానన్నారు. ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదల వంటి ఇతర వర్గాలకు ప్రధాన్ రాజీనామా ఒక సంకేతం అని కూడా కాంగ్రెస్ నేత అన్నారు. ఎదిరించి నిల బడటంలోనే వివేకం, ధైర్యం ఉన్నాయని రాహుల్ ఉద్ఘాటించారు. విద్యార్థుల పట్ల, భారతదేశ భవి ష్యత్తు పట్ల గౌరవంతో క్రూరమైన దాడులకు గురైన విద్యార్థులకు ప్రధాన మంత్రి క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. కాగా, ప్రభు త్వంపై నిరంతర ఒత్తిడిని కొనసాగించిన విద్యార్థు లకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా ఒక విజయమని అయితే ప్రధాన మంత్రి ఇంకా విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదు కాబట్టి ఇది అంతం కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే అన్నారు. అన్యాయమైన, అవినీతిమయ మైన వ్యవస్థలో పోరాడి విసిగిపోయిన తరానికి, అలాగే విద్యార్థులతో దృఢమైన ఐక్యతను, సంఘీ భావాన్ని ప్రదర్శించిన ప్రతిపక్షానికి ఇది ఒక విజ యమని ఆయన అభివర్ణించారు. ప్రధాన్ రాజీ నామా 'సత్యం యొక్క విజయం', ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అహంకార వైఖరికి ఓటమి అని ఖర్గే అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీలు, కర్రలు, పెల్లెట్ గన్‌లను ప్రయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, క్షమాపణ చెప్పడం ఇప్పుడు మోదీ వంతు అని కూడా ఆయన అన్నారు. 'భారతదేశ విద్యార్థుల గళం ఎట్టకేలకు అహంకారంతో కూడిన అధికార పీఠం వరకు చేరింది. విద్యా వ్యవస్థను సరిదిద్దడానికి దేశవ్యాప్తంగా వీధుల్లో గళమెత్తిన లక్షలాది మంది యువతకు ఇది విజయం... ఇది సత్యం యొక్క విజయం, మోదీ అహంకార వైఖరికి ఓటమి' అని ఆయన అన్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం పార్లమెంటు నుండి వీధుల వరకు గళమెత్తిన ఐక్య ప్రతిపక్షానికి ఇది విజయమన్నారు.

## ఆందోళన విరమిస్తున్నాం (మొదటి పేజీ తరువాయి)

అంగీకరించింది; నిరసన స్థలాల నుండి శాంతియుతం గా వెనుదిరగాలని అందరినీ కోరుతున్నాము' అని రం కా అన్నారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ను ఉపసంహరించుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని కేంద్రమంత్రి నడ్డా చెప్పారు. నీట్ ఆత్మ హత్య బాధితుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఆర్థిక పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు, అ యితే ఎంత మొత్తమనేది నిర్దిష్టంగా చెప్పలేదు. విలేకరు ల సమావేశానికి ముందు, తాను ప్రధాన మంత్రి న రేంద్ర మోదీకి రాజీనామా లేఖను సమర్పించానని, ఇది తనకు 'వ్యక్తిగత ప్రతిష్ట'కు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆ రాజీనా మాను ఆమోదించారో లేదో వెంటనే స్పష్టం కాలేదు.

**జంతర్‌మంతర్ వద్ద మిన్నంటిన హర్షధ్వానాలు**

ప్రభుత్వం దిగిరావడం, మంత్రి తప్పుకోవడం అనే వార్త లతో, స్వచ్ఛందంగా మొదలైన ఈ నిరసనలకు కేంద్ర బిందువైన జంతర్ మంతర్ వద్ద హర్షధ్వానాలు మిన్నంటాయి. జంతర్ మంతర్ వద్ద తమ విజయాన్ని పురస్కరించుకుని, నిరసనకారులు ఉత్సాహంతో నృత్యం చేస్తూ, జాతీయ జెండాను ఊపుతూ సంబరాలు చేసుకున్నారు. 'చక్ దే ఇండియా' వంటి పాటలు మారుమోగుతుండగా వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ కనిపించారు. మంత్రి రాజీనామాను తమ పోరాట విజయంగా భావించి సంబరాలు చేసుకుం టున్న ఆ సమూహంలో చాలా మంది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలు, పోస్టర్లను ప్రదర్శించారు. అదే సమయంలో, మిగిలిన రెండు డిమాండ్లకు కూడా అంగీ కారం లభించాల్సి ఉందని సిజెపి అక్కడ గుమిగూడిన వారికి స్పష్టం చేసింది. అయితే, ఇది ముగింపు కాదని, దేశవ్యాప్తంగా విస్తరిం చిన ఈ ఉద్యమం కొనసాగవ చ్చని సిజెపి స్పష్టం చేసిం ది. ప్రభుత్వం దిగివచ్చి మంత్రి రాజీనామా చేశారన్న వార్త వచ్చిన తర్వాత సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మాట్లాడుతూ 'మాకు ఇంకా రెండు డిమాండ్లు ఉన్నాయి. మేము ఊరికే వెళ్ళిపోము. మేము కాక్రోచ్‌ల (బొద్దింకల) లాంటివాళ్ళం, ఒకసారి లోపలికి ప్రవేశించాక బయ టకు వెళ్ళము' అని అన్నారు.

**సిజెఐకి కృతజ్ఞతలు:**

నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ ఈ సహజ ఉద్యమానికి బీజం వేసిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌కు కూడా ఆయన కృతజ్ఞ తలు తెలిపారు. 'మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిల వకపోయి ఉంటే, నేను భారతదేశానికి తిరిగి వచ్చేవా డిని కాదు. మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిలవక పోయి ఉంటే, దేశ యువత వీధుల్లోకి వచ్చేది కాదు. మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిలవకపోయి ఉంటే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా జరిగి ఉండేది కాదు' అని అన్నారు. సిజెపికు చెందిన 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' ఎక్స్ ఖాతాలో 'డిమాండ్ల తాజా స్థితి' పోస్ట్ చేశారు. ఇందులో జాబితాలోని మొదటి అంశం— ప్రధాన్ రాజీనామా— పక్కన 'టిక్' గుర్తు పెట్టారు. మిగిలిన రెండు డిమాండ్లైన— ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోకపో వడం— అనే వాటిని 'పెండింగ్' (పరిశీలనలో ఉన్న వి)గా గుర్తించారు. నెలకొన్న ప్రతిష్టంభనకు సామరస్య పూర్వక పరిష్కారం కనుగొనేందుకు సిజెపి ప్రతినిధులు కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, జె.పి. నడ్డాలతో మరో విడత చర్చలు జరపడానికి కొద్దిసేపటి ముందే ప్రధాన్ రాజీనామా చేశారు. తటస్థ వేదిక ఉండాలన్న సిజెపి డిమాండ్ మేరకు, జంతర్ మంతర్ సమీపంలోని విఠల్ భాయ్ పటేల్ హౌస్‌లో ఈ చర్చలు జరిగాయి. నీట్ యుజి 2026 పరీక్షా పత్రం లీకేజీ, సిబిఎస్ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియలో అక్రమాలు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణల డిమాండ్‌తో ప్రధాన్ బాధ్యత వహించాలని కోరుతూ సిజెపి ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జూన్ 20న ప్రారంభ మయ్యాయి. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, పలువురు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్ష చేప ట్టడం, వేలాది మంది ప్రజలు అక్కడ గుమిగూడటంతో జంతర్ మంతర్ వైపే అందరి దృష్టి మళ్లింది. ఒక నెల తర్వాత, 'సంసద్ చలో' పిలుపు మేరకు వారు వీధుల్లోకి రాగా, పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయో గంతో వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పలువురు పోలీసులు కూడా గాయపడ్డారు. ఆ హింసాత్మక ఘట నకు సంబంధించిన వీడియోలు విస్తృతంగా ప్రచారం కావడం నిరసనలకు కొత్త ఊపిరి పోసి, దేశవ్యాప్తంగా ఇలాంటి నిరసనలే తలెత్తడానికి ఒక కీలక మలుపుగా నిలిచింది.

## ధర్మేంద్ర రాజీనామా (మొదటి పేజీ తరువాయి)

బాధ్యత వహించినప్పటికీ, బాధ్యతాయుత మైన పదవుల్లో ఉన్న వ్యక్తులు అడ్డంకులు సృ ష్టించడానికి, విద్యార్థులను తప్పుదోవ పట్టిం చడానికి ప్రయత్నించారని ప్రధాన్ వ్యాఖ్యా నించారు. 'గత పది రోజులుగా జరిగిన పరి ణామాలు నన్ను బాధించాయి. ఇది నాకు వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదు. దేశ యువత గందరగోళ వలయంలో చిక్కుకోకుండా చూడటమే నా సంకల్పం. జ ంతర్ మంతర్ వద్ద, దేశవ్యాప్తంగా ఉన్న పరి స్థితులను పరిగణనలోకి తీసుకుని దేశ వ్యతి రేక శక్తులు దీనిని తమకు అనుకూలంగా మ లుచుకోకుండా అడ్డుకోవడం, జాతీయ సమై క్యతను కాపాడటం, ఒక్క భారతీయ విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడ కుండా చూడటం, మన పిల్లలు తమ సమ యాన్ని చదువులకు, కెరీర్ నిర్మాణానికి కేటా యించేలా చేయడం వంటి లక్ష్యాలతో నేను ప్రధానమంత్రికి నా రాజీనామాను సమర్పిం చాను' అని ఆయన అన్నారు. దేశ యువత ఆశయాలు, భావోద్వేగాలు, న్యాయమైన ఆ కాంక్షలను గౌరవిస్తానని ప్రధాన్ పేర్కొన్నా రు. 'భారత యువతరం కలలను సాకారం చేయడం మా రాజకీయ, సామాజిక జీవితా ల్లో ఒక నైతిక బాధ్యతగా ఉంది. మే 3న జరి గిన నీట్‌యుజి పరీక్షకు సంబంధించి అక్ర మాలు వెలుగులోకి వచ్చాయి. దీనిని వెంటనే గుర్తించిన భారత ప్రభుత్వం, దర్యాప్తును సి బిఐకి అప్పగించి, పరీక్షను రద్దు చేసి, తిరిగి ప రీక్ష నిర్వహించే తేదీని ప్రకటించింది. 'అంతే కాకుండా, వచ్చే ఏడాది నుండి ఈ పరీక్షను సిబిటి (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) విధా నంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకు న్నారు. ఈ కాలమంతా, 20 లక్షల మందికి పైగా విద్యార్థులకు పరీక్ష సజావుగా జరి గేలా చూడటమే మా ప్రధాన ప్రాధాన్యతగా ఉంది. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా జిల్లా యంత్రాంగాలను కలుపు కుని 'సమగ్ర ప్రభుత్వ' విధానం ద్వారా ఇది సాధ్యమైంది. విద్యార్థులు, తల్లిదండ్రుల సహ కారంతో, జూన్ 21న పరీక్ష విజయవం తంగా ముగిసింది' అని ఆయన చెప్పారు. జులై 16న ప్రకటించిన నీట్‌యుజి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, వెనుకబడిన వర్గాలకు చెందిన అనేకమంది ప్రతిభావంతు లైన విద్యార్థులు విజయం సాధించారని ప్రధాన్ పేర్కొన్నారు. అయితే, ఆ సమ యంలో కూడా బాధ్యతాయుతమైన పద వుల్లో ఉన్న వ్యక్తులు అడ్డంకులు సృష్టించడా నికి, విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించడం నన్ను తీవ్రంగా బాధించింద న్నారు. 'మన ప్రజాస్వామ్య శక్తిపై నాకు ఎప్పుడూ అచంచలమైన విశ్వాసం ఉంది. యువత ఆశయాలు, కలలు, ఆకాంక్షలను నేను ఎంతో గౌరవిస్తాను. వారు కేవలం భార తదేశ భవిష్యత్తు మాత్రమే కాదు; వారు నవ, అభివృద్ధి చెందిన భారతదేశానికి దిక్సూ చులు, సృష్టికర్తలు, రూపకర్తలు' అని ప్రధాన్ చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) దీనిని తమ 36 రోజుల పోరాటంలో మొదటి విజయంగా అభివర్ణిం చింది. ఈ ఆందోళనకు మద్దతునిస్తూ ప్రధాన్ రాజీనామా కోసం గళం కలిపిన ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థులు, యువత ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా పేర్కొ న్నాయి. ఈనెల 20న సిజెపి ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు జరిగిన ర్యాలీలో హింస చెలరేగడంతో నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ హింసకు సంబంధించి పోలీ సులు, నిరసనకారులు ఒకరిపై ఒకరు ఆరో పణలు చేసుకున్నారు. శనివారం ప్రధాన్ రాజీనామా చేయడంతో జంతర్ మంతర్ వద్ద సంబరాలు మిన్నంటాయి. అక్కడ విద్యార్థులు, సిజెపి సభ్యులు జూన్ 20 నుండి నిరసన దీక్ష చేస్తున్నారు. నీట్ యుజి 2026 పేపర్ లీక్, సిబిఎస్ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియలో అక్రమాలపై ఆయన బాధ్యత వహించాలని, అలాగే ప్రభుత్వ పరీ క్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేప ట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# జింబాబ్వే చిత్తు... సిరీస్ భారత్ కైవసం

## మెరిసిన ఇషాన్, అభిషేక్..



వరసగా రెండు వైట్‌వాష్‌లను నుంచి తేరుకున్న భారత జట్టు అదిరే ఆటతో టీ20 సిరీస్ పట్టేసింది. జింబాబ్వేను చిత్తుగా ఓడించి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన అయ్యర్ సేన 90 పరుగుల తేడాతో గెలిచింది. 220 పరుగుల ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లను ప్రిన్స్ యాదవ్(2–10), అభిషేక్ శర్మ(3–17)లు బెంబేలెత్తించారు. సమిష్టి వైఫల్యంతో ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన ఆఫ్రికా జట్టు మరో ఓటమి చవిచూసింది. పొట్టి క్రికెట్‌లో మళ్లీ ఫామ్ అందుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌ను కొల్లగొట్టింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలిచిన టీమిండియా రెండో టీ20లోనూ జింబాబ్వేను వణికించింది. రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందలకు పైగా కొట్టిన భారత్.. ప్రత్యర్థిని పరిమితం చేసింది. టాపార్డర్ విఫలమైనా బ్యాటుతో రెచ్చిపోయిన ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్)లు భారీ స్కోరొందించగా.. అనంతరం ప్రిన్స్ యాదవ్(2–10), అభిషేక్ శర్మ(3–17)లు వికెట్ల వేటతో చెలరేగారు. బ్యాటుతో విఫలమైన అభిషేక్.. మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 129కే ఆలౌటైంది. 90 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఒడిసిపట్టింది. టీమిండియా నిర్దేశించిన 220 పరుగుల భారీ ఛేదనను జింబాబ్వే దూకుడుగా మొదలెట్టింది. ఓపెనర్లు బెన్నెట్(32), బెన్ కరన్(1)లు దూకుడుగా ఆడినా.. అరంగేట్ర పేసర్ యశ్ ఠాకూర్ తొలి దెబ్బ కొట్టాడు. దంచేస్తున్న బెన్నెట్‌ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కరన్‌ను ప్రిన్స్ యాదవ్(2–10) పెవిలియన్ పంపాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో డియాన్ మైర్స్(12) బౌల్డవ్వగా 58 వద్ద ఆతిథ్య జట్టు మూడో వికెట్ పడింది. కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవాలనుకున్న కెప్టెన్ సికిందర్ రజా(0)ను ప్రిన్స్ డకౌట్‌గా వెనక్కి పంపి జింబాబ్వేను మరింత కష్టాల్లోకి నెట్టాడు. దూబే ఓవర్లో మద్వేరా(2) అయ్యర్ చేతికి చిక్కడంతో ప్రత్యర్థి ఓటమిని ఖాయమైంది. రియాన్ బర్ల్(20)ను తిలక్ ఔట్ చేయడంతో టీమిండియా విజయం మరింత తేలికైంది. బ్యాటుతో తేలిపోయిన అభిషేక్(3–17) బంతితో రాణించగా జింబాబ్వే 129 పరుగులకే కుప్పకూలింది.

### ఇషాన్, తిలక్ విధ్వంసం

హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో టాస్ ఓడిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ(8) ఈసారి కూడా నిరాశపరిచాడు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన అతడిని ముజరబని పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ(20) జింబాబ్వే బౌలర్లను భయపెట్టాడు. కానీ, అదే ఊపులో ఆడబోయి అతడు వికెట్ సమర్పించుకున్నాడు. 29కే రెండు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25), ఇషాన్ కిషన్(81)లు దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డును ఉరికించారు. తిలక్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకోగా రింకూ సింగ్(12) విఫలమయ్యాడు. ఇషాన్, తిలక్ విధ్వంసంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబని, నగవరా, ఎవాన్స్, న్యూమన్, బెన్నెట్‌లు తలా ఒక వికెట్ తీశారు.

# కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ బోణీ..

కామన్వెల్త్ గేమ్స్2026లో భారత్ బోణీ కొట్టింది. పారా పవర్‌లిఫ్టర్ జందు కుమార్ దేశానికి తొలి పతకాన్ని అందించాడు. శనివారం జరిగిన పురుషుల హెవీవెయిట్ కేటగిరీ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 72.4 కిలోల బరువున్న జందు కుమార్ తన రెండో ప్రయత్నంలో 190 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. మూడో ప్రయత్నంలో 196 కిలోలు ఎత్తడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. పోటీల్లో చాలాసేపు ఆధిక్యంలో ఉన్నప్పటికీ చివరికి మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. బీహార్‌లోని నలందా జిల్లా హర్నాత్ గ్రామానికి చెందిన జందు కుమార్ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. ఓ సాధారణ కూరగాయల వ్యాపారి కుమారుడైన జందు.. పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు.



అయినప్పటికీ ఎన్నో శారీరక, ఆర్థిక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ క్రీడా వేదికపై నిలిచాడు. ఆసక్తికరంగా జందు క్రీడా జీవితం పవర్‌లిఫ్టింగ్‌తో మొదలుకాలేదు. 2017లో షాట్‌పుట్, డిస్కస్ త్రో అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించి జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు కూడా సాధించాడు. జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్నప్పుడు పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకుని ఆ తర్వాత ఈ క్రీడలోకి మారాడు. అయితే అతని ప్రయాణం అంత సులువుగా సాగలేదు. ఉన్నతస్థాయి పోటీలకు అవసరమైన పోషకాహారం కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో జీవనోపాధి కోసం కూరగాయల వ్యాపారం నడిపారు. కనీసం వీల్‌చైర్ కూడా లేని స్థితిలో రోజూ 20 కిలోమీటర్లు ప్రయాణించి స్థానిక మార్కెట్లకు వెళ్లేవాడు. స్నేహితుల వద్ద అప్పు చేసి కొన్న ఈ రిక్షాతో చేసిన కూరగాయల వ్యాపారం కూడా అప్పట్లో కరోనా మహమ్మారి కారణంగా దెబ్బతిన్నది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ రహేలు.. జందులోని ప్రతిభను గుర్తించాడు. గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) సెంటర్‌లో శిక్షణకు ఆహ్వానించాడు. రాజిందర్ మార్గదర్శకత్వంలో జందు కుమార్ అద్భుతంగా రాటుదేలాడు. 2025 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 205 కిలోలు ఎత్తి జాతీయ రికార్డు సృష్టించాడు. కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి తన రికార్డును తానే బద్దలుకొట్టాడు. ఈ కామన్వెల్త్ పతకానికి ముందు బీజింగ్ ప్రపంచకప్ (2025), ఆసియా ఛాంపియన్‌షిప్ (2026) లలోనూ కాంస్య పతకాలు గెలుచుకుని తన సత్తా చాటుకున్నాడు

# బిజినెస్

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 78,151.54 పాయింట్లు. ముగింపు పాయింట్లు. నష్టం 2091.77 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,334.30 పాయింట్లు. ముగింపు పాయింట్లు. నష్టం 566.85 పాయింట్లు.

## ప్రపంచ స్టాక్ మార్కెట్లపై యుద్ధ భయం



ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఈవారం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం, ఎర్ర సముద్రం (రెడ్ సీ) ప్రాంతంలో నౌకాయాన భద్రతపై ఆందోళనలు తలెత్తడం, అంతర్జాతీయ ముడి చమురు (బ్రెంట్ క్రూడ్ ఆయిల్) ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటడం పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచాయి. ఈ పరిణామాల ప్రభావంతో ప్రభుత్వ బాండ్లపై దిగుబడులు పెరిగాయి. సురక్షిత పెట్టుబడుల వైపు నిధులు మళ్లడంతో అమెరికా డాలర్ బలపడింది. మరోవైపు, ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్లకు ఆశించినంత ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయాయి. ఆదాయంలో వృద్ధి నమోదైనప్పటికీ, కృత్రిమ మేధ (ఎఐ) అభివృద్ధి కోసం భారీ మూలధన వ్యయం ప్రకటించిన ఆల్ఫాబెట్ షేరు ఒత్తిడికి గురైంది. టెస్లా స్వేచ్ఛా నగదు ప్రవాహం (ఫ్రీ క్యాష్ ఫ్లో) నిరాశపరిచిన నేపథ్యంలో దాని షేరు కూడా గణనీయంగా పడిపోయింది. దీనివల్ల టెక్నాలజీ రంగంలో అధిక విలువలపై పెట్టుబడిదారులు మళ్లీ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ పరిణామాలన్నింటి ప్రభావంతో అమెరికా, యూరప్ ప్రధాన స్టాక్ సూచీలు వారాంతానికి నష్టాలతో ముగిశాయి. భారత మార్కెట్ కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వం 60కిపైగా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త దిగుమతి సుంకాలు అమలు చేయడం ప్రపంచ వాణిజ్యంపై కొత్త అనిశ్చితికి దారితీసింది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,44,930
22 క్యారెట్లు: రూ. 1,32,850
18 క్యారెట్లు: రూ. 1,08,700.
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).



## లేఆఫ్స్‌కు సిద్ధమైన 'ఇంటెల్'

ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు ఉద్యోగాల తొలగింపులను కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ మరోసారి లే ఆఫ్స్‌కు సిద్ధమైంది. డేటా సెంటర్ గ్రూప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు తొలగింపు విషయాన్ని ఇప్పటికే తెలియజేసినట్లు సమాచారం. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటెల్ వెల్లడించింది. అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నదీ కంపెనీ వెల్లడించలేదు. ఇటీవల సంవత్సరాల్లో ఖర్చుల తగ్గింపు, సంస్థాగత మార్పులపై దృష్టి పెట్టిన ఇంటెల్, భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గిస్తోంది. 2023 నాటికి కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.25 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 2025 నాటికి ఆ సంఖ్య 85 వేలకు తగ్గింది. డేటా సెంటర్ గ్రూప్ సర్వర్ ప్రాసెసర్లు, కొడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీలను అభివృద్ధి చేస్తోంది. ఈ విభాగాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నట్లు కంపెనీ తెలిపింది. కొత్త లే ఆఫ్స్ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో ఇంకా స్పష్టం చేయలేదు.

## ఒడిదుడుకులు

వచ్చే వారం కూడా మార్కెట్లు ఒడిదుడుకులతో కొనసాగే అవకాశం కనిపిస్తోంది. మరిన్ని టెక్నాలజీ దిగ్గజాల ఆర్థిక ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎఐపై భారీ పెట్టుబడులు నిజంగా లాభదాయకమా అనే ప్రశ్నకు సమాధానం దొరికే అవకాశం ఉంది. మరోవైపు చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగితే ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయాలు స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాలపై కూడా పెట్టుబడిదారుల దృష్టి నిలుస్తుంది. ముఖ్యమైన దౌత్యపరమైన పరిణామాలు లేదా కంపెనీల నుంచి ఊరటనిచ్చే ఫలితాలు రాకపోతే, ప్రపంచ స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో అప్రమత్త ధోరణితోనే పరిమిత పరిధిలో కదిలే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తం మీద రాబోయే వారంలో చమురు ధరలే కీలకంగా మారనున్నాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం సాధారణంగా పెరుగుతుంది. ఇంధనం ఖరీదవడం వల్ల రవాణా, విద్యుత్, తయారీ, వ్యవసాయం వంటి రంగాల ఖర్చులు పెరిగి, ఆ ఖర్చులు చివరకు వినియోగదారులపై పడతాయి. అందుకే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ఆహారం, నిత్యావసరాలు, సేవల ధరలను కూడా పైకి తోస్తుంది. ఇది ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించి, కేంద్ర బ్యాంకును వడ్డీ రేట్లు పెంచే లేదా కట్టుదిట్టమైన విధానం తీసుకునేలా చేయవచ్చు. భారత్‌లో కూడా చమురు ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనం, కరెంట్ అకౌంట్ లోటు వంటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ

### అధ్యక్షుడిగా బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి ఎన్నిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఎఐటియుసి నూతన అధ్యక్షుడు బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించడంతో పాటు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి ఎన్నికైనట్లు ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి. వెంకటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా హసీనా బేగం, ఉపాధ్యక్షులుగా కె. రమేష్, ఎం.లక్ష్మీ బాయి, రాజమౌళి, ఎం.ఎస్.మూర్తి, కొమరెల్లి బాబు, ఉప ప్రధాన కార్యదర్శిగా చెట్టుకింది శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా జి.నరసయ్య, ఉమర్ ఖాన్, మల్లేష్ రావు, రవి కిషోర్, ఎన్.శ్రీకాంత్, ఎ.పార్వతి, కోశాధికారిగా పి.రేణుకతో పాటు 44 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాలకు హెల్ప్‌లైన్

### 040-24603572 ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను మంత్రి శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించారు. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 04024603572 నెంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని మంత్రి సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నందున ఆయా నియోజకవర్గాల ప్రజలు తమ ప్రాంతంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పథకానికి హైదరాబాద్ క్యూర్ పరిధిలో కనీసం ప దేళ్లుగా నివసిస్తున్న కుటుంబాలు అర్హులని, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారు లేదా కుటుంబ సభ్యుల పేరుపై క్యూర్ పరిధిలో ఇల్లు, ఫ్లాట్ లేదా ప్లాట్ ఉండరాదని, ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తామని చెప్పారు. నిర్మించే ఫ్లాట్ల కంటే అర్హుల సంఖ్య ఎక్కువైతే పారదర్శకంగా లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతామన్నారు. రూ.10 వేల ఈఎండిని యుపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని, ఇల్లు కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు మొత్తం తిరిగి జమ అవుతుందన్నారు. దరఖాస్తు సంఖ్య, మీ సేవ రసీదు, చెల్లింపు రసీదు, మొబైల్ నెంబర్‌ను ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాల ని సూచించారు. లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉం టుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.పి. గౌతమ్, హౌసింగ్ బోర్డు సి.ఈ. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసించండి

☞ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ జనగామ / రఘునాథపల్లి :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా పూర్తిగా మొండి వైఖరి ప్రదర్శిస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమై కేంద్ర ప్రభుత్వం తన అహంకారపూరిత నిర్ణయాలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తోందని, ప్రజల గొంతును అణచివేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జనగామ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షత జరుగుతన్నాయి. శనివారం తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ రాజకీయ పరిస్థితులు వివరించారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టిలేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల వలనే నిరుద్యోగం, ధరల విపరీతంగా పెరిగాయని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా, శాంతియుత విద్యార్థి ఆందోళనపై క్రూరమైన అణచివేతకు నిరసనగా సిపిఐ దేశ వ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా పత్రాల లీకేజీలతో యువ అభ్యర్థులు నిరాశలో కూరుకుపోయి ఆత్మహత్యలు పాల్పడడం, ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకమని, దీనికి బిజెపి నైతిక బాధ్యత వహించాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని, ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని, పోలీసులు భేషరుతుగా క్షమాపన చెప్పాలని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. కేంద్రం తీరును ఎండగడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు చేస్తామని, ఈ పాదయాత్రల సందర్భంగా బిజెపి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 1న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఛలో డిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

### అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం : సిహెచ్ రాజారెడ్డి

అంతరాలు లేని సమసమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయమని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. ప్రస్తుత పెట్టుబడిదారి దోపిడి వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం విపరీతంగా పెరిగిపోతుందని, అయినప్పటికీ పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజువారి ఆదాయ వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు వేల రెట్లు ఎక్కువగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ఈ క్రమంలో దేశంలోని భూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడిపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, నాయకులు రావుల సాదనందం, చొప్పరి సోమయ్య, సిహెచ్ మల్లేశం, తోట రమేష్, ఎండి నూర్‌మిష, వడ్లకొండ సుధాకర్, కందుకూరి పాల్గొన్నారు.

## పాదయాత్రల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, పంటలకు గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఆగస్టు ఆరు నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం పాదయాత్రల పోస్టర్లను సిపిఐ నాయకులతో కలిసి స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ధరల పెరుగుదలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ధరల పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. దేశంలో మునుపెన్నడులేని రీతిలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు వట్టిపోతున్నాయని వాటిని పునరుద్ధరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి దొరికేవిధంగా చర్యలు చేపట్టాలని విద్య, వైద్యం వ్యాపారంగా మారిన తరుణంలో ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరుతుందని సురేష్ తెలిపారు. డిలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించాలని ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సురేష్ తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్ కెజానిమియా, ఏపూరి లతాదేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెం ట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## రాజ్యాధికారంలో మహిళలదే పైచేయి కావాలి

### తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/కోదాడ:** మహిళలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల్లో మహిళ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. శనివారం చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన మహిళ సమాఖ్య మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు, రాజ్యాధికారంలో వెనుకబడి ఉన్నారని అన్నారు. మహిళ రిజర్వేషన్ల కోసం జాతీయ మహిళ సమాఖ్య అనేక సంవత్సరాల నుండి కృషి చేస్తుందన్నారు. ఈనెల 27న హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించే మహిళ సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల అనంతరం సూర్యాపేటలో జరిగే రాష్ట్ర మహిళ సమాఖ్య మహాసభలకు తరలిరావాలన్నారు. రెమిడాల జయసుధ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, మండవ జయమ్మ, వెంకటేశ్వర్లు, లలిత, రమేష్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటిని ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు.





## బిసిల పట్ల బిజెపిది నిర్లక్ష్య వైఖరి

ధనుంజయనాయుడు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుక బాటు తరగతులైన బిసిల పట్ల బిజేపికి ఎందుకు అంత కక్షసాధింపు దోరణి అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళి పాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో బిసి హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడిడి సమానత్వం సామాజిక న్యాయం సమాన అవకాశాలు కల్పించారని ఉన్నత ఆశలతో రూపొందించ బడిందని కాని వాస్తవానికి జరుగుతున్నది వేరుగా ఉన్నదని, 56శాతం ఉన్న బిసిలకు కేవలం 17శాతం మాత్రమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించారని ఎన్నికల సందర్భంలో అటు జాతీయ స్థాయిలో ఇటు రాష్ట్ర స్థాయిలో బిసిలకు కొన్ని తాయిలాలు ప్రకటిస్తారని తీరా ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టాక వారు, వీరు కూడా బిసిలను గత 79 సంవత్సరాలుగా మోసం చేస్తూనే వస్తున్నారని, కాని ఇటీవల కాలంలో బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోందని బిసి కులాల వారు ఉత్పత్తుల కులాల వారిగా దేశ వ్యాప్తంగా విస్తరించి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అద్యక్షులు జడ శ్రీనివాస్ యాదవ్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, రైతు సంఘం నాయకులు జక్కుల రమేష్, జక్కుల రమణ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు




ప్రజాపక్షం/తుంగతుర్తి : ఎఐటియుసి జిల్లా మూడో మహాసభలు ఆగష్టు 1వ తేదిన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం తుంగ తుర్తి మండల కేంద్రంలో ఏఐటియుసి నియోజక వర్గ మూడవ మహాసభ పద్మశాలి భవనంలో బొంకూరు శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 106 సంవత్స రాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘంగా అవతరిం చిన ఏఐటియుసి జిల్లా మూడో మహాసభలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందిం చుకోవడం కోసం దోహదపడతాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల అవ లంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయడం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారాం, గౌరవ అధ్యక్షులు కోట రామస్వామి, సిపిఐ మండల కార్యదర్శి పాల్వాయి పున్నయ్య, ఏఐటియుసి నాయకులు గూడా నర్సయ్య, బొంకూరి ఆవులయ్య, మల్లెపాక లక్ష్మ య్య, నజీర్ పాల్గొన్నారు.

## న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు



ప్రజాపక్షం/రామన్నపేట : మండల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు.విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటుంది. విద్యార్థులకి ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అందరికీ పలు రకాల చట్టాలపై అవగాహన పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు,ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు,మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టా లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎంఏ మజీద్,యాదాస్ యాదయ్య, కునూరు శ్రీనివాస్, పాల్వంచ జగతయ్య ఏ జిపి సుక్క శ్రవణ్ నూతి రమేష్,లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ,పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలె క్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచే యాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, 100 శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం ఇన్‌టైంలో పంచ్ చేయకపోయినా, సాయంత్రం ముందే వెళ్లిపోయినా అడ్మినిస్ట్రేటివ్ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఓపి విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసి స్టెంట్ ప్రొఫెసర్లు క్లినికల్ అవర్స్‌లో విధిగా ఉండాలని సూచించారు. జూని యర్ డాక్టర్లపైనే భారం వేయకుండా సీనియర్లు నేరుగా రోగులను పరీక్షిం చాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసు పత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్ర చికిత్సల కోసం లాపరో స్కోపిక్ సెట్స్, అడ్వాన్స్డ్ లాపరోస్కోపీ టవర్స్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్లు జనార్ధన్, అనిత, ఉపేందర్, యశ్వంత్, గీత, సంధ్య, వినయ్ పాల్గొన్నారు.

### విద్యార్థుల పక్షాన నిలిచిన రాహుల్‌గాంధీపై దాడి

# అప్రజాస్వామిక చర్య

పేపర్ లీకేజీలపై కేంద్రం నైతిక బాధ్యత వహించాలి

నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రూ.65 కోట్లతో మర్రిగూడ మోడల్ ఫ్లైఓవర్ ప్రారంభం



ప్రజాపక్షం/నల్లగొండ: పేపర్ లీకేజీలకు వ్యతి రేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం అమానుషమని రాష్ట్ర రోడ్లుభవ నాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.విద్యార్థులకు అండగా నిలి చిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపై దాడికి పాల్పడటం, వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ యువతనే తన కుటుంబంగా భావించి విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్‌గాంధీని గాయప రచడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొ న్నారు.నల్లగొండ పట్టణాన్ని తెలంగాణలోనే ఆదర్శవంతమైన మోడల్ కార్పొరేష న్‌గా,సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో నల్లగొండ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్ప నకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.నల్లగొండ పట్టణంలోని మర్రి గూడ చౌరస్తా వద్ద రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ ఫ్లైఓవర్‌ను శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి నార్కట్‌పల్లిఅద్దంకి రహదారికి వాహనాలు నేరుగా ప్రయాణించేలా ఫ్లైఓవర్‌ను నిర్మించినట్లు తెలిపారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ఫ్లైఓవర్ ఎంతో దోహదపడుతుం దని అన్నారు.రూ.750 కోట్లతో చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులు ఇప్పటికే 50 శాతం పూర్త య్యాయని మంత్రి వెల్లడించారు.రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిన వెంటనే మిగిలిన పనులను వేగవంతం చేసి వచ్చే మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.అమృత్ పథకం కింద రూ.300 కోట్లతో వాటర్ ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయని మంత్రి తెలిపారు.అదనంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మరో రూ.300 కోట్ల నిధు లను మంజూరు చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్ర మంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివా స్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమెర్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి,వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,కార్పొరేటర్లు గుమ్మల జానకి మోహన్ రెడ్డి,పెరిక స్వాతి వినాయక్‌రాజ్,బొజ్జ శంకర్, ఆలకుంట్ల నాగరాజు పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు

8 మంది అరెస్ట్ 10 లక్షల విలువగల మత్తు పదార్ధాలు స్వాధీనం..



ప్రజాపక్షం/నల్లగొండ : ఒడిశా నుంచి గంజాయి, హాష్ ఆయిల్ స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను వన్ టౌన్ పోలీ సులు అరెస్టు చేసి రూ.10 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని నల్లగొండ డిఎస్పి కె శివరాం రెడ్డి వెల్లడించారు. శనివారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రత్యేక బృందాలు చేపట్టిన దాడుల్లో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారని మరో నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. ఇందులో ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకుని జువెనైల్ న్యాయ ప్రక్రియ ప్రకారం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.10 లక్షల విలు వైన 5.6 కిలోల గంజాయి, 100 ఎంఎల్ వీడ్ (హాష్) ఆయిల్,5 బైక్‌లు,4 సెల్‌ఫోన్లు,ఒక డమ్మీ తుపాకీ, ఒక బటన్ చాకును స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి కొనుగోలు కోసం ఖమ్మం, నకిరేకల్, నల్ల గొండ ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించినట్లు విచారణలో తేలిందని బైక్ దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బుతో ఒడిశా నుంచి గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేసి నల్లగొండ కు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కళాశాల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని విక్ర యిస్తున్నట్లు వెల్లడైందని వివరించారు. అరెస్ట్ అయిన వారిలో కస్పరాజు నాగరాజు,గంటెకంపు మధు కిరణ్, చెన్నపాక సుశాంక్ డెడ్లీ, పెంద్ర వాసు చింటు,సయ్యద్ షోయబ్ షోబి,గంధం శివమణి,చెరుకు దీపక్ పల్లి,నకిరే కంటి ధరణి కుమార్ బబ్లు, ఉన్నారని మనుకర్, ఉదయ్ జున్ను లు పరా రీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐలు సురభి సంపత్, ముత్తయ్య, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్, రబ్బాని, సాగర్ల శంకర్, ఆంజనే యులు, అంజద్, కిరణ్, అంజయ్య, మహేష్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

## గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

3.045 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురు అరెస్టు

బైక్,మొబైల్ స్వాధీనం



ప్రజాపక్షం/నకిరేకల్ : మాదకద్రవ్యాల అక్రమ రవాణా,వినియోగంపై నల్లగొండ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ఈక్రమంలో నకి రేకల్ పోలీసులు చేపట్టిన మెరుపు దాడిలో 3.045 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా,అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.1,52,250 విలువైన గంజాయితో పాటు ఒక మోటార్‌సైకిల్, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ వివరాలను శనివారం నకిరే కల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ హరిబాబు వెల్లడించారు.ఆయనతెలిపిన వివరాల ప్రకారం జూలై 24న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ పి.వీరబాబు సిబ్బందితో కలిసి ఎస్‌హెచ్65 తాటికల్ ఫ్లైఓవర్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో దాడి నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 42(2) ప్రకారం చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తనిఖీలు చేపట్టగా,చెట్ల పొదల్లో గంజాయి సంచిని మధ్యలో ఉంచుకుని గంజాయి సేవించేందుకు సిద్ధమ వుతున్న నలుగురు యువకులను పోలీసులు చుట్టుముట్టారు.ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా సరిహద్దు సమీపంలోని భద్రాచలం అటవీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి నకిరేకల్ ప్రాంతానికి తీసుకొ చ్చినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు బట్ట శివ (23),శాలిగౌరారం మండలం, కన్నెబోయిన కల్యాణ్ (25),నకిరేకల్ ,యన్నమల్ల సాయిరాం అలియాస్ సాయి (25),నకిరేకల్ ,లక్కపాక సంతోష్ (25),నకిరేకల్ పట్టణంకు చెందినవారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గండికోట వంశీ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకు నేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమా వేశంలో నకిరేకల్ ఎస్‌ఐలు వీరబాబు,కృష్ణమాచారి సిబ్బంది పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ మిస్టరీ ఛేదన

కిలాడీ దొంగ అరెస్ట్, 9 తులాల బంగారం స్వాధీనం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలో చోటుచేసుకున్న సంచలనాత్మక చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదిం చారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ దృశ్యాల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 9 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ అదనపు ఎస్పీ జే.రమేష్ తెలిపారు. ఈ కేసు వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 12న పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎన్వీఆర్‌పీవీ ఆర్ గార్డెన్స్ వెనుక భాగంలో ఒక రిటైర్డ్ మహిళ వద్దకు వచ్చిన నిందితుడు అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ, కరివే పాకు కావాలని మాటల్లో పెట్టాడు. ఆమె కరివేపాకు కోస్తుండగా హఠాత్తుగా ఇంట్లోకి ప్రవేశించి మెడలోని 9 తులాల బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కుని యాక్టివా స్కూటీపై పరారయ్యాడు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగభూ షణం నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేప ట్టాయి. దర్యాప్తులో భాగంగా నిందితుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లా (27)గా పోలీసులు గుర్తించారు. హనుమాన్‌పేట్ ఫ్లై ఓవర్ సమీపంలో మరొక స్నాచింగ్‌కు రెక్కి నిర్వహిస్తుం డగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించడంలో కీలక పాత్ర పోషిం చిన మిర్యాలగూడ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్, పీఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించారు. ఈ సమావే శంలో డీఎస్పీ రవి, సీఐ నాగభూషణం, ఎస్‌ఐలు ప్రవీణ్‌కు మార్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ ఎఇ

చెరువు భూములు కబ్జా చేసింది వాస్తవమేనని గుర్తింపు



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/సూర్యాపేట : చివ్వెంల మండలంలోని గుంజలూరు గ్రామంలో పెద్దచెరువు, దొడ్డికుంట చెరువు భూములు కబ్జాకు గురయ్యాయంటూ శుక్రవారం 'ప్రజాపక్షం' దినపత్రికలో "గుం జలూరులో చెరువు భూములు గుటకాయ 'స్వాహా'! " రూ.12కోట్ల విలువైన 30 ఎకరాలకు పైగా భూమి కబ్జా... నిద్రావస్థలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అంటూ ప్రచురితమైన వార్తా కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. చెరువు భూములు కబ్జా చేసింది వాస్తవమేనని గుర్తించారు. శనివారం ఇరిగేషన్ ఏఇ సరితారాణి గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులుతో కలిసి చెరువులను పరిశీలించారు. చెరువులకు ఉన్న హద్దురాళ్ళను తొలగించి కబ్జా చేయడాన్ని చూసి ఆమె అవాక్కయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము చెరువు చుట్టూ గతంలో దాదాపు రూ.15లక్షలు ఖర్చు చేసి హద్దురాళ్ళను ఏర్పాటు చేయడం జరిగిందని అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఆక్రణదారులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు చెరువు భూము లను ఆక్రమించిన వారి పేర్లను అధికారి దృష్టికి తీసుకెళ్ళి లిఖితపూర్వ కంగా వారి పేర్లను అందజేశారు. దీనిపై సమగ్ర సర్వే చేస్తే ఎంత భూమి కబ్జాకు గురి అయ్యిందన్న విషయంతోపాటు మరికొంత మంది కబ్జాదా రుల పేర్లు బయటికి వచ్చే అవకాశం ఉంది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయం

వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల వెల్లడి




ప్రజాపక్షం/నల్లగొండ : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా విద్యార్థుల పోరాట విజయానికి నిదర్శనమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య దర్శి ముదిగొండ మురళి కృష్ణ అన్నారు.శనివారం నల్లగొండ పట్టణంలో ఏఐఎ స్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పులను అంగీకరించకుండా,ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా ఉద్యమించిన విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు.అయితే విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరంతర పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలే దని అన్నారు.కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమా నికి లభించిన విజయమని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 కోట్ల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ,పీడీఎ స్‌యూ నాయకులు ఖమ్మంపాటి శంకర్,ఇందూరు సాగర్ విద్యార్థి సంఘాల నాయకులు పవన్,గాదెపాక సూర్యతేజ,శ్రీకాంత్,మహేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల పోరాట ఫలితమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా

విద్యా వ్యవస్థలో సంస్కరణలు తప్పనిసరి: న్యాయవాదుల సంఘం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యా ప్తంగా విద్యార్థులు చేపట్టిన పోరాట ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల నైతిక విజయమని ఇండి యన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఎ)రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు.శనివారం నల్లగొండ బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశ యువత ప్రాణాలు పణంగా పెట్టి చేసిన పోరాటానికి కేంద్ర మంత్రి దిగివచ్చి రాజీనామా చేయడంతో ప్రభుత్వ తప్పిదం బహిర్గతమైందన్నారు. దేశవ్యాప్తంగా యువత సాగించిన ఉద్యమాలు,ప్రజా ఆందోళనల నేపథ్యంలో ఏర్పడిన పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమా వేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి,న్యాయవా దులు నజీరుద్దీన్,గిరి లింగయ్య గౌడ్,పెరుమాళ్ళ శేఖర్,అన్నపూసల ఐలేష్,పందుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## వట్టె అరెస్టుకు రంగం సిద్ధం?

ముమ్మరంగా పోలీసుల గాలింపు

పోలీసుల అదుపులో కుమారుడు గణేష్!



ప్రజాపక్షం/సూర్యాపేట ఫ సూర్యాపేట మండలం లోని బాలెంల గ్రామ సమీపంలో ఉన్న వజ్రా రైస్ కార్పోరేషన్, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లుల యజ మాని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌ను అరెస్టు చేసేం దుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఉన్నతాధికా రుల ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీధర్ రెడ్డి వట్టె జానయ్య యాదవ్‌తోపాటు వ్యాపార భాగస్వాములుగా ఉన్న అతడి సతీమణి రేణుక, కుమారుడు గణేష్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ సూర్యాపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వారు అందుబాటులో లేకపోవడంతో పోలీసులు ముమ్మ రంగా గాలింపు చర్యలు చేపట్టారు. అతని కుమా రుడు గణేష్‌ను అదుపులోకి తీసుకోగా జానయ్య, అతని సతీమణి రేణుక మాత్రం తప్పించుకు తిరుగు తున్న పరిస్థితి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లుడ్ రైస్ (సిఎంఆర్) కోసం ఈ మిల్లులకు పౌరసరఫరాల శాఖ అధికారులు అప్పగించగా అవి పక్కదారి పట్టిం చినట్లుగా ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం అంది రికి తెలిసిందే. ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో వజ్రా రైస్ కార్పోరేషన్‌లో 11,073.054 మెట్రిక్ టన్నులు, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లులో 18,114.834 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ కొరత విలువ రూ.69 కోట్లుగా అంచనా వేశారు. ఇదిలా ఉంటే ఖమ్మం జిల్లా ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పోరేషన్‌కు ఈ మిల్లుల్లో మిల్లింగ్ చేసిన ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని లారీలో అక్ర మంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. క్రిమినల్ కేసు నమోదైన తరువాత వట్టె జానయ్య యాదవ్‌తోపాటు, ఆయన సతీమణి రేణుక, కుమారుడు గణేష్ అందుబాటులో లేకపోవ డంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గత రెండు రోజులుగా చేపట్టిన గాలింపుల్లో కుమారుడు గణేష్‌ను అదుపులోకి తీసు కున్నారు. జానయ్య యాదవ్, అతని సతీమణి రేణుక ఆచూకి కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు.

# విద్యార్థుల నమోదులో మంచిర్యాల జిల్లా ప్రథమ స్థానం

## కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యసాధనలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్యతో కలిసి యుడైస్ ఆన్‌లైన్ పోర్టల్ ఆధారిత విద్యార్థుల నమోదు నివేదికను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం అదనపు విద్యార్థుల నమోదు లక్ష్యంలో జిల్లా 95.72 శాతం సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది 43,072 మంది విద్యార్థులు ఉండగా, ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 45,350 మంది నమోదయ్యారని, 3,352 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. మందమర్రి, జైపూర్ మండలాలు 100 శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నామని, మౌలిక వసతులు మెరుగుపరచడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.పాఠశాలలు దాటి వెళ్లే విద్యార్థులను తదుపరి ఉన్నత పాఠశాలలు, కెజిబివిలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

# పకడ్బందీగా 'జలసిరి' కార్యక్రమం

## గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క







**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.మంత్రి సీతక్క, సెర్ప్ సీ ఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్,ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు,ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం, విబిజి రామ్ జి పనులు,గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట,ప్రతి ఊరికి ఊట కుంట,కానీ నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు.ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి ,ఈఈ ఆర్డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

# రూ. 200కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం

## కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/రామాయంపేట:** విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మెదక్ జిల్లా రామాయంపేటలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు అత్యంత నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలో 2వందల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల పనులకు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన ఆమె నిర్మాణ విధానాలు, పనుల పురోగతి అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేలాది మంది విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా ఈ విద్యాసంస్థ రూపుదిద్దుకుంటుందని తెలిపారు.భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. సిఎంఓ రాజు, గణాంక అధికారి నవీన్, మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏఈ సఫీతో పాటు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్



**ప్రజాపక్షం/రామాయంపేట:** విద్యార్థి దశ నుండే క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని అప్పుడే భవిష్యత్‌కు మంచి మార్గం ఏర్పడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శనివారం చేగుంట మండల పరిదిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ముందుగా 6,7 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమి తరగతులను పరిశీలించారు. ఫాస్ట్ రైట్ గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాదాన్యతలను తెలుసుకోవాలన్నారు. కేజీవీబీ పరిసరాల చుట్టు పారిశుద్య నిర్వహన బాగుండాలని ఎలాంటి చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్ని కేజీవీబీల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసే విదంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రతి పోటీ పరీక్షల్లో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండె లేక్కల సాదన సులభతరం అవుతుందని యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగపడుతాయన్నారు. ప్రణాళిక ప్రకారంగా ఉపాద్యాయులు విద్యార్థులకు అన్ని బోదించాలని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఉపాద్యాయులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, డిడబ్ల్యూవో హేమబార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గణాంక అధికారి నవీన్‌తో పాటు కేజీబీవీ ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# సదర్మాట్ కెనాల్‌ను శుభ్రపరిచే పనులు షురూ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** 22 తేదీ బుధవ్వారం రోజున ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమ్మైన సదర్మాట్ కాలువ దుస్థితిపై రైతుల్లో ఆందోళన కథనానికి నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి .సదర్మాట్ కెనాల్‌లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగిస్తూ కాలువ శుభ్రపరిచే పనులను ప్రారంభించారు.కాలువలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడం, చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఈ సమస్యను ప్రజాపక్షం దినపత్రిక కథనం : ద్వారా తెలుసుకున్న అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కాలువను శుభ్రం చేయించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ కథనాలు ప్రచురించిన ప్రజాపక్షంకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, సమస్యపై స్పందించి కాలువ శుభ్రపరిచే పనులు చేపట్టిన నీటి పారుదల శాఖ అధికారులకు ధన్యవాదలు తెలియజేశారు.కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి నీటి సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు కొనసాగించాలని రైతులు కోరారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్





# పిల్లల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

## కలెక్టర్ ప్రతీక్ జైన్





**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పిల్లల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర అన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీమ్ 2024 , తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖతో కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమితులైన చైల్డ్ ప్రోటెక్షణ్ అధికారులకు ఒక రోజు సెన్సిటైజేన్ కార్యక్రమాన్ని శనివారం లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆద్వర్యంలో జిల్లా విద్యాశాఖ సమన్వయంతో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. వీరికి పిల్లల రక్షణ హక్కుల పరిరక్షణ పాఠశాల స్థాయిలో బాలల సమస్యలను గుర్తించడం చట్టపరమైన రక్షణ కల్పించడం సంబందిత శాఖలతో సమన్వయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ప్రతి చిన్నారికి సురక్షితమైన భయ, హింస రహితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాద్యత అని పేర్కొన్నారు. ఉపాద్యాయులు ,విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలని సూచించారు. బాలలపై జరిగే వేదింపులు ,బాల్య వివాహాలు ,బాల కార్మిక వ్యవస్థ ,మాదకద్రవ్యాల ప్రభావం ,పోక్స్ చట్టం సైబర్ నేరాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండి ఏవైన అనుమానాస్పద పరిస్థితులు గమనించి న వెంటనే సంబందిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.విద్యార్థుల్లో మానసిక ఒత్తడి ప్రవర్తనా మార్పులను ప్రారంభ ధశలోనే గుర్తించి తల్లిదండ్రులు సంబందిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు పోలీసు సూపరింటెండెంట్ చైతన్య రెడ్డి మాట్లాడుతూ బాలల భద్రతకు సంబందించిన ప్రతి అంశాన్ని ఉపాద్యాయులు అత్యంత భాద్యతగా తీసుకోవాలని సూచించారు. పిల్లలపై జరిగే నేరాలు పోక్సో చట్టం నేరాలు ,సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు నిరంతర అవగాహన కల్పించాలని పిల్లలు ,తల్లిదండ్రులు భయంతో సమస్యలను బయటపెట్టలేని సందర్బాల్లో ఉపాద్యాయులలే ముందుకు వచ్చి సంబందిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీం 2024 లక్ష్యాలను వివరించారు. పాఠశాల స్థాయిలో పిల్లల సమస్యలను గుర్తించి అవసరమైన సందర్బాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థతో సమన్వయం చేసుకుని బాదిత బాలలకు ఉచిత న్యాయ సహాయం కౌన్సిలింగ్ రక్షణ చర్యలు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు కృషి చేయాలని సూచించారు.

# జనగణన హ్యాండ్‌బుక్ తయారీ

## జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** భారత జనగణన 2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గ్రామ, పట్టణ డైరెక్టరీల వివరాల సేకరణపై ఏర్పా టు చేసిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాలు, పట్టణాల స్థాయిలో సేకరించే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో, నాణ్యతతో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు, పరిపాలన, విధాన రూపకల్పనలో ఈ హ్యాండ్‌బుక్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, రహదారులు, రవాణా, సాగునీరు, మౌలిక సదుపాయాల వివరాలను మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ ద్వారా సేకరిస్తామని పేర్కొన్నారు. డేటా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి గురవయ్య, జిల్లా కోఆర్డినేటర్ కృష్ణయ్య, శిక్షకుడు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే చేపట్టాలి



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,మండల తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూ ములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు సింఖ భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు.

# హైకోర్టు న్యాయమూర్తులకు ఘనస్వాగతం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా పర్యటనకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టీస్ తంగిరాల మాధవీదేవి, జస్టీస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి, జస్టీస్ గడి ప్రవీన్‌కుమార్‌లకు ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తులు ముందుగా స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జీ జీవీఎన్ భరతలక్ష్మి , సీపీ సాయిచైతన్య అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, సీసీ అదనపు కలెక్టర్ తదితరులతో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.



# లింబా (బి)గ్రామానికి రూ. కోటి 80 లక్షల నిధులు

## ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** గతంలో ఎన్నడు లేనివిధంగా మా గ్రామానికి రెండు సంవత్సరాల్లో కోటి 80 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని మా గ్రామాభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని లింబా బి సర్పంచ్ తో పాటు గ్రామస్తులు అన్నారు.శనివారం బైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో శివాలయ నిర్మాణానికి10 లక్షల రూపాయల మంజూరు పత్రాన్ని అందించిన సందర్భంగా వారు మాట్లాడారు.అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నారన్నారు.సిసి రోడ్లు మహిళా సమైక్య భవనం,గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు ఇచ్చారని ఆయనకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.ఈ ఎమ్మెల్యేకు శాలువ తో సత్కరించి సంతోషం వ్యక్తం చేశారు.

# భూమి రీ–సర్వేను సద్వినియోగం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని బామ్ని కే గ్రామపంచాయతీ భూ రీ సర్వేలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికై చేసినందుకు,రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ కు మరియు మాజీ శాసనసభ్యులు నారాయణరావు పటేల్ మండల అధికారులకు నాయకులకు గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.తమ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా భూ సమస్యలు పేరుకుపోయాయని ఈ భూమీ రీ సర్వేతో గ్రామ ప్రజల సమస్యలు నెరవేరుతాయని సంతోషం వ్యక్తం చేశారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల గెలుపు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం విద్యార్థుల గెలుపు అని ప్రజాస్వామ్య గెలుపుకు ఇదొక నిదర్శనమని జిల్లా డిసిస అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇన్ని రోజులు బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిందన్నారు. గతంలో నల్ల చట్టాలనుతీసుకవచ్చి రైతులను ఇబ్బంది పెట్టాలని చూశారని, అదేవిధంగా నీట్ పేపర్ లీక్ ద్వారా నైపుణ్యమున్న విద్యార్థులను కాకుండా నైపుణ్యత లేని విద్యార్థులను అం దలాం ఎక్కించే ప్రయత్నం బీజేపీ చేసిందన్నారు. బీజేపీ కేంద్ర క్యాబినెట్‌లో అసమర్థమంత్రులున్నారని ఒకసారి సమీక్షించుకుని సరైన నాయకులను మంత్రులు నియమించి పాలనను ముందుకు నడపాలని రామకృష్ణ హితవు పలికారు. మోడీ ముందుకు ప్రజల ముందుకొచ్చి ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని విద్యార్థులకు జరిగిన అన్యాయంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతీ ఓటరూ.. 'సర్'లో వివరాలు నమోదు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు బలమైన పునాది అని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించేందకునేందుకు తప్పని సరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలయన్స్ స్పేస్ స్టేషన్ ఆపార్ట్మెంట్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు జావితాలో తన పేరు సక్రమంగా ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన బాద్యత అని పేర్కొన్నారు.

# విద్యార్థుల ఐక్యతకు దక్కిన చరిత్రాత్మక విజయం



**ప్రజాపక్షం/ముధోల్ :** నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా, విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెల రోజులుగా దేశవ్యాప్తంగా సాగిన శాంతియుత పోరాటానికి తుది విజయం లభించిందని ఎఐపిఎస్‌యు నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలే పరమేష్ తెలిపారు. విద్యార్థుల సుదీర్ఘ నిరసనలు,ఐక్య పోరాటానికి దిగివచ్చి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేయడం ప్రతీ విద్యార్థి ఐక్యతకు దక్కిన చారిత్రాత్మక విజయమని ఆయన పేర్కొన్నారు. ముధోల్ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏ.ఐ.పి.ఎస్.యూ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ విద్యార్థినులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందోత్సాహాల మధ్య విజయాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనిపై గత నెల రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్ చేశారని,పాలకుల నిర్బంధాలు,అరెస్టులకు బెదరకుండా వీధుల్లోకి వచ్చి చేసిన ఈ సుదీర్ఘ పోరాట ఫలితంగానే ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయక తప్పలేదని పేర్కొన్నారు. ఈ పోరాటంలో భాగస్వాములై మద్దతుగా నిలిచిన ఉమ్మడి జిల్లాలోని ప్రతీ విద్యార్థికి, ప్రజాసంఘాలకు, నిరంతరం అండగా నిలిచిన మీడియా మిత్రులకు విప్లవాత్మక ధన్యవాదాలు తెలిపారు.ఈ విజయం విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, భవిష్యత్తులో విద్యా వ్యవస్థలో ,విద్యార్థులకు ఏ చిన్న అన్యాయం జరిగినా ఏ.ఐ.పి.ఎస్.యూ ముందుండి పోరాడుతుందని పరమేష్ ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.పి.ఎస్.యూ నాయకులు,వసతి గృహ విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోతారు

## మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడి పరిధిలో శనివారం ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయంలో దరఖాస్తు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సకాలంలో బిఎల్‌ఓలకు అందజేయాలని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నాయకులు దూడల అశోక్, సాయి శ్రవణ్, బిఎల్ఓ లక్ష్మీ , మున్సిపల్ సిబ్బంది రామయ్య, శ్రవణ్ పాల్గొన్నారు.

"మైండ్ బెండింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'లూప్' సినిమా షూటింగ్ పూర్తయింది. సస్పెన్స్, థ్రిల్, ఊహించని మలుపులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సిన్మా స్టూడియోస్ బ్యానర్‌పై రాఘవేంద్ర పూజారి, నాగ్ పూజారి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అందాలమ్మ పిక్చర్స్ సమర్పిస్తోంది."

# రీల్




## 'విశ్వనాథ్ అండ్ సన్స్' నుంచి వెడ్డింగ్ సాంగ్ విడుదల

తమిళ నటుడు సూర్య హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. లక్కీ భాస్కర్ చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో పెళ్లి సందర్భంగా వచ్చే వెడ్డింగ్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్ గా నటిస్తోంది. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో బిజీగా ఉంది. రాధిక, రవీనా టాండన్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి ఆగస్టు 14న సినిమాను విడుదల చేయ డానికి సన్నాహాలు చేస్తున్నారు. లక్కీ భాస్కర్ లాగానే విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా కూడా ఒక వైవిధ్యమైన కథతో తీసుకువచ్చానని వెంకీ అట్లూరి తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్ నవీన్ నూలి, కొరియోగ్రఫీ శేఖర్ మాస్టర్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

## విలన్‌గా మోహన్ బాబు స్టిల్స్



'శ్రీనివాస మంగాపురం' సినిమాలో విలన్‌గా మంచు మోహన్ బాబు నటిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న దివంగత రమేష్ బాబు తనయుడు జై కృష్ణ హీరోగా పరిచయమవుతున్న సినిమా శ్రీనివాస మంగాపురం. ఆర్‌ఎక్స్ 100, మంగళవారం వంటి హిట్ సినిమాలు తీసిన అజయ్ భూపతి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. చాలా రోజుల తరువాత మోహన్ బాబు ఈ సినిమాలో విలన్ గా నటిస్తున్నారు. మోహన్ బాబుకు సంబంధించిన వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. రషా తాడని హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అశ్వని దత్ సమర్పణలో జెమిని కిరణ్ నిర్మిస్తున్నారు. జివి ప్రకాష్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చేస్తున్నారు.

# జీవితాంతం గుర్తుండిపోయే పాత్ర చేయాలనుంది

- ఫస్ట్ టైం డిజె టిల్లులో చూసి ఫ్యామిలీ ఆశ్చర్య పోయారు
- డిజె టిల్లు, బలగం సినిమాలతో మంచి గుర్తింపు
- 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూలో నటుడు ఐరేని మురళీధర్ గౌడ్

తెలుగు సినిమా కళామతల్లిని నమ్ముకుని ఉన్న వాళ్లకు ఏదో ఒక రోజు ఖచ్చితంగా హిట్ వస్తుంది అని అంటుంటారు పెద్దలు. ఒక్క హిట్ వచ్చిందా ...వెనక్కి తిరిగి చూడాల్సిన పనుండదు. ఆ ఒక్క హిట్టు కోసమే నటీనటులు, సాంకేతిక నిపుణుల ప్రతి ఒక్కరూ కష్టపడుతుంటారు. అలాంటి ఒకటి కాదు వరుసగా రెండు హిట్లు వచ్చాయి. ఆ రెండు హిట్ సినిమాలతో ఇండస్ట్రీలో ఫుల్ బిజీ అయిపోయారు నటుడు ఐరేని మురళీధర్ గౌడ్. బలగం, డిజె టిల్లు సినిమాలు ఇచ్చిన సక్సెస్ తో ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. టాలీవుడ్ ఫిలిం ఇండస్ట్రీలో అత్యంత బిజీగా ఉన్న క్యారెక్టర్ యాక్టర్ మురళీధర్ గౌడ్ 'బలగం' సినిమాలో మటన్ బొక్క కోసం పెద్ద గొడవ చేశాడీ బావ. బలగం సినిమాలో ఈ సన్నివేశం అత్యంత కీలకమైంది. బలగం సినిమా చూసిన ప్రతి ఒక్కరు మురళీధర్ గౌడ్ ను మరచిపోలేరంటే అతిశయోక్తి కాదు. అన్నపూర్ణ స్టూడియోలో డబ్బింగ్ చెప్తున్న మురళీధర్ గౌడ్ 'ప్రజాపక్షం'కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. మురళీధర్ గౌడ్‌తో చేసిన మాట ముచ్చట ఇది.

**ప్రశ్న : మీ నేపథ్యం గురించి చెప్పండి ?**

**మురళీధర్ గౌడ్:** మాది మెదక్ జిల్లా రామాయన్ పేట గ్రామం. తండ్రి గౌరయ్య గౌడ్ తల్లి రాజమనెమ్మ. నాలుగో తరగతి వరకు ఊర్లోనే చదువా. హెచ్ ఎస్‌సి వరకు గజ్వేల్‌లో చదివిన. పియుసి నుంచి డిగ్రీ వరకు సిద్దిపేటలో చదువుకున్న. 1974లో బిఏ పూర్తి చేశా. కొద్ది రోజులు వ్యవసాయం చేసిన, వ్యాపారం చేశాను. ఇలా చేస్తున్న క్రమంలో విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 1984లో ఏపి ఎస్ఇబిలో ఇఆర్ఒగా మహబూబ్ నగర్ జిల్లా వనపర్తిలో ఉద్యోగంలో జాయిన్ అయ్యాను. 2012లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో పదవీ విరమణ పొందాను.

**ప్రశ్న: యాక్టింగ్ వైపు ఇంట్రెస్ట్ ఎలా పుట్టింది ?**

**మురళీధర్ గౌడ్ :** నేను స్కూల్‌కు వెళ్లే సమయంలోనే సినిమా పోస్టర్లు చూసి అనుకునేవాన్ని యాక్టర్ కావాలని. అవుతానని అప్పుడే నాకు అనిపించేది. పోస్టర్లు సినిమాలు చూస్తుంటే ఇది మనకు పరిచయం ఉన్న ఫీల్ లాగా ఫీలింగ్ వచ్చేది. ఇది మనకు తెలిసిన వ్యవహారమే అనిపించేది. ఒకసారి నేను స్కూల్‌లో ఒక ప్రోగ్రామ్ చేస్తే నాకు బహుమతి కూడా ఇచ్చారు. ఫ్యాషన్ షో లాంటిది చేసిన. అది చూసి అందరూ మెచ్చుకున్నారు. చాలాబాగా చేశావని అప్పటి ఆ సమితి ప్రెసిడెంట్ ఆయన జేబులో నుంచి పది రూపాయలు తీసి ఇచ్చారు నాకు. అప్పట్లో సమితి ప్రెసిడెంట్ అంటే చాలా గొప్ప వ్యక్తి. అంత పెద్ద మనిషి ఆ రోజుల్లో పది రూపాయలు బహుమతిగా ఇచ్చాడంటే నాకు చాలా హ్యాపీగా అనిపించేది.

**ప్రశ్న : సినిమాల్లో అవకాశాలు ఎలా వచ్చాయి ?**

**మురళీధర్ గౌడ్:** రిటైర్మెంట్ తరువాత కొన్ని సీరియల్స్ చేశాను. సీరియల్స్ చేస్తున్నప్పుడు ఆ డైరెక్టర్స్ చెప్పేవారు మీరు సినిమాలో కూడా ట్రై చేయండి అని. ఒకటి రెండు సినిమాలకు గ్రూపుల్లో కూడా నిలబడి చేసిన. అలా వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకున్న. డిజె టిల్లు సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. బలగం సినిమా నాకు మంచి నటుడిగా పేరు తెచ్చి పెట్టింది. పరేషాన్ అనే సినిమాలో ఫుల్ లెన్త్ క్యారెక్టర్ చేసిన. అనిల్ రావిపూడి నాకు భగవంత్ కేసరి సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమాతో నాకు మరింత మంచి పేరు వచ్చింది. అలాగే అనిల్ రావిపూడి తీసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో కూడా చేశాను. తెలంగాణ యాసలో బాగా మాట్లాడిన గలిగిన నాతో అనిల్ రావి పూడి 'సంక్రాంతికి వస్తున్నాం'లో పశ్చిమ గోదావరి యాసలో మాట్లాడించాడు. గోదావరి స్లాంగ్ మాట్లాడం కొత్తగా ఉన్నప్పటికీ చాలా మంచి గుర్తింపు వచ్చింది.

**ప్రశ్న : ఇప్పుడు మీరు చేస్తున్న సినిమాలు, క్యారెక్టర్స్‌తో సంతృప్తిగానే ఉన్నారా ?**


**మురళీధర్ గౌడ్:** ఫుల్ సంతృప్తిగానే ఉన్న. డిజె టిల్లు, బలగం, భగవంత్ కేసరి, సంక్రాంతికి వస్తున్నాం ఇలా వరుసగా అన్ని హిట్ సినిమాలే చేశాను. అన్ని సినిమాల్లో నాకు ఇచ్చిన క్యారెక్టర్ కు న్యాయం చేస్తాను. డిజె టిల్లు , బలగం తరువాత నాకు మంచి గుర్తింపు తెచ్చిన మరో మంచి సినిమా 'వెంకట్రామయ్య గారి తాలూకా' ఈ సినిమాలో ఫుల్ లెన్త్ క్యారెక్టర్ టైటిల్ రోల్ చేసిన. చాలా మంచి సినిమా. నా కెరీర్‌లో చెప్పుకోదగ్గ సినిమా.

**ప్రశ్న : రిటైర్మెంట్ తరువాత ఇంకేం పని చేస్తావు ? ఇంట్లో కూర్చోవచ్చు కూడా అని ఫ్యామిలీ అనలేదా?**

**మురళీధర్ గౌడ్:** ఎటన్న పొమ్మన్నారు... నాది పని చేసే మన స్తత్వం. ఖాళీగా ఉండబుద్ది కాదు టైం వేస్ట్ చెయ్యకూడదు అనేది నా సిద్ధాంతం. ఎప్పుడూ బిజీగా ఉండాలని ఆలోచిస్తుంటాను. అందుకే నేను ఎక్కువగా టైం వేస్ట్ చెయ్యను. కష్టపడి పని చేయాలి అనేది నా తత్వం.

**ప్రశ్న : మీ ఫ్యామిలీ అందరూ కలసి చూసిన సినిమా ఏది ?**

**మురళీధర్ గౌడ్ :** మా ఫ్యామిలీ అందరం కలసి చూసిన సినిమా డిజెటిల్లు. సినిమాలో నన్ను చూసి ఆశ్చర్యపోయారు. యాక్టర్ కావాలనే నా కోరిక ఇంట్లో ఎవరికీ తెలియదు. నేను ఎవరికీ చెప్పలేదు. ఫస్ట్ టైం నన్ను స్క్రీన్ మీద చూసి మావాళ్లంతా ఆశ్చర్యపోయారు.



**ప్రశ్న : మీ మీద ఎవరి ప్రభావం అయినా ఉందా ?**

**మురళీధర్ గౌడ్ :** లేదు... ఎందుకంటే ఒకరి ప్రభావం ఉంటే ఆయన లాగే చేశారు అంటారు లేదా ఆయనను కాపీ కొట్టి చేశారు అంటారు. నాకు అలా ఇష్టం ఉండదు. ఏ క్యారెక్టర్ అయినా నా పద్ధతిలో నేను చెయ్యాలనుకుంటాను. ''సివరిపల్లి'' అనే వెబ్ సిరీస్ చేసిన. ''పంచాయతీ' అనే హిందీ సీరీ స్‌ను తెలుగులో రీమేక్ చేశారు. ఇందులో స ర్పంచ్ క్యారెక్టర్ నాది. పల్లెటూర్లో సర్పంచ్ ఎలా ఉంటారో అలాగే చెయాలి. అయితే నేను ఒరిజినల్ హిందీ పంచాయతీ చూడలేదు. ఇంప్రువైజ్ చేసి సర్పంచ్ క్యారెక్టర్ చేసిన. తరువాత పంచాయతీలో ఉన్నట్టే చాలా పర్ఫెక్ట్‌గా వచ్చింది అన్నారు చూసిన వాళ్లంతా. ఉదాహరణకు కొబ్బరిమట్ట డైరెక్టర్ నాకు ఫోన్ చేసి ఒక సీన్ చెప్పారు. ఇది కరోనా టైం లో జరిగింది. సింగరేణి ఉద్యోగం చేసే తండ్రి , పని పాటలేని కొడుకు. కొడుక్కి ఎదో పని చెప్పి డ్యూటీకి వెళ్లిన తండ్రి తిరిగి వచ్చేవరకు కొడుకు చెప్పిన పని పూర్తి చేయకుండా టివి ముందు కూర్చుని ఉన్నప్పుడు కొడుకుని కోప్పడే సీన్ అది. ఈ సన్నివేశాన్ని వీడియో తీసి పంపండి అని చెప్పారు. నేను మా ఫ్రెండ్‌కు మొబైల్ ఇచ్చి యాజిటీజ్‌గా సింగరేణి ఉద్యోగిలా తయారై ఓ సైకిల్ మీద ఇంటికి వచ్చి, టివి ముం దు కూర్చున్న కొడుకుని కోప్పడే సీన్ చేసి డైరెక్టర్‌కు పంపించాను. యాజిటీజ్‌గా ఇదే సీన్ ప్లాన్ చేసిన అని తరువాత డైరెక్టర్ చెప్పాడు.

**ప్రశ్న : డ్రీమ్ క్యారెక్టర్ ఏమైనా ఉందా ?**

**మురళీధర్ గౌడ్ :** ప్రత్యేకంగా డ్రీమ్ క్యారెక్టర్ ఏమి లేదు కానీ జీవితాంతం గుర్తుండిపోయే పాత్ర ఒకటి చెయ్యాలని ఉంది. ప్రతి క్యారెక్టర్‌ను చాలా ఇష్టంగా చేస్తా. ప్రతి షూటింగ్‌ను ఒక డ్యూటీగా భావించి చేస్తా. ఇప్పటివరకు చేసినవి మంచి క్యారెక్టర్స్ చేశారు. హీరో తండ్రిగా, హీరోయిన్ తండ్రిగా ఇలా రకరకాల పాత్రలు చేస్తున్న. కానీ ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర చేయాలని ఉంది.

## 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కమల్ కామరాజు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యుఆర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు.ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ లుక్స్ లో కనిపిస్తుండగా, వారి బ్యాక్ డ్రాప్‌లో ఒక మహానగరాన్ని చూపించారు. లీడ్ యాక్టర్స్ అంతా బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. న్యూ ఏజ్ కమర్షియల్ థ్రిల్లర్ మూవీని చూడబోతున్నామనే ఇంప్రెషన్ 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఏర్పడుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ మాట్లాడారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ రాజు అడ్డాల, ఎడిటర్ సత్య గిడుతూరి, డిఒపి శివ కృష్ణ, మ్యూజిక్ శ్రావణ్ భరద్వాజ్, కో–ప్రొడ్యూసర్స్ డాక్టర్ విక్రమ్ సింగిరికొండ, బండ సురేందర్ రెడ్డి, ఎన్. విజయ్ ఎస్ రెడ్డి, కరెడ్డి రఘువంశీ రెడ్డి.

## తలొగ్గిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

సంఘీభావంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లా జా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి నుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో వి ద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వి ద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సోమవారం నా టికి ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు.

ప్రధానమంత్రి మృతుల కుటుంబాలను కలిసి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నలుమూలల నుంచి వేలాది మంది యువత స్వచ్ఛందంగా ఈ సభకు హాజరయ్యారని, వారు కాంగ్రెస్ కార్యకర్తలు కాదని, దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువత అన్నారు. 'రాజకీయ పార్టీలు కేవలం విద్యార్థులు, యువత పోరాటానికి మద్దతు ఇచ్చాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించింది మీ పట్టుదల, మీ ఉద్యమమే' అని సిఎం పేర్కొన్నారు. 'రాజకీయ ప్రత్యర్థులను ఈడి, సిబిఐ, ఆదాయపు పన్ను కేసులతో భయపెట్టవచ్చు. కానీ యువత సంకల్పాన్ని ఎవరూ అణచలేరు. లాఠీచార్జీలు, బాష్పవాయు గోళాలు కూడా మీ పోరాటాన్ని ఆపలేకపోయాయి' అని అన్నారు.





**చట్టసభల్లోనూ జెన్‌జీ గళం ప్రతిధ్వనించాలి**

జెన్‌జీ యువత సాధించిన ఈ విజయాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి, వీధుల్లో వినిపించిన గళం చట్టసభల్లోనూ ప్రతిధ్వనించేలా పోరాటాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో 543 మంది లోక్‌సభ సభ్యుల్లో జెన్‌జీ ప్రాతినిధ్యం ఒక్క శాతం కూడా లేదని, కానీ దేశ జనాభాలో జెన్‌జీ యువత వాటా సుమారు 30 శాతం ఉందని ఆయన అన్నారు. యువతకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యాశాఖ, ఐటి వంటి కీలక శాఖలను యువత నడిపితేనే దేశం ప్రపంచంతో పోటీ పడగలదని అభిప్రాయపడ్డారు. దేశంలో యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ గాంధీ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో యువతకు అవకాశాలు విస్తరించాయని చెప్పారు. ప్రస్తుతం 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసులకు అర్హత లభిస్తోందని, కానీ ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేయడానికి మాత్రం 25 ఏళ్ల వయస్సు నిబంధన కొనసాగుతోందని పేర్కొన్నారు. జర్మనీ, గ్రేట్ బ్రిటన్ వంటి దేశాల్లో 18 ఏళ్లకే చట్టసభలకు ఎన్నికయ్యే అవకాశం ఉందని, సింగపూర్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందని ఉదాహరణలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు తొలి వారంలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే, ఎంపిగా పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేస్తామని ప్రకటించారు. అనంతరం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేలా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని తెలిపారు.

**ఐక్యత చాటిన విద్యార్థులు : మహేష్ కుమార్**

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొని తమ ఐక్యతను చాటారని పేర్కొన్నారు. దేశంలో ఏకఛత్రాధిపత్య పాలనకు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావత్ విద్యార్థి లోకం ఏకమైందని అన్నారు. నీట్ వంటి కీలక పరీక్షను కూడా పారదర్శకంగా నిర్వహించలేని దుస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే జెన్‌జీ తరం నుంచి ఒకరిని కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచే యువత పెద్దఎత్తున ప్రజాప్రతినిధులుగా ఎదిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమ ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను ఎత్తివేయాలని వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. విద్యామంత్రి రాజీనామా చేసే వరకు సభను సజావుగా నడవనివ్వబోమని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి, వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయని అన్నారు. చివరకు విద్యామంత్రి రాజీనామా చేయడం ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన విజయమన్నారు. దేశంలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు, విద్యార్థియువజన సంఘాలు ఐక్యంగా పోరాడితే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన అన్నారు.

## ప్రైవేటు కంపెనీలపై విచారణకు హక్కుల కమిషన్‌కు అధికారం లేదు

### హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేటు కంపెనీలు, వాటి ఉద్యోగుల మధ్య తలెత్తే వివాదాలను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారించే అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మానవ హక్కుల కమిషన్ చట్టం1993 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలపైనే కమిషన్ విచారణ జరపాలని పేర్కొంది. వెల్స్ ఫర్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇద్దరు మహిళా ఉద్యోగులు చేసిన ఫిర్యాదులపై హక్కుల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు రద్దు చేసింది.

## బిహార్‌లో నిరసనాగ్ని

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. బంద్ సందర్భంగా శనివారం పాట్నాలోని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని పట్నా జిల్లా యంత్రాంగం ఆదేశించింది. జనశక్తి జనతాదళ్ (జెజెడి) చీఫ్ తేజ్ ప్రతాప్ యాదవ్ మద్దతు తెలిపేందుకు పట్నాలోని రామ్ గులాంచౌక్‌ను సందర్శించారు. అయితే, అనంతరం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సివాన్ జిల్లాలోని జెపి చౌక్ వద్ద ఏఐఎస్ఏ, ఆర్‌వైఏ, ఇతర వామపక్ష సంస్థలు నిరసనలు చేపట్టాయి. మాజీ ఎంఎల్ఏ , సిపిఐ(ఎంఎల్) నాయకుడు అమర్‌జీత్ కుష్వాహా, నిరసన సమయంలో ఎవరైతే అక్కడ ఉన్నారో ఆయన ఈ విషయమై స్పందిస్తూ 'గత 26రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కొనసాగుతోంది. బుధవారం పట్నా వీధుల్లోకి కూ డా విద్యార్థులు వచ్చారు. అయితే, ఢిల్లీ, పట్నా రెం డింటిలోనూ విద్యార్థులు క్రూరమైన పోలీస్ చర్యను ఎదుర్కొన్నారు. మహిళలు, బాలికలను కూడా వదల్లేదు. నిరసనలను అణచివేసే విషయంలో ప్ర భుత్వం నియంతృత్వ వైఖరిని అవలంభించిందని ఆయన ఆరోపించారు. జిల్లాలో నిరసనకారుల వేర్వే రు గ్రూప్‌ల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దుండగులపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి కఠిన చర్య లు తీసుకుంటామని ఎస్ పురన్ చంద్ర ఝా విలేక రులకు తెలిపారు. సారన్ జిల్లాలోని చాప్రాలో నిరసనలు హింసాత్మకంగా మారాయి. అక్కడ విద్యార్థు లు పోలీసు సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జిల్లా పరిపాలనా వాహనానికి నిప్పుపెట్టారు. అనేక ఇతర వా హనాలను ధ్వంసంచేసి బారికేడ్లతో పారిపోయారు. ఔరంగాబాద్ జిల్లాలో నిరసనకారులు రాళ్లురువ్వడంతో ఇద్దరు పోలీస్ అధికారులు, ఒక జర్నలిస్ట్ గా యపడ్డారని అధికారులు చెప్పారు. భాగల్పూర్‌లో స్టేషన్ చౌక్ నుంచి శాంతియుత నిరసన ప్రదర్శన ప్రారంభం కాగా, రద్దీగా ఉండే తిలకమాంఝీ క్రాసింగ్ వద్దకు చేరుకుంటుండగా కొందరు విద్యార్థులు రహదారిని దిగ్బంధించి, పోలీసులపై రాళ్లు రువ్వారు. నిరసన ప్రదేశం సమీపంలో నిరసనకారులు ఒక పోలీస్ వాహనాన్ని తలకిందులు చేశారు. పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉందని భాగల్పూర్ డిఎం అంకృత పాండే చెప్పారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ), రెవల్యూషనరీ యూత్ అసోసియేషన్ (ఆర్‌వైఏ) బ్యానర్లను పట్టుకున్న నిరసనకారులు టైర్లను తగులబెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్తిపూర్–పట్నా రహదారిని దిగ్బంధించారు.

## మళ్లీ ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

పలు విషయాల్లో కోర్టు మెట్లు ఎక్కి అనేకసార్లు ఎదురుదెబ్బలు తిన్నారు. మళ్ళీ మరోసారి ఆయనకు శరాఘాతం తగిలింది. భారీగా దరఖాస్తు రుసుము వసూలు చేసే కొత్త విధానం అమలు చేసే అధికారం లేదని 2026 జూన్ 8వ తేదీన ఫెడరల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి లియో టి.సోరోకిన్ మొదటిసారి తీర్పు చెప్పాక కూడా ట్రంప్ వెనక్కు తగ్గలేదు. ఫెడరల్ విధానంలో మార్పులు చేసి అటువంటి భారీ రుసుము వ సూలు చేసేందుకు చట్టబద్ధ అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో దేశాధ్యక్షుడు ఏం చేయాలన్నా పూర్తిగా చట్టసభ కాంగ్రెస్‌నే మొదట ఆశ్రయించాలి. తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చినాగానీ పూర్తిస్థాయిలో అది అమలులోకి రావాలంటే అనివార్యంగా కాంగ్రెస్ ఆమోదం పొందాల్సిందే. కానీ కాంగ్రెస్‌ను పక్కదారి పట్టించి భారీగా ఈ దరఖాస్తు రుసుము వసూళ్ళకు ట్రంప్ సిద్ధపడ్డా రు. ఈ కోర్టు తీర్పువల్ల భారతీయులకే ఎక్కువగా మేలు జరుగుతుంది. గత ఏడాది డిసెంబరులో ఈ ప్రతిపాదన వచ్చిన వెంటనే డెమోక్రాట్స్ అటార్నీ జనరల్స్ కూటమి కోర్టును ఆశ్రయించింది. బరాక్ ఒబామా అధ్యక్షుడుగా ఉండగా న్యాయమూర్తిగా నియమితులైన సోరోకిన్ తన 42 పేజీల తీర్పులో జూన్‌లో ఒక తీర్పు చెప్పగా, ఇప్పుడు రెండోసారి స్టే ఉత్తర్వులను కూడా మరో న్యాయస్థానం తిరస్కరించింది.

### హెచ్1 బి వీసా నిర్మూలనకు సెనేట్‌లో రిపబ్లికన్ బిల్లు

అపార నైపుణ్యంగల విదేశీయులను అమెరికాలోకి అనుమతించకుండా, దేశీయ అమెరికన్ నిపుణులకు పూర్తి ప్రోత్సాహం ఇచ్చేవిధంగా హెచ్1 బి వీసాను మూడేళ్ళపాటు రద్దు చేయాలని కోరుతూ రిపబ్లికన్‌పార్టీకి చెందిన సెనేటర్ టిమ్ షీహీ ఒక బిల్లు ప్రతిపాదించారు.విదేశీయులను దేశంలోకి రానీయకుండా అడ్డుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం, ఆయన ఎంపీలు గరిష్ఠస్థాయిలో బలమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలలో భాగంగా టిమ్ షీహీ జులై 23వ తేదీన ఈ బిల్లు తీసుకువచ్చారు. ఈ బిల్లులో స్థానిక అమెరికన్లకు కొన్ని రక్షణలు కూడా ఉండాలని ప్రతిపాదించారు. ''హెచ్1 బి దుర్వినియోగ చట్టం–2026'' పేరుతో సెనేట్‌లో ఆయన ఈ బిల్లు ప్రతిపాదించారు. మన అమెరికన్లు చేయలేని, అత్యంత సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వహించడానికి విదేశీ నిపుణులను తెచ్చుకోండి, కానీ అమెరికన్లు చేయగలిగిన పనులకు కూడా అతి తక్కువ జీతాలు చెల్లించేందుకు విదేశాల నుండి నిపుణుల పేరుతో ఉద్యోగులను దిగుమతి చేసుకోవడం స్థానిక అమెక్లన్లకు అన్యాయం చేయడం, వారిని నిరుద్యోగులుగా మార్చడమే అవుతుందని టిమ్ షీహీ వాదిస్తున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com